ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 07.11.2025 | సంపుటి : 12 సంచిక : 107 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# హస్తమే ఆధిక్యం

## జనంసాక్షి సర్వేలో కాంగ్రెస్‌దే పైచేయి

### జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రెండు దఫాల్లో ప్రీపోల్ సర్వే

### అంతిమ ప్రజాతీర్పు అధికారపార్టీవైపే మొగ్గు



**హోరాహోరీగా తలపడుతున్న బీఆర్ఎస్**

**ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్న బీజేపీ**

**డివిజన్లవారీగా కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల ముమ్మర ప్రచారం**

**ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నవారికి 'జనంసాక్షి' తన తుది సర్వే తీర్పును వెలువరించింది. సర్వేల్లో ఇప్పటివరకు మేటి సంస్థగా పేరొందిన 'జనంసాక్షి' సార్వత్రిక ఎన్నికలు సహా అన్ని తరహా ఎన్నికల సమరంలో సహసోపేతంగా సర్వే ఫలితాలు వెలువరించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విషయం విదితమే. తాజాగా మరోసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రీ పోల్ సర్వే ఫలితాలను విడుదల చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రజల్లో ఉన్నది, వారితో పంచుకున్నది, విస్తృతంగా విన్నది తన సర్వే బ్యాలెట్‌లో నిక్షిప్తం చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ పోలింగ్ కంటే ముందే ఓటర్ల నాడీని బహిర్గతం చేసి తెలంగాణ సమాజంలో మరింత ఆసక్తి రేకెత్తించింది.**


హైదరాబాద్, నవంబర్ 06 (జనంసాక్షి) :

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఏడు డివిజన్లలో రెండు దఫాలుగా ప్రీ పోల్ సర్వే చేపట్టగా.. స్వల్ప మార్పులు చేర్పులు మినహా పెద్దగా తేడా లేదు. అధికార పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అంతిమ తీర్పులో గెలుపొందనున్నట్టు జనంసాక్షి సర్వేలో వెల్లడైంది. గురువారం ఏడు డివిజన్లలో రెండోసారి జనంసాక్షి సర్వే కొనసాగించగా.. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లో మినహా మిగతాచోట్ల హస్తం ఆధిపత్యం నడుస్తోంది. రహమాత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ ఆధిక్యం ఉండగా.. సోమాజీగూడ, యూసఫ్‌గూడ, వెంగళ్‌రావ్‌నగర్ డివిజన్లలోనూ 'కారు'ను మించిపోతోంది. షేక్‌పేట డివిజన్‌లో మాత్రం కాంగ్రెస్ భారీగా ఓట్లు కూడగట్టనున్నట్టు సర్వేలో తేలింది.

**సానుభూతి వర్సెస్ సానుభూతి**

ఒకవైపు కీర్తిశేషులైన మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీత గెలుపు కోసం బీఆర్ఎస్ అగ్రనేతలు సర్వశక్తులూ ఒడ్డుతుండగా.. మరోవైపు అధికార పార్టీ టికెట్ పొందిన నవీన్ యాదవ్ కూడా తన శక్తినంతా కూడదీసి ప్రచారంలోకి దిగారు. గతంలో రెండుసార్లు ఓటమి పాలయ్యారనే అభిప్రాయం స్థానికుల్లో బలంగా ఉండగా..

మిగతా 2లో..




నియోజకవర్గవ్యాప్తంగా పార్టీలవారీగా ఓటింగ్ శాతం

| కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ |
|---|---|---|
| 48.5% | 44% | 7.5% |

డివిజన్‌ల వారీగా ఓటింగ్ శాతం

| | కాంగ్రెస్ | బీఆర్ఎస్ | బీజేపీ |
|---|---|---|---|
| రహమత్‌నగర్ | 55% | 39% | 5.4% |
| బోరబండ | 33% | 60% | 6.8% |
| సోమాజీగూడ | 49.5% | 42% | 7.7% |
| యూసఫ్‌గూడ | 48% | 38% | 14% |
| వెంగళరావ్‌నగర్ | 53% | 42% | 4.5% |
| ఎర్రగడ్డ | 43% | 52% | 5% |
| షేక్‌పేట్ | 53.2% | 35% | 11.7% |

## బీఆర్ఎస్ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

**జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యంగా సాగాలి**

- చిన్న ఏమరపాటు కూడా పనికి రాదు
- ఈ మూడు రోజులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి
- ప్రతి ఓటరును కలిసి మన వాయిస్ వినిపించాలి
- మంత్రులు, పార్టీ నేతలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



హైదరాబాద్(జనంసాక్షి):జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించారు. ఇక్కడ ఖచ్చితంగా గెలవబోతున్నామని, అందువల్ల మెర్జీ కోసం కృషి చేయాలన్నారు. అలాగే ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ బూత్‌కు వచ్చి ఓటేసేలా చూసుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ఛార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గత నెల 31, ఈ నెల 1, 4, 5 తేదీల్లో నియోజకవర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో.. క్షేత్రస్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి....ఇంటింటికి తిరిగి ప్రచారం

మిగతా 2లో..

### నేటి మంత్రివర్గ సమావేశం
## 12కు వాయిదా

2లో..



## బీహార్ తొలివిడత ప్రశాంతం

- 60.13శాతం పోలింగ్
- ఓటేసిన పలువురు ప్రముఖులు
- డిప్యూటి సీఎం సిన్హా కారుపై దాడి

పాట్నా(జనంసాక్షి):బిహార్‌లో తొలి విడత పోలింగ్ చెదురుమదురు ఘటనల మధ్య ముగిసింది. సాయంత్రం 5గంటల వరకు 60.13శాతం పోలింగ్ నమోదైనట్టు ఈసీ ప్రకటించింది. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు ఆరంభంలోనే ఓటుహక్కు వినియోగించుకున్నారు. పట్నాలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన సతీమణి రబ్రీ దేవి, మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ ఆయన సతీమణి రాజశ్రీ యాదవ్, లాలూ కుమార్తెలు మీసా భారతి, రోహిణి ఆచార్య ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్, బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా లఖిసరయ్‌లో ఓటు వేశారు. మరో కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) పట్నాలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రమంత్రి నిత్యానంద్ రాయ్, ఆయన సతీమణి హాజీపూర్‌లోని పోలింగ్

మిగతా 2లో..



## జూబ్లీహిల్స్‌లో గ్రామస్థాయి అభివృద్ధి కూడా లేదు

- ఇందులో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాత్ర కూడా ఉంది
- ప్రచారంలో గత హామీలపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్
- సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదే
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఉప ఎన్నిక అంశంలో ఇంకా సర్వేలలో స్పష్టత లేదని చెప్పారు. సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో భారత రాష్ట్రసమితికి మూడో స్థానం వచ్చిందన్న ఆయన.. ఓటర్లలో ఏ పార్టీకి ఓటు వేయాలో ఇంకా స్పష్టత లేదని చెప్పారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం లో 6 గ్యారంటీలను గానీ, 400 పైచిలుకు హామీల గురించి గానీ ఎక్కడా ప్రస్తావించడం లేదని, వ్యక్తిగత విమర్శలు చేయడంపైనే దృష్టి పెడుతోందని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనేక సమస్యలున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్‌లో లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఏ పార్టీకి ఓటు వేయాలనే దానిపై ఓటర్లు ఇంకా నిర్ణయానికి రాలేదని.. అందుకే సర్వేల్లో కూడా స్పష్టత లేదని కిషన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ వెనుకబాటుకు గతంలో పాలించిన బిఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి డిమాండ్

మిగతా 2లో..

## కనీసం గతంలో వచ్చిన ఓట్లైనా తెచ్చుకోగలరా?

- జూబ్లీహిల్స్‌లో మీకు కనీసం 10వేల కోట్లు కూడా రావు
- కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం సవాల్



హైదరాబాద్(జనంసాక్షి):కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి సవాల్ విసిరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థికి 25 వేల ఓట్లు వచ్చాయని, ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో 25 వేలకు ఒక్క ఓటు తగ్గకుండా తీసుకువస్తే.. మీరేం చెబితే అందుకు తాను సిద్ధం అని చెప్పారు. 25 వేల ఓట్లు బీజేపీ అభ్యర్థికి రాకపోతే.. తాను చెప్పింది చేయడానికి కిషన్ రెడ్డి సిద్ధమా? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పదివేల లోపే బీజేపీకి ఓట్లు వస్తాయని పొన్నం ప్రభాకర్ జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా

మిగతా 2లో..

## తెలంగాణలో డ్రగ్, గన్ కల్చర్ తెచ్చిందే కేటీఆర్

**బీఆర్ఎస్ హయాంలో ఎన్నికల వాగ్దానాలు, లక్షలాది కోట్ల అప్పుల సంగతేమిటీ?**

**ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బంది కరంగా ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం: మంత్రి తుమ్మల**

2లో..



## చారిత్రక కట్టడాల వద్ద మెట్రో నిర్మాణ మ్యాప్‌ను సమర్పించండి

**హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్(జనంసాక్షి): పాతబస్తీలో మెట్రో నిర్మాణ విషయంలో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. మెట్రో నిర్మాణాల వల్ల చారిత్రక కట్టడాలు దెబ్బతింటున్నాయని, పురావస్తు అనుమతి కూడా తీసుకోలేదని ఏపీ డబ్ల్యూఎఫ్ పిటిషన్ దాఖలు చేసింది. చారిత్రక కట్టడాల

మిగతా 2లో..

## బీహార్ ఎన్నికల్లో ఓట్ల చోరీకి బీజేపీ యత్నం



**దేశాన్ని జంగిల్‌రాజ్‌గా మార్చారు**

**పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తే ఎన్డీఏ పతనం ఖాయం: రాహుల్ గాంధీ**

**ఓట్ చోరీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత యువకులపై ఉందని వెల్లడి**

పాట్నా(జనంసాక్షి):బిహార్ ఎన్నికల్లో ఓట్లు చోరీ చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత యువకులపైన ఉందని తెలిపారు. పూర్ణియాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ప్రతీ ఎన్నికల్లో ఓట్లు చోరీ చేసి గెలుస్తుందని విమర్శించారు. యువతకు ఉపాధి కల్పించకుండా మోదీ కోటీశ్వరుల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకపడిన ఆయన, రాష్ట్ర యువతను కార్మికులుగా మారుస్తున్నారని మండిపడ్డారు."బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి హరియాణా ఎన్నికల్లో ఓట్లు చోరీ చేసిందని ప్రపంచానికి చూపించాం. అచ్చం అలాగే బిహార్‌లో కూడా ఓట్లు చోరీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని

మిగతా 2లో..

## జంగిల్‌రాజ్ వల్ల బీహార్‌లో అభివృద్ధి శూన్యం

- చొరబాటుదారులపై ఆర్‌జేడీ, కాంగ్రెస్ మెతక వైఖరి
- బిహార్ ఎన్నికల ర్యాలీలో ఆర్‌జేడీపై ప్రధాని మోదీ ఫైర్



పాట్నా(జనంసాక్షి):బిహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ వేళ విపక్ష ఆర్‌జేడీపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫైర్ అయ్యారు. 15 ఏళ్ల ఆర్‌జేడీ జంగిల్ రాజ్ వల్ల రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. గురువారం రోజు బిహార్‌లోని అరారియాలో ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రసంగిస్తూ నిల్ బటే సన్నాటా అనే పదాన్ని ప్రధాని ప్రయోగించారు. 'సున్నాను సున్నాతో భాగిస్తే ఏమీ మిగలదు' అని దానర్థం. జంగిల్ రాజ్ కాలంలో ఎన్ని ఎక్స్‌ప్రెస్ వేలు, వంతెనలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, టూరిస్ట్ సర్క్యూట్‌లు నిర్మించారు అంటే వచ్చే సమాధానం సున్నా అని మోదీ విమర్శించారు. 1990 నుంచి 2005 వరకు సాగిన జంగిల్ రాజ్ వల్ల యావత్ బిహార్ రాష్ట్రం నాశనమైందన్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నామనే పేరుతో ఖజానాను ఆర్‌జేడీ లూటీ చేసిందని ఆరోపించారు.'15 ఏళ్ల జంగిల్ రాజ్‌లో కోసీ నదిపై ఎన్ని వంతెనలు కట్టారు ? సున్నా. కనీసం ఒక్కటి కూడా నిర్మించలేదు. అస్సలు రాష్ట్ర ప్రజలను పట్టించుకోలేదు. అప్పట్లో బిహార్‌ను పాలించిన జంగిల్ రాజ్ పార్టీలు తామే

మిగతా 2లో..

## వలసలపై ట్రంప్ ఉక్కుపాదం




### 80వేల వీసాల రద్దు!

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ వలసేతర వీసాలపైనా కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో జనవరి నుంచి 80 వేలకుపైగా వలసేతర వీసాలను ట్రంప్ యంత్రాంగం రద్దు చేసినట్లు తెలిసింది. హింస, చోరీ కేసుల నుంచి మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినవారే ఇందులో అధికంగా ఉన్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి అమెరికా వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించగా.. వైట్‌హౌస్ దీన్ని ధ్రువీకరించింది. ఈ ఏడాది జనవరిలో ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం అక్రమ వలసదారులను వెనక్కి పంపించే కార్యక్రమం చేపట్టారు. దీంతోపాటు సోషల్ మీడియా వెట్టింగ్ (వీసా జారీ చేయడానికి ముందు అభ్యర్థి సోషల్ మీడియా ఖాతాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించడం)తో పాటు స్క్రీనింగ్‌ను విస్తృతం చేశారు. స్థానిక చట్టాలను ఉల్లంఘించే వారి వీసాల రద్దును ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే వీసాల రద్దు గతంతో పోలిస్తే రెట్టింపు అయినట్లు స్థానిక

మిగతా 2లో..

## ఏడు కాదు.. ఎనిమిది యుద్ధవిమానాలు కూలిపోయాయి

**భారత్,పాక్‌లతో వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకుంటానని బెదిరించడంతోనే వెనక్కు తగ్గాయి**


**ఇరు దేశాల ఘర్షణలపై ట్రంప్ సరికొత్త వాదన**

9లో..

## దేశ రక్షణలో నూతన అధ్యాయం..

### ఐఎన్ఎస్ ఇక్షక్ జలప్రవేశం

కొచ్చి(జనంసాక్షి):దేశ రక్షణలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కొచ్చిలోని సదరన్ నేవల్ కమాండ్‌లో ఐఎన్ఎస్ ఇక్షక్ జల ప్రవేశం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఐఎన్ఎస్ ఇక్షక్ ద్వారా సముద్ర సర్వే వ్యవస్థలో కీలక ముందడుగు పడింది. ఈ నౌకను గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ సంస్థ.. 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించింది. ఇక్షక్ జల ప్రవేశ కార్యక్రమానికి నౌకాదళ అధిపతి దినేశ్ కె త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



# 'హస్తమే' ఆధిక్యం

రాజకీయాల్లో పెద్దగా అనుభవం లేని మాగంటి సునిత ప్రతిపక్ష పాత్ర ఎలా పోషిస్తుందోనన్న ప్రశ్నలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఉన్నది మూడేండ్లే కాబట్టి అధికార పార్టీ అభ్యర్థిని ఆదరించాలనే వాదన ఓటర్లలో వినబడుతోంది. అభివృద్ధితో పాటు అవకాశం కూడా ఇచ్చినట్లవుతుందని ప్రజలు భావిస్తున్నారు.

# ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలి

**చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సుప్రీంకోర్టు రోడ్డు భద్రత కమిటీ సమీక్ష**

**హైదరాబాద్(జనంసాక్షి):** చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సుప్రీంకోర్టు రోడ్డు భద్రత కమిటీ సమీక్ష నిర్వహించింది. సుప్రీంకోర్టు నియమించిన రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే, సభ్యులు సంజయ్ బందోపాధ్యాయ ఇవాళ హైదరాబాద్‌కు విచ్చేసి.. చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి గల కారణాలను కమిటీ అడిగి తెలుసుకుంది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి.. ప్రమాదం జరగడానికి గల కారణాలను కమిటీకి తెలియజేశారు. ఆర్టీసీ బస్సుల ఫిట్‌నెస్ మరోసారి తనిఖీ చేయాలని, వాటితో పాటు ఇతర బస్సులు, కమర్షియల్ వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలని అధికారులను కమిటీ ఆదేశించింది.ప్రతి వాహనం ఇన్సూరెన్స్, పర్మిట్, ఫిట్‌నెస్ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి విస్తరణ పనులను తొందరగా చేపట్టి పూర్తి చేయాలని ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులకు సూచించారు. మైనింగ్ క్వారీల నుంచి పరిమితికి మించి లోడ్ వెళ్లకుండా చూడాలని మైనింగ్, రవాణా శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రత నిధిని ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రతా కమిటీ సమావేశంలో రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మైనింగ్ డైరెక్టర్ భవేశ్ మిశ్రా, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, ఆర్టీసీ, ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులు పాల్గొన్నారు.

# వలసలపై ట్రంప్ ఉక్కుపాదం..



మీడియా కథనాలు వెల్లడించాయి.ఈ జనవరి నుంచి చూస్తే.. మద్యం సేవించి డ్రైవింగ్ చేసిన వారికి సంబంధించి 16వేల వీసాలను రద్దు చేసినట్లు తెలిసింది. దాడుల్లో ప్రమేయమున్న 12 వేల మంది, చోరీ కేసుల్లో ఉన్న 8 వేల మంది ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది రద్దైన వీసాల్లో ఈ మూడు విభాగాల నుంచే దాదాపు సగం ఉన్నట్లు అంచనా. మొత్తంగా జనవరి నుంచి 80 వేలకుపైగా వీసాలను రద్దు చేశారని, అందులో 8వేల విద్యార్థి వీసాలు ఉన్నట్లు వాషింగ్టన్ ఎగ్జామినర్ తాజా కథనం పేర్కొంది. ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తూ వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

**విద్యార్థి వీసాలనూ..**

గడువు ముగిసినా అక్రమంగా దేశంలో ఉండటం, స్థానిక చట్టాలను ఉల్లంఘించిన 6 వేలకుపైగా విద్యార్థుల వీసాలను రద్దు చేసినట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఆగస్టులో వెల్లడించారు. వీరిలో కొందరు ఉగ్రవాదానికి మద్దతు తెలిపిన వారు ఉన్నారని చెప్పారు. సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరుగురి వీసాలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. తమ విదేశాంగ విధానానికి విరుద్ధంగా.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, విద్యార్థుల వీసాలను రద్దు చేస్తున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో గతంలో ఓ సందర్భంలో ప్రకటించారు. ఈ సంఖ్య వందలు, వేలల్లో ఉండవచ్చన్నారు. అందుకు తగినట్లుగానే వేలాది సంఖ్యలో వీసాలు రద్దుచేసినట్లు తెలుస్తోంది.

**పాలస్తీనీయన్లకు మద్దతు తెలిపినా..**

అమెరికాకు ముప్పుగా పరిణమించే వీసా దరఖాస్తు దారులపట్ల అప్రమత్తంగా ఉండాలని విదేశాల్లోని తమ దౌత్యవేత్తలకు అమెరికా విదేశాంగశాఖ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. పాలస్తీనీయన్లకు మద్దతుగా లేదా గాజాలో ఇజ్రాయెల్ చర్యలను తప్పుపడుతూ వ్యాఖ్యలు చేసే విద్యార్థులు, గ్రీన్ కార్డు దారులకూ బహిష్కరణ ముప్పు తప్పదని విదేశాంగశాఖ హెచ్చరించిందని తెలిసింది. ఇటువంటి వ్యాఖ్యలు హమాస్ భావజాలాన్ని ప్రతిబింబించడంతోపాటు అమెరికా విదేశీ విధానాన్ని ప్రమాదంలో పడేస్తాయని అభిప్రాయపడినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

# బీఆర్ఎస్ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి

చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశంచేసినట్లు తెలుస్తోంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలువబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. మంత్రులు, పార్టీ నాయకులు అందరూ మూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి గట్టిగా కౌంటర్ ఇవ్వాలని సూచించారు. మంత్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోజుకో సర్వేను వదులుతూ ప్రజలను, ఓటర్లను బీఆర్ఎస్ సోషల్ మీడియా గందరగోళానికి గురి చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఫీల్డ్ లో కాంగ్రెస్ కు బలం ఉందని, నవీన్ యాదవ్ మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని గ్రౌండ్ రిపోర్టులు చెబుతున్నాయని అన్నారు. ప్రచారానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉందని, ప్రతి గంటనూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఓటరుకు మన వాయిస్ చేరాలని అన్నారు. మనం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు చేర్చే బాధ్యతను మంత్రులు, పార్టీ నాయకులు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు రోజుల్లో పోల్ మేనేజ్మెంట్ పై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటి వరకు సాగిన ప్రచారంపై రివ్యూ చేశారు. ఈ సెగ్మెంట్ లో పోలింగ్ పర్సంటేజీ పెంచడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం ఈ రివ్యూలో సూచించినట్టు సమాచారం. ఇక్కడ మొత్తం 4,01,365 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,08,561మంది, మహిళలు 1,92,779 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. వీళ్లంతా 139 పోలింగ్ కేంద్రాల్లోని 407 పోలింగ్ బూత్ లలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ చాలా తక్కువగా పోలింగ్ శాతం నమోదవుతోంది.ఇక్కడ 2009 లో 52.76శాతం , 2014లో 50.18, 2018లో 45.59 2023లో 47.49 శాతం పోలింగ్ నమోదవుతోంది. దానిని పెంచడం, ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రం వరకూ వచ్చేలా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం చెప్పినట్టు సమాచారం. దీంతో పాటు బస్తీల వారీగా పరిస్థితిని కూడా సీఎం సమీక్షించినట్టు తెలుస్తోంది.

# చారిత్రక కట్టడాల వద్ద మెట్రో నిర్మాణ మ్యాప్‌ను సమర్పించండి

సమీపంలో ఎలాంటి పనులు చేపట్టొద్దని నిబంధనలున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపించారు. పాతబస్తీ అభివృద్ధికి మెట్రో ఎంతో కీలకమని కోర్టుకు వివరించారు. మెట్రో రెండో దశ డిజైన్, నిర్మాణ పనుల గురించి ప్రధాన న్యాయమూర్తి ఏఏజీని ప్రశ్నించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు రెండో దశ మెట్రో పనులు చేపట్టినట్లు ఏఏజీ వివరించారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడానికే పిటిషన్ దాఖలు చేశారన్నారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం.. నిర్మాణ పనులకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని కోరింది. నిర్దేశిత చారిత్రక కట్టడాల వద్ద మెట్రో నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

# నేటి మంత్రివర్గ సమావేశం 12కు వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** నేడు జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 12వ తేదీన తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. హైకోర్టు తీర్పు కారణంగా వాయిదా పడిన స్థానిక ఎన్నికలపై చివరిసారిగా జరిగిన కేబినెట్‌లోనూ క్లారిటీ రాలేదు. నవంబర్ 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ శుక్రవారం జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని ఈ నెల 12వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అమల్లో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తున్నట్టు గత కేబినెట్ సమావేశం సందర్భంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 21(3)ని తొలగించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

# కనీసం గతంలో వచ్చిన ఓట్లైనా తెచ్చుకోగలరా?

యూసఫ్ గూడలో ప్రచారంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'మా అభ్యర్థి యువకుడు, స్థానికుడు, ఉత్సాహవంతుడు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధికి అవకాశం ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. గతంలో అధికారంలో ఉండి కూడా అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు మావైపు ఉన్నారు. మేము అధికారంలోకి వచ్చి అందించిన అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు కాంగ్రెస్ పార్టీ తరఫున సానుకూలంగా ఉన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలు ఏ విధంగా కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని అభివృద్ధి చేయించు కుంటున్నారో.. ఇక్కడి ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీని గెలిపించి అభివృద్ధి చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ పెన్షన్లు ఇచ్చిన నిధులను కూడా లెక్క చెబితే.. అది అభివృద్ధి అవుతుందా?. అభివృద్ధి చేయడం అంటే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా డెవలప్ చేయడం. ఈ రెండు నెలల్లోనే ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరంగా 2500 కోట్ల అభివృద్ధి పనులను చేశామని అన్నారు. 'దివంగత మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదు. ఇక మా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇక్కడ సమస్యలను రిప్రెంటేషన్ చేయడంలో విఫలమయ్యాడు. భవిష్యత్తులో జూబ్లీహిల్స్ సంబంధించిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కిషన్ రెడ్డికి సహకరించింది. అందుకే ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గురుదక్షిణగా బీజేపీ అభ్యర్థిని బీఆర్ఎస్కు తాకట్టు పెట్టాడు. మీ ప్రచారం సరళి చూసిన ప్రజలు మీ సొంత ఎమ్మెల్యే రాజాసింగ్ బీఆర్ఎస్ పార్టీకి లొంగిపోయారని అంటున్నారు. బీఆర్ఎస్, బీజేపీలో మీ ఓటు ఎటు వేసిన సరే అనే ప్రవర్తన కనిపిస్తుందని ప్రజలే అంటున్నారు. మీరు కేంద్ర మంత్రిగా ఉన్నారు.. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నారు. ఈ శాసనసభ నియోజకవర్గంలో కూడా మీ పార్లమెంట్ పరిధిలోకే వస్తది. మరి నా చాలెంజ్ కు కిషన్ రెడ్డి సిద్ధమా?. ప్రజల స్పందన చూస్తే కచ్చితంగా మెజారిటీతోనే జూబ్లీహిల్స్ గెలవబోతున్నాం' అని మంత్రి పొన్నం ధీమా వ్యక్తం చేశారు.



# తెలంగాణలో డ్రగ్, గన్ కల్చర్ తెచ్చిందే కేటీఆర్

- బీఆర్ఎస్ హయాంలో ఎన్నికల వాగ్దానాలు, లక్షలాది కోట్ల అప్పుల సంగతేమిటీ?
- ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బంది కరంగా ఉన్నప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం
- రాష్ట్రంలో పెట్టుబడులకు రోజుకో పారిశ్రామిక వేత్త వస్తున్నారు: మంత్రి తుమ్మల



**హైదరాబాద్(జనంసాక్షి):** సీఎం రేవంత్ రెడ్డి పెట్టే ఇబ్బందుల కారణంగానే పారిశ్రామిక వేత్తలు తెలంగాణ వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు తెలంగాణలో డ్రగ్, గన్ కల్చర్ తెచ్చిందే కేటీఆర్ అని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలు తెలంగాణ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని కేటీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గురువారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఓట్ల కోసం ఇచ్చిన వాగ్దానాలు, లక్షలాది కోట్ల బాకీల సంగతి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బంది కరంగా ఉన్నప్పటికీ గడిచిన 20 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదన్న తుమ్మల.. పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు రోజుకొకరు తెలంగాణకు వస్తున్నట్లు చెప్పారు.

# బీహార్ ఎన్నికల్లో ఓట్ల చోరీకి బీజేపీ యత్నం

నాకు అనిపిస్తుంది. గత బిహార్ ఎన్నికల్లో కూడా ఓట్లను దొంగిలించారు. ఓట్ చోరీలో నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల సంఘం పాత్ర ఉంది. దీనిని అడ్డుకుని రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత బిహార్ యువతపైన ఉంది. మీరందరూ పోలింగ్? బూత్‌లో చాలా జాగ్రత్తగా ఉండాలి."అని అన్నారు."బిహార్ అభివృద్ధి పథంలో దూసుకుపోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులు బిహార్‌లో స్థాపించాలి. బిహార్ గ్లోబల్ టూరిజం, ఇండస్ట్రియల్ హబ్‌గా మారాలి. కానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బిహార్ ముఖ్యమంత్రి ఈ పనులను కానివ్వరు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతిలో నీతీశ్ కుమార్ రిమోట్‌గా మారడం వల్లే ఏ పని చేయలేకపోతున్నారు. బిహార్ ప్రభుత్వం నీతీశ్ కుమార్ చేతుల్లో లేదు. బిహార్, దిల్లీ అధికారులతో పాటు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేతుల్లోనే ప్రభుత్వం ఉంది." అని రాహుల్ గాంధీ అన్నారు. అనంతరం ఆరారియాలో నిర్వహించిన మరో ర్యాలీలో పాల్గొన్న రాహుల్ గాంధీ, దేశాన్ని జంగిల్ రాజ్యంగా మార్చారని ప్రధాని మోదీ, అమిత్ షాపై మండిపడ్డారు. నీతీశ్ బిహార్‌లోని జంగిల్ రాజ్ గురించి మాట్లాడుతున్నారని, కానీ ప్రధాని మోదీ, షా దిల్లీతో పాటు దేశవ్యాప్తంగా అలాంటి పరిస్థితిని తెచ్చారని ఆరోపించారు.

# బీహార్ తొలివిడత ప్రశాంతం

కేంద్రంలో ఓటు వేశారు.వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్, మహాగఠ్‌బంధన్ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థి ముకేశ్ సహనీ తన కుటుంబంతో కలిసి దర్భంగాలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా లఖిసరాయ్‌లో ఉపముఖ్యమంత్రి విజయకుమార్ సిన్హా వాహనాన్ని ఆర్‌జేడీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఆర్జేడీ శ్రేణులను చెదరగొట్టారు. ఉదయం 7గంటలకు 121 స్థానాల్లో మొదలైన తొలిదశ పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. భద్రతా కారణాలతో 5నియోజకవర్గాల్లో 5గంటలకే ముగిసింది. వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రముఖులు తమ తమ ప్రాంతాల్లో ఆరంభంలోనే ఓటుహక్కు వినియోగించుకున్నారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్ భక్తియార్‌పుర్‌లో ఓటువేశారు. మరోసారి ఏన్డీయే ప్రభుత్వం మళ్లీ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్, ఎంపీ రవిశంకర్ ప్రసాద్, ఆయన సతీమణి మాయాశంక పట్నాలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా లఖిసరాయ్‌లో ఓటు వేశారు. కేంద్రమంత్రి, రామ్ విలాస్ పార్టీ చీఫ్ చిరాగ్ పాశవన్ ఖగారియాలో ఓటు వేశారు. మాజీ సీఎం, లాలూప్రసాద్, ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుడు, మాజీ మంత్రి తేజస్వీ యాదవ్ పట్నాలో ఓటువేశారు. బిహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నట్లు లాలూ తెలిపారు. జన్‌శక్తి జనతాదళ్ జాతీయ అధ్యక్షుడు, లాలూ పెద్దకుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పట్నాలో ఓటువేశారు.

**హరియాణాలో 25 లక్షల నకిలీ ఓట్లు**

ఈ విడత ఎన్నికల్లో మొత్తం 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 3.75 కోట్ల మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. తొలివిడత ఎన్నికలకు 45,341 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేశారు. జేడీయూ 57 స్థానాలు, భాజపా 48, ఎల్‌జేపీ 14, ఆర్‌ఎల్‌ఎం రెండు స్థానాల్లో పోటీ చేస్తోంది. ఆర్‌జేడీ 73, కాంగ్రెస్ 24, సీపీఐ-ఎంఎల్ 14 చోట్ల పోటీకి నిలిచింది. ప్రశాంత్‌కిశోర్ సారథ్యంలోని జన్‌సురాజ్ పార్టీ నుంచి 119 మంది పోటీ చేస్తున్నారు. తొలివిడతలో తేజస్వీతోపాటు భాజపా నేత సామ్రాట్ చౌధరి, ఇద్దరు డిప్యూటీ సీఎంలు, 14 మంది మంత్రులు పరీక్షను ఎదుర్కొంటున్నారు.

**డిప్యూటీసీఎంకు చేదు అనుభవం**

లఖిసరాయ్‌లో ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హాకు చేదు అనుభవం ఎదురైంది. ఓటు వేసి వెళ్తున్న ఆయన వాహనాన్ని ఆర్‌జేడీ మద్దతుదారులు కొందరు అడ్డుకున్నారు. ఆయన కారుపై చెప్పులు, పేడ విసిరారు. విజయ్ సిన్హాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్‌జేడీ శ్రేణులు ఓటర్లను బెదిరిస్తున్నారని ఆరోపించిన ఆయన, అక్కడి నుంచే జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి మాట్లాడారు. అదనపు బలగాలను పంపించాలని ఆదేశించారు. అత్యంత వెనుకబడినవర్గాల ప్రజలు ఓటు వేయకుండా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ఆర్‌జేడీ గూండాలు తన వాహనంపై దాడి చేశారని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్‌జేడీ అధికారంలో లేకుంటేనే పరిస్థితి ఈవిధంగా ఉందని, అధికారంలో ఉంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో ప్రజలు అర్థం చేసుకోవాలని విజయ్‌సిన్హా అన్నారు. మరోవైపు సిన్హా ఆరోపణలను అజయ్‌కుమార్ సింగ్ తోసిపుచ్చారు. ఓడిపోతానన్న భయంతోనే విజయ్‌కుమార్ సిన్హా తమపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

**లఖిసరాయ్ ఘటనపై స్పందించిన ఈసీ**

మరోవైపు లఖిసరాయ్ ఘటనపై స్పందించిన ఈసీ బాధ్యులపై వెంటనే చర్యలు తీసు కోవాలని ఆదేశించింది. ఎవరూ కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవటానికి అనుమతించబోమని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. బాధ్యులపై కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై తీవ్ర దుమారం రేగటంతో కేంద్ర ఎన్నికల సంఘం బిహార్ ఎన్నికలను నిశితంగా పర్యవేక్షిస్తోంది. తొలి విడత పోలింగ్ జరుగుతున్న 45వేలకుపైగా పోలింగ్ కేంద్రాల నుంచి వెళ్తున్న లైవ్ ఫీడ్‌ను ముగ్గురు కమిషనర్లు పరిశీలిస్తున్నారు. బిహార్‌లో తొలిసారి అన్నిపోలింగ్ బూత్‌ల్లో కెమెరాలను ఏర్పాటు చేశారు.

# ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా రెండు రైళ్లు

- భయంతో కిందకు దిగిన ప్రయాణికులు
- ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పుర్‌లో చోటు చేసుకున్న ఘటన

**బిలాస్‌పూర్(జనంసాక్షి):** ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పుర్‌లో మంగళవారం జరిగిన రైలు ప్రమాదంలో 11మందికి పైగా ప్రయాణికులు మరణించిన ఘటనను మరువకే మందు అదే జిల్లాలో మరో ప్రమాదం జరగకుండా తృటిలో తప్పింది. బిలాస్‌పుర్‌లోఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు వచ్చాయి. ఒకే ట్రాక్‌పై రైళ్లు ఎదురుగా రావడంతో ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు. మరో ప్రమాదం జరుగుతుందని భయపడి, ప్రయాణికులు రైలు నుంచి ముందుగానే దిగిపోయారు. ప్రమాదం లేదని అధికారులు తెలపడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు. . ఈ ఘటన బిలాస్‌పుర్‌లోని కోట్మి సోనార్, జైరాంనగర్ మధ్య జరిగింది. అప్పటికే ప్యాసింజర్ ట్రైన్ ఆగి ఉన్న ట్రాక్‌పైకి గూడ్స్ రైలు వచ్చింది. రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పై రావడంతో ప్రయాణికులు మరో ప్రమాదం జరుగుతుందని భయడ్డారు. దీంతో వెంటనే కిందకు దిగారు. అయితే ట్రాక్ మార్చడానికి ఇది ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అని అధికారులు చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎటువంటి ప్రమాదం లేదని తెలిన తర్వాత, ప్రయాణికులు మళ్ళీ రైలు ఎక్కారు. ఇది ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అనుసరించే సాధారణ ఆపరేటింగ్ విధానమని సీపీఆర్ఓ సుస్కర్ విపుల్ విలాస్?రావు తెలిపారు. 'ప్రతి కిలోమీటరుకు సిగ్నల్స్ ఉంటాయి. ప్రతి సిగ్నల్ తర్వాత మరొక రైలు వెళ్లడానికి వీలు కల్పిస్తుంది. గూడ్స్, ప్యాసింజర్? రైళ్లకు ప్రత్యేక ట్రాక్‌లు ఉండవు. రెండూ ఒకే ట్రాక్‌పై నడుస్తాయి. ఒకదానికొకటి అనుసరిస్తాయి. రైల్వే ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ సురక్షితమైన వ్యవస్థ. 2023 నుంచి ఈ విభాగంలో అమలులో ఉంది. ఇటువంటి తప్పుదారి పట్టించే సమాచారం, పుకార్లను పట్టించుకోవద్దని ప్రయాణికులకు, ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి ఇటువంటి పుకార్ల పట్ల జాగ్రత్త వహించండి. ఇటువంటి



తప్పుదారి పట్టించే వార్తలను ఫార్వార్డ్ చేయకుండా ఉండండి' అని విలాస్‌రావు అన్నారు. బిలాస్‌పుర్‌లో నవంబర్ 4న జరిగిన రైలు ప్రమాదంలో 11 మృతి చెందగా, మరో 20మంది గాయపడ్డారు. మృతుల్లో లోకోపైలట్? కూడా ఉన్నారు. గటోరా-బిలాస్‌పుర్ రైల్వేస్టేషన్ల మధ్యలో ఉన్న లాల్‌ఖండ్ గ్రామ సమీపంలో సాయంత్రం 4 గంటలకు సరకు రవాణా రైలును వెనుక నుంచి ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ధాటికి ప్యాసింజరు రైలు బోగి ఒకటి గూడ్సు రైలు వ్యాగన్‌పైకి ఎక్కింది. వెంటనే అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం, రైల్వే యంత్రాంగం ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టాయి. దెబ్బతిన్న రైల్ కోచ్‌ల్లో చిక్కుకున్నవారిని రక్షించాయి. క్షత గాత్రులను వేగంగా సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఆ మార్గంలో వెళ్లే రైళ్లకు పూర్తి అంతరాయం కలిగింది. మృతుల కుటుంబాలకు రూ. 10లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5లక్షల చొప్పున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున రైల్వే శాఖ పరిహారం ప్రకటించింది. ప్రమాద ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. అయితే ప్రయాణికుల రైలు రెడ్ సిగ్నల్‌ను దాటి ముందుకు వెళ్లడంతోనే ఈ దుర్ఘటన జరిగినట్లు రైల్వే బోర్డు ప్రాథమికంగా అంచనా వేసింది. లోకోపైలట్ రెడ్ సిగ్నల్‌ను గమనించకుండా రైలును ముందుకు నడిపి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో గంటకు 60 నుంచి 70 కి.మీ. వేగంతో ప్యాసింజరు రైలు వెళ్లి ఉంటుందని అధికారులు అంటున్నారు.

# జూబ్లీహిల్స్‌లో గ్రామస్థాయి అభివృద్ధి కూడా లేదు

చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, గ్యారెంటీలపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదేనని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దీనికి సంబంధించి ఒక పోస్ట్ ను కూడా కిషన్ రెడ్డి తన సోషల్ మీడియా అకౌంట్లో పెట్టారు. 'ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి 'ఇజ్జత్' అంటావు, మరి హిందువులు ఇజ్జత్ కాదా మిస్టర్ రేవంత్ రెడ్డి? మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులకు గౌరవం లేదా? ఎర్రగడ్డలో ఖబరస్థాన్ కోసం స్థలం ఇచ్చేందుకు మనసొచ్చింది కానీ, బంజారాహిల్స్‌లో పెద్దమ్మ తల్లి గుడికి 50 గజాలు స్థలం ఇవ్వడం ఎందుకు కుదరలేదు. హిందువులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవు. ఎన్నాళ్లు మజ్లిస్‌ను భుజాన ఎక్కించుకొని తిరుగుతావో తిరుగు. ప్రజలే నీకు గట్టి బుద్ధి చెబుతారని అంటూ కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఓటు వేయక పోతే సన్న బియ్యం, ఫ్రీ బస్ ఆగిపోతుంది అని సీఎం అన్నారు.. సన్నబియ్యం లో కేంద్ర ప్రభుత్వానిదే సింహభాగం.. ఏ విధంగా సీఎం ఆపుతారో చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. సకల సమస్యలకు పరిష్కారం ఫ్రీ బస్సు అనే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన నిధులను, వచ్చిన సంస్థల వివరాలు కిషన్‌రెడ్డి వివరించారు. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో బీబీనగర్ ఎయిమ్స్ భవనాలు ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభమవుతాయని వెల్లడించారు. 2 వందల బస్తీ దవాఖానలు కేంద్రం సహకారంతో నడుస్తున్నాయి. కేసీఆర్ పేరు మార్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 101 అభివృద్ధి కార్యక్రమాలు హైద్రాబాద్ పరిధిలో జరుగుతున్నాయన్నారు. రేవంత్ రెడ్డి స్థాయికు దిగజారి నేను అడ్డుకుంటున్నాను అని మాట్లాడుతున్నారు. మెట్రో గురుంచి కూడా మాట్లాడుతున్నారు.. ఎల్ అండ్ టి మేము చేయలేము అంటుంది? ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాలి? కొత్త డిపిఆర్ కేంద్రానికి ఇవ్వాల్సి ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'తెలంగాణ బిడ్డగా నా నియోజక వర్గం అభివృద్ధి కోరుకుంటా.. బాధ్యత రహితంగా మాట్లాడుతున్నారు రేవంత్ రెడ్డి.. తెలంగాణ కోసం మా కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాను.. వివిధ అంశాల పై కేసీఆర్‌కు 40 లెటర్లు రాశాను.. స్పందించలేదు.. అలాంటి వాళ్లు కూడా విమర్శలు చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు.. హైద్రాబాద్ లో డిఫెన్స్ మీద లక్ష 40 వేల కోట్లు ఖర్చు పెట్టింది కేంద్రం.. అని వెల్లడించారు. పత్తి రైతులు ఆందోళన చెందొద్దు? మార్చి వరకు పత్తి కొంటాం.. కాంగ్రెస్ పార్టీ వి కూడా చాలా సార్లు డిపాజిట్ రాలేదు.. జూబ్లీహిల్స్ నాకు తెలుసు? అక్కడి ప్రజలు ఓటు వేసేది.. కౌంటింగ్ రోజు తెలుస్తుంది ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయి.. రేవంత్ రెడ్డి మాటలను సిరియస్ గా తీసుకోవాల్సిన అవసరం లేదు.. ఆయన మాట్లాడుతూ పోతుంటారు మనం వింటూ పోవాలి.. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్ట్ మీద సిబిఐ దర్యాప్తు జరపాలి అని మేము అడుగుతున్నామన్నారు

# జంగిల్‌రాజ్ వల్ల బీహార్‌లో అభివృద్ధి శూన్యం

అంతిమ పాలకులం అని భావించేవి. కానీ నా దృష్టిలో ప్రజలే సుప్రీం. ఆనాడు రాష్ట్రాన్ని పాలించిన వాళ్లు తమను తాము 'మాయి-బాప్' అని చెప్పుకునేవారు. తమను తాము చక్రవర్తులు అనుకునేవారు. కానీ మోదీ విభిన్నం. నాకు ప్రజలే మాయి-బాప్. మీరే నా శక్తి. మీరే నా మార్గదర్శకులు. ప్రజల చేతిలోనే నా రిమోట్ కంట్రోల్ ఉంది. పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓట్లు వేస్తున్న ప్రజలకు నా అభినందనలు. అందరూ తప్పకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలి. మళ్లీ తప్పకుండా ఎన్‌డీఏ కూటమే గెలుస్తుంది. రాష్ట్ర ప్రజలంతా ఇదే అనుకుంటున్నారు. రాష్ట్ర ప్రజల స్వప్నాలను, లక్ష్యాలను సాకారం చేయడమే మోదీ పని. ఇది మోదీ గ్యారంటీ' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.'చొరబాటుదారులపై ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీలు మెతక వైఖరిని అవలంభిస్తాయి. కానీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం శ్రీరాముడు, ఛటీ మయ్యాలను ఆ పార్టీలు ఇష్టపడవు. అయోధ్యతో పాటు నిశాద్ రాజ్, మాతా శబరి, మహర్షి వాల్మీకీల పుణ్య క్షేత్రాలను దర్శించేందుకు విపక్ష నేతలు రెడీగా లేరు. వాళ్లకు దళితులు, బీసీలు అంటే ద్వేషం. ఆర్‌జేడీ, కాంగ్రెస్‌లకు అధికారం వస్తే, వాళ్లు చొరబాటుదారులకు వెనుక తలుపు నుంచి ఎంట్రీ కల్పిస్తారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇదంతా చేస్తారు. కానీ దీని ప్రతికూల ప్రభావం దేశ ప్రజలపై పడుతుంది. భారత పౌరులకు చెందాల్సిన ప్రతీ దానిలో చొరబాటుదారులు వాటాను అడుగుతారన్నారు.

## మంత్రి దామోదర రాజనర్సింహను
# కలిసిన గ్రూప్-1 ఆఫీసర్లు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు అలకేట్ అయిన గ్రూప్-1 ఆఫీసర్లు గురువారం సెక్రటేరియట్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారందరికీ శుభాకంక్షలు తెలిపారు. ఆరోగ్యశాఖలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టమని, అనారోగ్యంతో ఆపదలో ఉన్న ఎంతోమందికి సేవ చేసే అవకాశం ఈ డిపార్ట్‌మెంట్‌లో ఉంటుందన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లకు అత్యంత పేద ప్రజలు వస్తుంటారని, వారిని అప్యాయంగా ప్రేమగా చూసుకునే బాధ్యత ఈ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచేలా, నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా పని చేయాలని కొత్త ఆఫీసర్లకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా హాస్పిటళ్ల పనితీరు, ఆరోగ్య రంగంలో టెక్నాలజీ, గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకు స్పెషాలిటీ వైద్య సేవలు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులకు మంత్రి వివరించారు. ఒకప్పటిలా ఇప్పుడు అంటువ్యాధుల సమస్య లేదని, వాటి స్థానంలో లైఫ్ స్టైల్ డిసీజెస్ ( నాన్ కమ్యునికెబుల్ డిసీజెస్) సమస్య పెరిగిందని ఈ పరిస్థితిని అవగాహన చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలోనూ డే కేర్ కేన్సర్ సెంటర్స్, ఎన్‌సీడీ క్లినిక్స్ ఏర్పాటు చేశామని, వాటి ద్వారా ఎన్‌సీడీ పేషెంట్లకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆధునికత, టెక్నాలజీ జోడించి వైద్య సేవలు మెరుగుపర్చే దిశగా కొత్తగా వచ్చిన ఆఫీసర్లు ఆలోచన చేయాలని

## వరంగల్ మహా నగరాన్ని వరద ముంపు శాశ్వత పరిష్కారానికి
# పటిష్ట సమగ్ర ప్రణాళికలు రూపొందించండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలసి ఇరిగేషన్, బల్దియా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష...
- స్ట్రామ్ వాటర్ డ్రైన్ లతో పాటు అంతర్గత డ్రైన్స్ లను ప్రణాళికలో ప్రతిపాదించాలి




**వరంగల్ ఎంజీఎం, నవంబర్ 6(జనంసాక్షి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ మహా నగరాన్ని వరద ముంపు నుండి శాశ్వత పరిష్కారానికి పటిష్ట సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో వరద ముంపును శాశ్వతంగా పరిష్కరించేందుకు రూపొందిస్తున్న సమగ్ర ప్రణాళికపై గురువారం మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలసి ఇరిగేషన్, బల్దియా ఇంజినీరింగ్ అధికారులతో కలసి మేయర్ సమీక్షించి సమర్థవంతంగా ప్రణాళికను రూపొందించుటకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నగరంలోకి ప్రధానంగా వరద నీరు ఏయే ఎగువ ప్రాంతాల నుండి వస్తుంది, ఉన్న నాలాలు, వాటి సామర్థ్యం, కచ్చా నాలాలు,గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో ఉన్న చెరువులు, ముంపు కాలనీలు, డ్రైన్ లు దక్టులు, ప్రస్తుతం చెరువుల పరిస్థితి, ఆక్రమణలు, నగరం నుండి వరద నీటిని సురక్షితంగా బయటకు పంపేందుకు ఉన్న మార్గాలు, ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో, డ్రైన్ డక్టుల నిర్మాణం, నాలాలు, డ్రైనేజీల విస్తరణ, నిర్మాణ వ్యయం తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరద నీరు సులువుగా ప్రవహించేందుకు శాశ్వత పరిష్కారం లో భాగం గా స్ట్రామ్ వాటర్ డ్రైన్ లతో పాటు కాలనీలలో మురుగునీరు వెళ్లుటకు అంతర్గత డ్రైన్స్ లను శాశ్వత సమగ్ర ప్రణాళికలో( డి పి ఆర్)లో పొందుపర్చాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జీ డబ్ల్యూ ఎం సి ఎస్ ఈ సత్యనారాయణ, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఈఈ లు రవి కుమార్, సంతోష్ బాబు, డి ఈ లు రంగారావు, రవి కిరణ్, కార్తీక్ రెడ్డి, రోజా రాణి, రాజ్ కుమార్ ఇరిగేషన్ అధికారులు ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## 8, 9వ తేదీల్లో పౌరహక్కుల
# సంఘం మహాసభలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నవంబర్ 8, 9వ తేదీల్లో పౌరహక్కుల సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. 8వ తేదీన సుందరయ్య మెయిన్ హాల్‌లో మొదటి సెషన్ పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అధ్యక్షతన సభ నిర్వహించనున్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, పౌరహక్కుల సంఘం సీనియర్ నాయకులు ప్రొఫెసర్ జి.హరగోపాల్, సామాజిక కార్యకర్త బేలా బాటియా వక్తలుగా ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం సెషన్‌లో పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షులు కె.రవి అధ్యక్షతన ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, చత్తీస్‌ఘడ్ ఆదివాసీ హక్కుల కార్యకర్త సోనిసోరి ప్రసంగించనున్నారు. సాయంత్రం పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్ర పురుషోత్తం అధ్యక్షతన ఎఫ్‌ఏసీఎఎం ప్రొఫెసర్ సరోజ్‌గిరి, ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కె.శ్రీనివాస్, పౌరహక్కుల సంఘం సీనియర్ నాయకులు వి.రఘునాత్ వకర్తలుగా ప్రసంగించనున్నారు. నాలుగో సెషన్‌లో పౌరహక్కుల సంఘం సీనియర్ నాయకులు జె.లింగయ్య అధ్యక్షతన కార్యక్రమం ఉంటుందని తెలిపింది. అలాగే ప్రజా కళామండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌పైన ప్రదర్శన ఉంటుందని తెలిపింది.

# జూబ్లీహిల్స్‌లో వేడెక్కిన ప్రచారం

- కోడికూరపై పాటపాడి ఆకట్టుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే



**హైదరాబాద్, నవంబర్6 (జనంసాక్షి) :** అన్ని ప్రధాన పార్టీలకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. ఎన్నిక తేదీ దగ్గరపడుతుండటంతో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ తరఫున వీ నవీన్ యాదవ్ ఉపఎన్నికలో పోటీ చేస్తున్నారు. జోరుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇక, నవీన్ యాదవ్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం చురుగ్గా ప్రచారంలో పాల్గొంటున్నారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. అశ్వారావు పేట కాంగ్రెస్ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన చాలా వినూత్నంగా ప్రచారం చేశారు. ప్రచారం సందర్భంగా ఓ చికెన్ షాపులో ఆయన సందడి చేశారు. చికెన్ కొట్టడంతో పాటు చికెన్‌పై పాట పాడి అందర్నీ ఆశ్చర్యపరిచారు. 'కొయ్యక కొయ్యక నేను కోడిని కోసి వండుకుంటే..' అని పాట సాగుతుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు ఎమ్మెల్యే పాటపై ప్రశంసలు కురిపిస్తున్నారు.



## విషాహారం తిని 140 గొర్రెలు మృత్యువాత

**నల్లగొండ, నవంబర్6 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా వేములపల్లిలో దారుణం జరిగింది. మేత మేస్తూ అకస్మాత్తుగా సుమారు 140 గొర్రెలు మృతి చెందాయి. పొలంలో గొర్రెలు ఎక్కడిక్కడ ఉన్నచోటనే మృత్యువాత పడ్డాయి. చనిపోయిన గొర్రెలు సూర్యాపేట జిల్లా పెనుపాడు మండలం అనంతారం, అన్నారం, దోసపాడు గొర్రెల కాపరులకు చెందినవి. గురువారం ఉదయం పొలంలో మేత మేస్తుండగా..గొర్రెలన్నీ ఒక్కసారిగా ఉన్నచోటనే చనిపోయాయి. ఈ ఘటనలో గొర్రెల కాపరులు ఆందోళన చెందారు..ఒక్కొక్కటిగా చూస్తుండగానే 140 గొర్రెలు చనిపోవడంతో లబోదిబోమంటున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన పశుసంవర్ధక శాఖ అధికారులు మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. విష ఆహారం తినడం వల్లనే గొర్రెలు మరణించినట్టు భావిస్తున్నారు అధికారులు. మరణించిన గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించనున్నారు అధికారులు.

## పత్తి కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 6 (జనం సాక్షి) :**హనుమకొండ జిల్లా పరకాల ధనలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్ లో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎంత పత్తిని కొనుగోలు చేశారని, రైతులు తమ పంట ఉత్పత్తిని విక్రయించేందుకు కపాస్ యాప్ లో నమోదు చేస్తున్నారా అని, తేమశాతం ఎలా పరిశీలిస్తున్నారని, జిన్నింగ్ మిల్ పరిధిలో ఎంత కాటన్ రానుందనే వివరాలను మార్కెటింగ్ అధికారులు, సీసీఐ అధికారులు కలెక్టర్ కు వివరించారు. మూడు రోజుల క్రితం జిన్నింగ్ మిల్లు లో పత్తి కొనుగోలు ప్రారంభమైందని, ఇప్పటివరకు పత్తి కొనుగోలు కేంద్రానికి 13 మంది రైతులు 140 క్వింటాల పత్తిని తీసుకురాగా కొనుగోలు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. పత్తి కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన పత్తిని త్వరగా కొనుగోలు చేయాలని, పత్తిని విక్రయించిన రైతులకు త్వరగా డబ్బులు వారి ఖాతాకు జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాట్లను అధికారులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, సీసీఐ అధికారి ప్రకాష్, పరకాల మార్కెట్ సూపర్వైజర్ వేణుగోపాల్, ఇతర అధికారులతో పాటు జిన్నింగ్ మిల్లు యాజమాన్యం, రైతులు పాల్గొన్నారు.

## కళ్యాణి శ్రీనివాస్‌కు ఉత్తమ అనువాద కళాకారినిగా అవార్డు ప్రదానం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సెవెన్ హిల్స్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రముఖ సాంస్కృతిక సంస్థ వంశీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు వంశీ రామరాజు ముఖ్య అతిథిగా, యువకళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, జి.వి.ఆర్ ఆరాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి వి రాఘవరెడ్డి ఆత్మీయ అతిథులుగా, నగరంలోని ఏ ఏ ఏ స్టూడియోలో, ఎన్నో పాత్రలకు తన గాత్రాన్ని అందించిన ప్రముఖ డబ్బింగ్ కళాకారిణి కళ్యాణి శ్రీనివాసుని బెస్ట్ డబ్బింగ్ ఆర్టిస్ట్ అవార్డుతో సత్కరించారు. ప్రార్థనా గీతాన్ని మహర్షి , శ్రీరాణి ఆలపించగా, ముఖ్య అతిథి వంశీ రామరాజు మాట్లాడుతూ అనువాద కళాకారులకు గాయనీ గాయకులకు తన వంతు సేవలందిస్తున్న సెవెన్ హిల్స్ సంస్థ అధ్యక్షుడు వేంద్ర ఏడుకొండలరావును అభినందించి సత్కరించారు. కళలను కళాకారులను అందరూ ప్రోత్సహించాలన్నారు. సభా కార్యక్రమానికి ముందు జరిగిన సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులను సత్కరించారు. ప్రముఖ గాయకులు శ్రీ యశస్వి, అరుణారాం, కళ్యాణి, రమేష్ రేపాల, నాగరాజు రొంపిచర్ల, వాసు, మహర్షి, ఆనందలక్ష్మి, రాగ రేఖ, ఆనంద లక్ష్మి, రమాదేవి సినీ గీతాలు ఆలపించగా, అక్షర మీడియా వర్క్స్ రాజు కాలూరి, రాజేష్, వి.కృష్ణ పాల్గొనగా. సంస్థ అధ్యక్షుడు, డబ్బింగ్ ట్రైనర్ ఏడుకొండల రావు వందన సమర్పణ చేశారు

# లాయిడ్స్ ఆఫ్షోర్ గ్లోబల్ సర్వీసెస్ నుండి చారిత్రాత్మక రికార్డు

- హైదరాబాద్‌లో 100 టన్నుల బియ్యం విరాళం!






**హైదరాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి) :** లాయిడ్స్ బ్యాంకింగ్ గ్రూప్ టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ హబ్ అయిన లాయిడ్స్ ఆఫ్షోర్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సమాజ సంక్షేమం పట్ల తమ నిబద్ధతలో ఒక ముఖ్యమైన మైలురాయిని ప్రకటించింది. నవంబర్ 6, 2025న, ఈ సంస్థ కార్పొరేట్ దాతృత్వంలో సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పింది. హైదరాబాద్‌లోని బహుళ ప్రభుత్వేతర సంస్థలకు ఒకే రోజు అపూర్వంగా 100 టన్నుల బియ్యాన్ని విరాళంగా ఇచ్చి దేశంలోనే ఒక చారిత్రాత్మక రికార్డును సృష్టించింది. అందరినీ కలుపుకొనిపోయే వృద్ధి, బాధ్యతాయుతమైన పౌరసత్వం పట్ల కంపెనీకి ఉన్న లోతైన నిబద్ధతను ఈ చొరవ ప్రతిబింబిస్తుంది. లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, మేనేజింగ్ డైరెక్టర్ అయిన శిరీష వోరుగంటి ఈ ఘనతపై వ్యాఖ్యానిస్తూ, "ఈ చొరవ మా ముఖ్య విలువలనూ, అత్యవసరంగా అవసరమైన వారి జీవితాలలో అర్ధవంతమైన మార్పు తీసుకురావాలనే మా నిబద్ధతనూ ప్రతిబింబిస్తుంది. లాయిడ్స్‌లో, నిజమైన పురోగతి కేవలం వ్యాపార విజయంతోనే కాకుండా, మనం సమాజంలో సృష్టించే సానుకూల ప్రభావంతో కూడా కొలవబడుతుందని మేము నమ్ముతాము. ఈ గొప్ప కార్యక్రమాన్ని సాకారం చేయడానికి కలిసి వచ్చిన మా బృందాలకు మరియు భాగస్వాములకు నేను గర్వపడుతున్నాను" అని అన్నారు. ఈ రికార్డును నెలకొల్పిన డ్రైవ్‌కు డా. విపుల్ సింగ్, డైరెక్టర్, హెడ్ ఆఫ్ హెచ్‌ఆర్ పీపుల్, ప్లేసెస్తో సహా నాయకత్వ బృందం గట్టి మద్దతు ఇచ్చింది. ఇది కంపెనీ-వ్యాప్త సామాజిక బాధ్యత పట్ల అంకితభావాన్ని చాటుతుంది. లాయిడ్స్ ఆఫ్షోర్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ తన సేవలను విస్తరించడానికి, వివిధ వ్యూహాత్మక సామాజిక కార్యక్రమాల ద్వారా సమాజాలను ఉన్నతీకరించే ప్రయత్నాలను కొనసాగించడానికి కట్టుబడి ఉందని తెలిపారు.

## 17న ప్రజల ప్రాథమిక హక్కు
# ప్రభుత్వాల కనీస బాధ్యతపై సెమినార్

- తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈనెల 17 న నాణ్యమైన ఉచిత విద్య - మెరుగైన ఉచిత వైద్యం , ప్రజల ప్రాథమిక హక్కు - ప్రభుత్వల కనీస బాధ్యత అంశం పై జరగనున్న సెమినార్ విజయవంతం చేయాలనీ కోరుతూ గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళా శాల వద్ద కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ ప్రపంచంలో కెల్లా అత్యంత ఎక్కువగా విద్యా-వైద్యం కోసం ఖర్చు పెడుతున్నది భారతీయులే అని అనేక సర్వే లు స్పష్టం చేస్తున్నాయని, తమకి వచ్చే ఆదాయం లో 80 నుండి 90 శాతం విద్యా- వైద్యం కోసం ఖర్చు పెడుతున్నట్లు ప్రపంచ బ్యాంక్, ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామికల్ కో ఆపరేషన్ అండ్ డెవలప్ మెంట్ సర్వే లెక్కలు తేల్చిందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే తల్లి దండ్రులు తమ సంపాదనలో ఎక్కువ భాగం విద్యా, వైద్యానికే ఖర్చు చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. విద్యా రంగంలో "చదువు కొనే" వాళ్ళతో పోల్చితే, సామాన్యుడు పంపించే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ లలో అరకొర వసతులకు తోడు విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు కూడా లేకపోవడం తో తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజు లు చెల్లించి మరీ చదివిస్తున్నారని తెలిపారు. ప్రపంచీకరణ నేపథ్యంలో నైపుణ్య విద్య అత్యవసరమన్నారు. ఉపాధి అవకాశాలు చూపే నైపుణ్యం గల విద్య అమలు చేయక పోతే భవిష్యత్తు తరాలను మరింత అజ్ఞానము లోకి నెట్టబడి ఎందుకు పనికి రాని వారిగా తయారవుతారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, నాణ్యమైన, నైపుణ్యం గల ఉచిత విద్యను అందించాలని, ప్రతి బడ్జెట్ లో విద్యా రంగానికి 20% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# బీఆర్‌ఎస్ నాయకుడు అరుణ్ అరెస్ట్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో ఓటమి భయంతో కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు అరుణ్ ను అక్రమంగా మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. రహ్మత్ నగర్ బస్తీలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అరుణ్‌ను గురువారం సాయంత్రం ఎటువంటి కేసు లేకుండానే అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాజీ చీఫ్ విప్ హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్, లీగల్ సెల్ అడ్వైజర్ శ్రీకాంత్ పోలీస్ స్టేషన్ కి వెళ్ళి విడిపించారు. కాగా బీఆర్‌ఎస్ నాయకులు ఈ అక్రమ అరెస్ట్ ను ఖండించారు. ఓటమి భయంతో బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకొని బెదిరించాలని చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రంజిత్ రెడ్డి, వినీల్ రావు తదితరులు పాల్గొన్నారు..

# చెల్లెలి పెళ్లి విషయంలో వివాదం

- ఆవేశంలో తండ్రి గొంతుకోసి హత్య చేసిన కొడుకు

**కాకినాడ, నవంబర్ 6 (జనంసాక్షి) :** చెల్లెలి పెళ్లి విషయంలో తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తి కన్న తండ్రిని గొంతు కోసి హత్య చేసాడు. ఈ దారుణ ఘటన తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని తొర్రేడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఒడిశాల అప్పారావు(49) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం కాగా.. చిన్న కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల పెళ్లి సంబంధం రాగా.. రూ.2 లక్షలు కట్నంగా ఇవ్వాలని కోరారు. అంత మొత్తం ఇచ్చుకోలేనని తండ్రి అప్పారావు వెనుకడుగు వేశాడు. గురువారం ఈ విషయమై తండ్రితో కుమారుడు సాయికుమార్ వాగ్వాదానికి దిగాడు. ఆవేశంతో తండ్రి తలను గోడకేసి కొట్టాడు. అడ్డుకోబోయిన తల్లి, సోదరిని గదిలోకి నెట్టి తలుపు గడియపెట్టాడు. అంతటితో ఆగకుండా.. ఇంట్లో కూరగాయలు కోసే చాకుతో తండ్రి గొంతు కోశాడు. తీవ్రంగా గాయపడిన అప్పారావు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఆఫ్రికన్ నత్తలతో బెంబేలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఆఫ్రికన్ నత్తలు భయాందోళనలకు గురి చేస్తున్నాయి. న్యూబోయిన్‌పల్లి మిలటరీకి చెందిన మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆఫ్రికన్ నత్తలు కన్పించాయి. దీంతో అధికారులు అప్రమత్తమై నత్తల నివారణా చర్యలు చేపట్టారు. వనంలోని ప్రహరీ గోడతోపాటు చెట్లు, పుట్టలపై రసాయనాలు, ఉప్పు ద్రావణాలు చల్లి వాటిని చంపివేశారు. ఈ నత్తలు ఆకులు, చిగుర్లు, కాండం, పూత పిందలనే కాకుండా ఏకంగా వృక్షాలనే కొరికివేయగలవని అధికారులు తెలిపారు.

# హరియాణాలో హైడ్రోజన్ బాంబ్

## ఓటు చోరీ ఆరోపణలు.. భారత రాజకీయాల్లో తీవ్ర కలకలం

హరియాణా శాసనసభ ఎన్నికలు ముగిసిన తర్వాత భారత రాజకీయాల్లో తీవ్ర కలకలం. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'హైడ్రోజన్ బాంబ్' పేరుతో బీజేపీపై ఓటు చోరీ ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రఖ్యాత మీడియా చానెల్స్ ఈ విషయంపై తీవ్రంగా స్పందించాయి. దేశీయ, విదేశీ మీడియా కవరేజ్ ఈ ఆరోపణల లోతును తెలియజేస్తోంది. ఎన్నికల కమిషన్‌పైనా ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వ్యాసం ఆ ఆరోపణలు, మీడియా ప్రతిస్పందనలను పరిశీలిస్తుంది.

రాహుల్ గాంధీ ఆరోపణలు తీవ్రమైనవి. హరియాణాలో 25 లక్షల నకిలీ ఓట్లతో బీజేపీ గెలిచిందని చెప్పారు. ఓటర్ జాబితాల్లో డూప్లికేట్‌లు, తప్పు చిరునామాలు, నకిలీ ఫొటోలు ఉన్నాయని పేర్కొన్నారు. ఒకే ఫొటోతో 22 ఎంట్రీలు, బ్రెజిలియన్ మోడల్ ఫొటోను ఉపయోగించి స్వీటీ, సీమ, సరస్వతి వంటి పేర్లు పెట్టారని ఆరోపించారు. ఈ మహిళ ఫొటో 10 పోలింగ్ బూత్‌ల్లో కనిపించిందని, అక్కడ కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. ఒకే నియోజకవర్గంలో 100 ఓటర్ కార్డులు ఒకే ఫొటోతో ఉన్నాయని హైలైట్ చేశారు. మరో మహిళ ఫొటో 223 సార్లు కనిపించిందని తెలిపారు. ఒక ఇంట్లో 501 మంది ఓటర్లు, ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చినవారికి ఓటు హక్కు కల్పించారని ఆరోపణ. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధాని మోదీ, అమిత్ షా మధ్య సంప్రదింపులు జరిగాయని కూడా చెప్పారు. ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్ గెలుపు అంచనా వచ్చినా, ఫలితాలు బీజేపీకి ఎక్కువని గుర్తుచేశారు. హర్యానా సీఎం నాయబ్ సింగ్ సైనీ "ఏర్పాట్లు హర్తాలు, బీజేపీ గెలవబోతుంది" అన్న వీడియోను రుజువుగా చూపించారు. పోస్టల్ ఓటింగ్‌లో అసాధారణ తేడాలు, 8 నియోజకవర్గాల్లో స్వల్ప తేడాతో ఓడిపోవడం, మొత్తం 22,779 ఓట్ల తేడాతో పరాజయం - ఇవన్నీ 'ఆపరేషన్ సర్కార్ చోరీ'లో భాగమని ఆరోపించారు.

దేశీయ మీడియా ఈ ఆరోపణలపై తీవ్రంగా స్పందించింది. ఎన్.డీ.టీ.వీ.లో ఎడిటర్ రవిష్ కుమార్ "రాహుల్ గాంధీ ఆరోపణలు భారత ప్రజాస్వామ్యానికి ముప్పు. 25 లక్షల నకిలీ ఓట్లు అంటే ప్రతి 8 మందిలో ఒకరు నకిలీ. ఎన్నికల కమిషన్ ఈ ఆరోపణలకు సమాధానం చెప్పాలి" అని కామెంట్ చేశారు. ఇండియా టుడే చానెల్‌లో రజత్ శర్మ "హైడ్రోజన్ బాంబ్ పేరు భయపెట్టేలా ఉంది. కానీ ఆధారాలు రుజువవుతే, ఇది ఎన్నికల వ్యవస్థపై పెద్ద ప్రశ్న. బీజేపీ ఖండన తప్పుడు మాత్రమే కాదు, విచారణ కావాలి" అని మండిపడ్డారు. టైమ్స్ నౌ డిబేట్‌లో అర్నబ్ గోస్వామీ "రాహుల్ ఓటు చోరీ ఆరోపణలు ఎక్కువ, ఆధారాలు తక్కువ అని అన్నారు. కానీ బ్రెజిల్ మోడల్ ఫొటో విషయం ఆసక్తికరం. ఎక్స్‌పోజ్ చేయాలి" అని ప్రశ్నించారు. ఏబీపీ న్యూస్‌లో ప్రణబ్ రాయ్ "కాంగ్రెస్ ఘనవిజయాన్ని ఓటమిగా మార్చారు. ఎన్నికల కమిషన్ బీజేపీ సాథీభావం చూపిందా? 35 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపణ తీవ్రమైంది" అని అన్నారు. రిపబ్లిక్ టీవీలో అర్ణబ్ మళ్లీ "రాహుల్ వైఫల్యాలను కవర్ చేసుకోవడానికి ఎన్నికల కమిషన్‌ను టార్గెట్ చేస్తున్నారు. కానీ నకిలీ ఓట్ల ఆధారాలు వెరిఫై అవుతే, దేశానికి షాక్" అని హెచ్చరించారు. సీఎన్.ఎన్.-న్యూస్18లో రఘవ్ బాపట్ల "పోస్టల్ ఓటింగ్ అసాధారణత్వం, ఒక ఇంట్లో 501 ఓటర్లు - ఇవి రిగ్గింగ్ సంకేతాలు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి" అని సూచించారు.

విదేశీ మీడియా కూడా ఈ ఆరోపణలను పట్టుకుని చర్చించింది. బీబీసీ న్యూస్‌లో సౌమ్యా గుప్తా రాహుల్ గాంధీ చేసిన "హైడ్రోజన్ బాంబ్" వ్యాఖ్యలు భారత ఎన్నికల సమగ్రతలో ఉన్న పగుళ్లను బహిర్గతం చేశాయి. హర్యానాలో 25 లక్షల నకిలీ ఓట్లు బయటపడటంతో, ఎన్నికల కమిషన్ (ఈ.సీ.ఐ.) తటస్థతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది మోదీ యొక్క ప్రజాస్వామ్య ప్రతిఛాయను ప్రపంచవ్యాప్తంగా దెబ్బతీయవచ్చు.అని కామెంట్ చేసింది. అల్ జజీరాలో మెహ్దీ హసన్ "

"హర్యానాలో, బిజెపి నకిలీ ఓటర్ల ద్వారా విజయాన్ని దొంగిలించిందని కాంగ్రెస్ ఆరోపించింది. రాహుల్ బ్రెజిలియన్ మోడల్ ఫోటోలతో నకిలీ ఐడిల ఆధారాలను చూపించాడు - అంతర్జాతీయ పరిశీలన అవసరమయ్యే కుంభకోణం. భారత ఎన్నికల కమిషన్ కాదా?" అని ప్రశ్నించారు. రాయటర్స్ రిపోర్ట్‌లో "ఆపరేషన్ సర్కార్ చోరి'లో ప్రధాని మోదీ మరియు సీఈసీ కుట్రపూరితంగా వ్యవహరించారని గాంధీ ఆరోపించారు. ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ గెలుస్తుందని అంచనా వేసింది, కానీ బీజేపీ స్వల్ప ఓట్ల తేడాతో విజయం సాధించింది. నకిలీల ద్వారా 125% ఓటర్ల ద్రవ్యోల్బణం ప్రజాస్వామ్యంపై ఎర్ర జెండాలు ఎగురవేస్తోంది" అని పేర్కొన్నారు. న్యూస్‌వీక్ మ్యాగజైన్‌లో"హర్యానాలో బిజెపి విజయంపై రాహుల్ గాంధీ 'హెచ్-బాంబ్' పేల్చారు, 25 లక్షల బోగస్ ఓట్లను ఆరోపిస్తున్నారు. యుపి వలసదారుల నుండి జీరో అడ్రస్ ఇళ్ల వరకు, ఆరోపణలు వ్యవస్థాగత మోసాన్ని చిత్రీకరిస్తున్నాయి. ఈసీఐ పారదర్శకంగా స్పందించాలి" అని విశ్లేషించారు. గార్డియన్ పేపర్‌లో "భారత ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హర్యానా ఎన్నికల్లో ఓట్ల రిగ్గింగ్ జరిగిందని పేలుడు ఆరోపణలు చేస్తున్నారు. 100 కార్డులలో ఒక ఫోటో ఆధారాలతో, ఈ 'హైడ్రోజన్ బాంబు' ఎన్నికల సంస్కరణల కోసం పిలుపులను రేకెత్తించవచ్చు."

అని రాశారు. సిఎన్ఎన్ ఇంటర్నేషనల్‌లో క్రిస్టియన్ అమపౌర్ "హర్యానా ఎన్నికల వివాదం భారతదేశ ఓటింగ్ వ్యవస్థలోని దుర్బలత్వాలను హైలైట్ చేస్తుంది. వీడియోలు మరియు డేటా మద్దతుతో గాంధీ వాదనలు మోడీ పాలనలో న్యాయాన్ని సవాలు చేస్తున్నాయి. గ్లోబల్ వాచ్‌డాగ్‌లు దర్యాప్తు చేయాలి" అని అన్నారు. ఫారిన్ పాలసీ మ్యాగజైన్‌లో "నకిలీ ఓటర్లపై రాహుల్ బహిర్గతం - 5.2 లక్షల నకిలీలు, 98 వేల తప్పుడు చిరునామాలు - బిజెపి 2024 హర్యానా విజయాన్ని ప్రశ్నిస్తుంది. నిరూపిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని తగ్గిస్తుంది"




అని విశ్లేషణ చేశారు.

ఈ మీడియా కామెంట్స్ ఆరోపణల లోతును తెలియజేస్తున్నాయి. దేశీయ చానెల్స్ రాజకీయ డిబేట్‌లకు దారి తీశాయి. విదేశీ మీడియా భారత ప్రజాస్వామ్యాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రశ్నిస్తోంది. బీజేపీ ఈ ఆరోపణలను 'తప్పుడు, ఆధారరహితం' అని ఖండించింది. కేంద్రమంత్రి కిరెన్ రిజిజు "రాహుల్ తన వైఫల్యాలను దాచుకోవడానికి ఎన్నికల వ్యవస్థను అసత్యాలతో ఆరోపిస్తున్నారు " అని చెప్పారు. కానీ మీడియా ఆధారాలపై దృష్టి పెట్టింది. రాహుల్ చూపిన వీడియోలు, డేటా రిపోర్టులు విశ్వసనీయమని చాలా చానెల్స్ అభిప్రాయపడ్డాయి. ఎన్నికల కమిషన్ ఇప్పటివరకు సమాధానం చెప్పలేదు. ఇది వివాదాన్ని మరింత పెంచుతోంది.

ఈ ఘటన భారత ఎన్నికల వ్యవస్థపై పెద్ద ప్రశ్నలు లేవనెత్తుతోంది. నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఐడీలు ఎలా జరిగాయి? ఎన్నికల కమిషన్ స్వతంత్రమా? ఎగ్జిట్ పోల్స్‌తో ఫలితాల మధ్య తేడా ఎందుకు? ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాలి. మీడియా పాత్ర ఇక్కడ కీలకం. దేశీయ చానెల్స్ డిబేట్‌లు జనాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. విదేశీ మీడియా ఒత్తిడి పెంచుతోంది. రాహుల్ ఆరోపణలు నిజమైతే, ఎన్నికల సంస్కరణలు అవసరం. తప్పితే, కాంగ్రెస్ విశ్వసనీయతపై ప్రశ్నలు. ఇది రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి దారి తీస్తుంది. ప్రజాస్వామ్యం బలపడాలంటే, పారదర్శకత ముఖ్యం. ఈ 'హైడ్రోజన్ బాంబ్' పేలుడు దేశాన్ని మేల్కొల్పాలి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



### భారతీయ కుటుంబ వ్యవస్థలో

# స్త్రీల క్రియాశీలక పాత్ర!



భారతదేశంలో కుటుంబ వ్యవస్థ బలంగా ఉన్న కారణంగా ఉత్పత్తి, ఆర్థిక పరిస్థితులు, సంపద సృష్టి వంటి రంగాలలో నిరంతర చైతన్యం కొనసాగుతూనే ఉంది. ఇందులో ప్రధానంగా స్త్రీలు, ముఖ్యంగా గృహిణులు, తమ కుటుంబ సభ్యుల ఆలనా పాలనతో పాటు కుటుంబ అవసరాలను తీర్చడంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. అందుకే ప్రతి ఏడాది నవంబర్ 3న జాతీయ గృహిణుల దినోత్సవం దేశవ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ రోజు కుటుంబ ఆస్తులు, ఆర్థిక స్థితి, పని విభజన, సంపద సృష్టి వంటి అంశాలపై ఆలోచనలకు ప్రేరణ కలిగిస్తుంది.

గ్రామీణ, వ్యవసాయ, చేతివృత్తి కుటుంబాల్లో స్త్రీలు కాయకష్టంతో ఉత్పత్తి రంగంలోనూ, కుటుంబ నిర్వహణలోనూ తమ పాత్రను చక్కగా నిర్వర్తిస్తున్నారు. పిల్లల భవిష్యత్తును చక్కబెట్టడం, భర్తకు చేదోడు వాదోడుగా నిలబడటం, ఆస్తి వ్యవహారాలలో బాధ్యత వహించడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, భారతదేశంలోని మహిళలు కుటుంబ స్థిరత్వానికి, సామాజిక శాంతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నారు.

ప్రపంచంలోని చాలా దేశాలతో పోల్చితే భారతదేశంలో కుటుంబ వ్యవస్థ బలంగా ఉండడం ఒక విశిష్టత. ప్రేమ, బంధుత్వం, సహకారం వంటి మానవ విలువలు ఇక్కడ ప్రాధాన్యం పొందాయి. వ్యవసాయం, కూలీ పనులు, వీధి వ్యాపారం, చిన్న దుకాణాలు వంటి రంగాలలో స్త్రీలు తమ కుటుంబ ఆర్థిక స్థితిని బలోపేతం చేస్తున్నారు. కొన్ని చోట్ల భర్తలు నిర్లక్ష్యం చూపినప్పుడు స్త్రీలు కష్టపడి కుటుంబాన్ని నిలబెట్టడం గమనించదగిన విషయం. అంతేకాదు, కొందరు స్త్రీలు భర్తల అసాంఘిక ప్రవర్తనను నిరోధించి కుటుంబాన్ని సక్రమ మార్గంలో నడిపించారు.

అయితే కొన్నిచోట్ల స్త్రీ పురుష సంబంధాలు బలహీనపడడం, పరస్పర అవగాహన లోపించడం వంటి కారణాలతో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితులు హత్యలు, ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. భారతీయ కుటుంబ వ్యవస్థకు ఇది శుభ సూచకం కాదు. వివాదాలు తలెత్తినప్పుడు ఇరువురు సమన్వయంతో వ్యవహరిస్తే కుటుంబ శ్రేయస్సు సాధ్యమవుతుంది. కుటుంబ వ్యవహారాలు కుట్రలుగా, వైరం పుట్టించే విధంగా నడిస్తే పిల్లల మనస్తత్వం దెబ్బతింటుంది. అందుకే మానవ సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఆలోచన అవసరం.

శాస్త్రవేత్తలు, సామాజిక పరిశోధకులు కూడా గృహిణుల పనిని గణనీయంగా గుర్తించారు. వంట, పిల్లల సంరక్షణ, గృహ సేవలు మాత్రమే కాకుండా వ్యవసాయం, చేతివృత్తులు, కూలీ పనులలోనూ స్త్రీల పాత్ర గొప్పదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. శ్రమైక జీవన సౌందర్యం గ్రామీణ కుటుంబాల్లో మరింత స్పష్టంగా కనబడుతుంది. అయితే మధ్యతరగతి, ఉన్నత కుటుంబాలలో చాలామంది స్త్రీలు గృహిణులుగా మాత్రమే ఉండడం వల్ల దేశ ఉత్పత్తిలో వారి భాగస్వామ్యం తగ్గిపోతుంది. ఇటీవల కాలంలో మహిళలు ఉద్యోగాలలోకి ప్రవేశించి పురుషులతో సమానంగా కృషి చేయడం స్ఫూర్తిదాయకం.


ఉదయం పూట పిల్లలను పాఠశాలకు పంపడం, గృహపనులు చేయడం, ఉద్యోగానికి వెళ్లడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ స్త్రీలు ఆధునిక కుటుంబ వ్యవస్థకు బలం చేకూరుస్తున్నారు. కుటుంబ వ్యవస్థలో స్త్రీలు వహిస్తున్న కష్టం, సమయపాలన, సేవాభావం గుర్తించాల్సిన అంశం. పురుషులు కూడా స్త్రీలకు సహకరించి కుటుంబ శాంతి కాపాడితే ఘర్షణలు నివారించవచ్చు.కుటుంబంలో చల్లని వాతావరణం నెలకొల్పడమే అసలు విజయమని గుర్తుంచుకోవాలి. "ఆడదే ఆధారం, మన కథ ఆడనే ఆరంభం" అనే భావన భారతీయ సంస్కృతికి ప్రతిబింబం. స్త్రీలే కుటుంబ వ్యవస్థకు కేంద్రబిందువులు, కానీ ఈ వాస్తవాన్ని స్త్రీలు ఆధిపత్యంగా కాక, సమన్వయాత్మకంగా వినియోగించినప్పుడే కుటుంబ శ్రేయస్సు సాధ్యం. ప్రేమ, అవగాహన, రాజీ మార్గం, పరస్పర గౌరవం వంటి విలువలతో జీవనాన్ని నిర్మించినప్పుడు కుటుంబం బలంగా ఉంటుంది.

తెలుసుకొనవే యువతీ.. మగువలెపుడు మగవారిని చిరునవ్వుతో గెలవాలని" అనే పాట ఇచ్చిన సందేశం నేటికీ సమకాలీనమే. స్త్రీలు చిరునవ్వుతో కుటుంబ సమన్వయాన్ని నిలబెట్టినప్పుడే భారతీయ కుటుంబ వ్యవస్థ శాశ్వతంగా బలపడుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# గతించని హిత వాక్కు



\- అనామక నెమరు.

ఒక్కొక్కరుగా మనకు శాశ్వత వీడ్కోలు పలుకుతూ ఒక తరం కనుమరుగవుతోంది.

అన్నం తినేముందు ఇతరుల ఆకలిని గుర్తించిన తరం. ఇరుకు ఇళ్లల్లో గొప్ప ప్రేమతో బ్రతికిన తరం. బాధ్యతల్ని ఎరిగిన తరం. 'నేను' అనకుండా 'మనం' అంటూ బతికిన తరం. డిగ్రీలు లేకున్నా, జీవితాన్ని చదివిన తరం. గడియారం లేకున్నా, సమయాన్ని సద్వినియోగం చేసుకున్న తరం. ఇంటర్నెట్ చూడకుండా జ్ఞానాన్ని నింపుకున్న తరం. కాలిక్యులేటర్ లేకున్నా లెక్కలు చేయగలిగిన తరం. మొబైల్ ఫోన్ లు లేకున్నా స్నేహ సంభాషణలకు లోటు లేని తరం. TVలు లేకున్నా వినోదం గా కాలం గడిపిన తరం. GPSలు లేకున్నా గమ్యం ఖచ్చితంగా చేరగలిగిన తరం. సాంకేతికత లేకున్నా సుఖసంతోషాలతో బతికిన తరం. ACలు, కూలర్లు లేకున్నా ఆరుబయట హాయిగా నిద్రించిన తరం. మినరల్ వాటర్ కు బదులు చెరువు/బావి నీళ్లు తాగి ఆరోగ్యంగా బతికిన తరం. పిజ్జాలు, బర్గర్లు కాకుండా పీచు మిఠాయిలు, పేలాలు తిని ఆనందంగా బ్రతికిన తరం. రాత్రిళ్ళు ఇంటి అరుగులపై హాయిగా కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా బ్రతికిన తరం. ఆరో ఏడు వచ్చే వరకు పిల్లల బాల్యాన్ని ఆటపాటలతో నింపిన తరం. ఆ తర్వాత పైసా ఫీజు లేని సర్కారు బడుల్లో తెలుగు మీడియంలో పిల్లలను చదివించి - అటు తెలుగు లోనూ, ఇటు ఇంగ్లీష్ లోనూ పండితులు అయ్యేలా పిల్లలను తీర్చిదిద్దిన తరం. కిలోమీటర్ల దూరాన్ని సైతం అవలీలగా నడవగలిగిన తరం. క్రమశిక్షణ తప్పిన పిల్లవాడికి స్కూల్ లో టీచర్ నాలుగు దెబ్బలు వడ్డిస్తే - వాడికి మరో పది దెబ్బలు ఇంట్లో వడ్డించిన తరం. వీధి నాటకాలను, తోలు బొమ్మలాటలను, బుర్రకథలను ఆస్వాదించిన తరం. సెన్సార్ అవసరం లేని సందేశాత్మక నలుపు-తెలుపు సినిమాలు చూసిన తరం. ఇంటిముంగిటిని ముగ్గులతో అలంకరించిన తరం. పనిమనుషులతో, యోగాలతో, జిమ్ లతో పని లేకుండా, బండెడు చాకిరీ చేసుకుంటూ, చెమటను చిందించి వందేళ్లు బతికిన తరం. బంధాలకు, బంధుత్వాలకు విలువనిచ్చిన తరం. ఆస్తులకన్నా, ఆప్యాయతలకు, అనుబంధాలకు ప్రాముఖ్యతనిచ్చిన తరం. ఉమ్మడికుటుంబాలుగా ఆనందంగా జీవించిన తరం. భేదాభిప్రాయాలున్నా అందర్నీ కలుపుకుని వెళ్ళగలిగిన తరం. వ్యాపారంలో కల్తీకి చోటివ్వని తరం. ఇతరుల మేలు కోరుకున్న తరం. నీతి నిజాయితీలతో మోసాలు చెయ్యకుండా బతికిన తరం. రాళ్లు తిన్నా అరిగించుకోగలిగిన తరం. కార్పొరేట్ హాస్పిటల్స్ లేకున్నా ఆరోగ్యంగా జీవించిన తరం. హార్ట్ ఎటాక్, క్యాన్సర్ ల గురించి తెలియని తరం. బీపీలు, షుగర్ లను దరిచేరనీయని తరం. లాంతర్లతో జీవితంలో వెలుగులు నింపుకున్న తరం. కష్టాల్ని ధైర్యంగా ఎదుర్కొన్న తరం. ఎంత ఉన్నా ఇంకా ఇంకా కావాలనే దురాశ లేకుండా ఆనందంగా జీవించిన తరం. ఆడంబరాలకు దూరంగా ఉన్న తరం. పోస్ట్ కార్డులపై సంభాషణలు జరిపిన తరం. త్యాగాలతో పిల్లల భవిష్యత్ కు పునాదులు వేసిన తరం. కులమతాలకు అతీతంగా సోదరభావంతో బతికిన తరం. అలాంటి తరంలోని అపురూపమైన వ్యక్తులు నేడు ఒక్కొక్కరుగా మనల్ని విడిచి వెళ్లిపోతున్నారు. వారిని కోల్పోతుంటే సర్వం కోల్పోతున్నట్టుగా అనిపిస్తుంది. వెళ్లిపోతున్న ఆ తరం వాళ్ల నుండి ఈ తరం ఏమీ నేర్చుకోకపోతే - భవిష్యత్తు అంధకారమే!

కళ్ళకు కట్టించిన కృతి కర్తా వందనం

\- ఇక్బాల్.

# కాషాయాన్ని నిలువరిస్తున్న ఎర్రజెండా

బీహార్లో సొంతంగా, లేదా కూటమి ప్రభుత్వ ఏర్పాటు చేయాలన్న బిజెపి సంకల్పానికి ఎర్రజెండా అడ్డుపడుతుంది. బిజెపిని అధికారంలోకి రాకుండా నిలువరిస్తుంది. ఈ ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చివేసేందుకు, రాజకీయ సమీకరణాలను వేగంగా మార్చేందుకు బీహార్ ఎన్నికలు దోహదపడతాయి. వచ్చే ఏడాదిలో తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బీహార్ ఫలితాల ప్రభావం ఆ రాష్ట్రాలపై తప్పక ఉంటుంది.

చిపలచిత్త స్వభావుడిగా పేరున్న నితీష్ కుమార్ కూటములు మార్చడంలో దిట్ట. ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ సీఎం కుర్చీలో కూర్చుంటున్నారు. కుల రాజకీయాలకు నిలయంగా ఉన్న బీహార్ రాష్ట్రంలో ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ కూటమి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడింది. దాన్నుంచి బయటపడేందుకు బిజెపి - జెడియు (ఎన్డీఏ కూటమి) తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రధాన పార్టీలు మేనిఫెస్టోలను ప్రకటించాయి. బీహార్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి హామీలు తగినవి కావు. అయితే వామపక్ష పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోలు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆర్జెడి ప్రకటించిన మేనిఫెస్టోపై వామపక్ష పార్టీల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ ఎన్నికల్లో మహాగడ్ బంధన్ (ఇండియా కూటమి) నుంచి గట్టి పోటీ ఎదురవుతుంది. కుల, మత సమీకరణలు ఎలా ఉన్నప్పటికీ ఆర్జెడి (మహాగడ్ బంధన్) కి సానుకూల పవనాలు వీస్తున్నాయి. మహాగడ్ బంధన్ లో ఆర్జెడి, కమ్యూనిస్టులు (లిబరేషన్) పార్టీలు మాత్రమే బలంగా ఉన్నాయి. అయితే, కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించ లేకపోయింది. ఈ కూటమి అధికారంలోకి రాకపోవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కారణమని అపవాదు మూటగట్టుకుంది. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కంటే లిబరేషన్ పార్టీ బలంగా ఉంటుందని దైనిక్ భాస్కర్ లాంటి పత్రిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 70 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ కేవలం 19 మాత్రమే గెలిచింది. దీంతో ఎక్కువ సీట్లు గెలిచిన ఆర్జెడి కొద్ది తేడాతో అధికారానికి దూరమైంది. ఇది ఇలా ఉండగా ఆ ఎన్నికల్లో కమ్యూనిస్టులు మంచి ఫలితాలు సాధించారు. ప్రజల్లో పట్టు పెరిగింది. వామపక్షాలకు అధిక సీట్లు ఇచ్చి ఉంటే అధికారం లభించి ఉండేదని అభిప్రాయాలు, విశ్లేషణలు ఆనాడు కొనసాగాయి.

అయితే ప్రధాన వామపక్ష పార్టీలుగా ఉన్న సిపిఐ ఆరు చోట్ల, సిపిఎం నాలుగుచోట్ల పోటీ చేసి చెరో రెండు స్థానాలు గెలిచారు. మరొక వామపక్ష పార్టీ అయినా సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 19 స్థానాల్లో పోటీ చేసి 12 స్థానాలను గెలుపొంది సత్తా చాటుకుంది. మరో మూడు సీట్లు కొద్ది తేడాతో కోల్పోయింది. 3.16 ఓట్ల శాతాన్ని, 63.2 స్ట్రైక్ రేట్ ను పెంచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీకి దృఢమైన కేడర్ ఉంది. అణగారిన జనాలు ఆ పార్టీ వెంట ఉన్నారు. బీహార్ రాష్ట్రంలో విప్లవ పార్టీగా మొదటి నుంచి గుర్తింపు సాధించింది. సాయిధ పోరాట మూలాలు కలిగిన ఈ పార్టీ ఎన్నికల రంగంలో అద్భుత విజయాలను సాధిస్తుంది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఇద్దరు ఎంపీలు, ఓ ఎమ్మెల్సీ సైతం ఉన్నారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలకు మంచి



ఆదరణ కనిపిస్తుంది. ప్రస్తుత ఎన్నికల్లో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 20 చోట్ల పోటీ చేస్తుంది. సిట్టింగ్ స్థానాల్లో పాతవారిని కొనసాగిస్తూ మిగిలిన చోట కొత్తవారిని బరిలోకి దింపింది. ఆ పార్టీ ప్రకటించిన 20 మందిలో ఒక మహిళ పోటీలో ఉంది, దిఘా నియోజకవర్గం నుంచి దివ్య గౌతం పోటీ చేస్తుంది. ఇద్దరు మైనార్టీలు, ఆరుగురు దళితులు (ఎస్సీ రిజర్వుడు), మిగిలిన చోట అణగారిన తరగతులకు చెందిన వారు పోటీలో ఉన్నారు. కోటీశ్వరులు కాదు, ఆర్థికంగా వెనుకబడిన వాళ్ళు. ప్రజా పోరాట యోధులు, జైలు జీవితాలు గడిపిన యోధులు ఉన్నారు. యువతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు.

ఈసారి సిపిఐ పార్టీ గతంలో పోటీ చేసిన ఆరు స్థానాలలో రంగంలో ఉంది. మరొక మూడు స్థానాల్లో స్నేహపూర్వక పోటీ దిగింది. సిపిఎం నాలుగు స్థానాల్లో పోటీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో వామపక్షాల బలం బాగా పెరిగింది. ఇటీవల ఓట్ల సవరణ (సర్) , ఓట్ల చోరీని మొదట రాజకీయ పోరాటంగా మలిచింది సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఆ తర్వాత ఉమ్మడి వేదికగా ప్రజల్లోకి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి ఉమ్మడి యాత్ర నిర్వహించారు. అయితే అంతకుముందే రాష్ట్రంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ న్యాయ యాత్ర పేరుతో బీహార్ అభివృద్ధి కోసం పాదయాత్రలు చేపట్టింది. ఊహించని విధంగా ఈ పాదయాత్రలు సక్సెస్ అయ్యాయి. ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సాధనంగా పాదయాత్రలు ఉపయోగపడ్డాయి.

వీధుల్లో పోరాటాలు ఎక్కువగా చేసే వామపక్ష పార్టీలు ఈ ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో ఎర్ర జెండా ఎగిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2020 ఎన్నికల్లో బిజెపికి సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ గట్టి పోటీని ఇచ్చింది. ఈ ఎన్నికల్లోను ఆ పార్టీ నుంచి గట్టి సవాలుని బిజెపి ఎదుర్కొంటుంది. గెలుపు ఓటములను నిర్ణయించే శక్తిగా ఇక్కడ వామపక్ష శిబిరం ఉంది. అందులో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ది ప్రధాన పాత్ర. ఈ ఎన్నికల్లో పలుచోట్ల నామినేషన్ వేసే సమయంలో ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థులు అరెస్టు అయ్యారు. రాజకీయ ప్రేరేపిత కేసుల్లో ఇరికించబడి ఎన్నికల సమయంలో ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. దరౌలీ ఎమ్మెల్యే సత్యదేవ్ రామ్ అరెస్టు అయ్యారు. గత ఎన్నికల్లో భోరే సీటులో 400 ఓట్లతో ఓడిపోయిన జితేంద్ర పాశ్వాన్ ను ఎన్నికల్లో పోటీ చేయకుండా చేశారు. ఆ నియోజకవర్గంలో జెఎన్యూ మాజీ అధ్యక్షుడు ధనుంజయ్ పోటీలో ఉన్నారు.

ఈసారి 20 చోట్ల పోటీ చేస్తున్న లిబరేషన్ పార్టీ ప్రజల్లో ఆదరణ ఉన్న పార్టీ నాయకులను, యువతరాన్ని ప్రోత్సహిస్తూ.. అణగారిని వర్గాలకు టికెట్లు కేటాయించింది. వాస్తవానికి ఆ పార్టీ 45 సీట్లు ఇవ్వాలని పట్టుబట్టింది. కనీసం 30 సీట్లు ఇచ్చి ఉంటే సామాజిక పొందిక మరోలా ఉండేది. సిపిఐ 24 సీట్లు, సిపిఎం పది సీట్లు డిమాండ్ చేశాయి. పొత్తులో భాగంగా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా బలాన్ని బట్టి వామపక్షాలకు కనీసం 50 సీట్లు కేటాయింపులు జరగాల్సి ఉండేనని వామపక్ష పార్టీల నాయకులు చెబుతున్నారు. గత అనుభవాల రీత్యా కాంగ్రెస్ కు తగ్గించాల్సి ఉండేనని, రాహుల్ గాంధీ నేతృత్వం వహించిన ఓటు చోరీ యాత్ర వల్ల బలం పెరిగిందన్న భ్రమల్లో ఆ పార్టీ ఉందని జాతీయ మీడియా పేర్కొంటుంది. 60 సీట్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎలా ఉంటుందో ఎన్నికల ఫలితాల వరకు ఉంటుందో వేచి చూడాల్సిందే.

మహా గడ్ బంధన్ లో గతంలో ఐదు పార్టీలు ఉండగా, ఇప్పుడు పలు పార్టీలు వచ్చి చేరాయి. వారికి కూడా టిక్కెట్లు సర్దుబాట్లు చేయాల్సి రావడంతో వామపక్షాలకు తగిన సీట్లు కేటాయించబడలేదు. అయితే బిజెపిని ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి రాకుండా చేయాలన్న దృఢ సంకల్పంతో వామపక్షాలు సీట్ల విషయంలో వెనక్కి తగ్గాయి. సంకీర్ణ ధర్మాన్ని పాటించాయి. సీట్ల సర్దుబాటు చేసుకుని ఎన్నికల రణరంగంలో ముందంజలో ఉన్నాయి. వామపక్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కేడర్ ఉంది. 70 నుంచి 80 వరకూ సీట్లలో భారీ ఓట్ బ్యాంక్ కలిగి ఉన్నాయి. గెలుపు ఓటమిలు నిర్ణయించటంలో వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. ఓటు రాజకీయాలు వ్యాపారమైనప్పటికీ ఓటర్లలో రాజకీయ చైతన్యం కలిగిస్తూ తమ పునాది, ఉనికిని నిలుపుకుంటున్నాయి. కుల, మత, ధన ఇతర ప్రలోభాలు తీవ్రంగా ఉన్నప్పటికీ సమరశీలంగా ఉద్యమాలు చేస్తూ తమ బలాన్ని పెంచుకున్నాయి. ఆ రాష్ట్రంలో అణిచివేతలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన చరిత్ర వారికి ఉంది. లిబరేషన్ పార్టీ నేతలు అయితే కొందరు జైల్లో ఉండి గెలిచిన సందర్భాలు ఉన్నాయి. ఇక ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. బీహార్ రాజకీయాల్లో నూతన మార్పులకు అవకాశం ఉంటుంది. వామపక్షాల పాత్ర పెరిగి ప్రభుత్వ ఏర్పాటులో కీలకమవుతారని రాజకీయ విశ్లేషణలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల ఫలితాల అనంతరం లిబరేషన్ పార్టీ ఎలాంటి పాత్ర పోషిస్తుందనేది బీహార్ రాజకీయాల్లో ఆసక్తికరమైన అంశంగా ఉంది.



- మామిండ్ల రమేష్ రాజా
7893230218



### అంతా అరకాసు తిరకాసు

ఇక్కడ అంతా మామూలే
ఏనుగు చెట్టు ఎక్కుతుంది
గాడిద వేగంగా పరిగెత్తుతుంది
గుర్రాలు బరువులు మోస్తాయి
నక్కలు రాజకీయం చేస్తాయి
తోడేళ్లు శాసనాల నిర్మిస్తాయి

ఇక్కడ ఎవ్వడికి వాడే సింహం
ఎవ్వడి సింహాసనం వాడిది
ఎవడికి వాడు పులిలా గర్జిస్తాడు
చిరుతపురులై చిందులేస్తాడు
పటాటోపానికి ఢోకా లేదు
పచ్చి గడ్డి తినడానికి వెనుకాడరు.

వాడు చేసిన పనిలో గొప్పతనం ఉండదు
వాడు గొప్పగా చెప్పుకున్నది వాడిది కాదు.
ఎవ్వడి పనివాడు సరిగా చేయడు
ఇంకొకని పనికి వంకలు పెడతారు
ఇక్కడ సన్యాసులు శాస్త్రవేత్తలై
శాస్త్రవేత్తలను సన్యాసులను చేస్తారు.

ఎవ్వడు ఎవ్వని అర్థం కాదు
ఎక సెక్కాలకు ఏమీ తక్కువ లేదు.
అమ్మా నాన్నలు అడుక్క తింటారు
అనువైన జంతువులు పూజించబడతాయి .
స్త్రీలు పగలు గౌరవించబడతారు
చీకట్లో బలాత్కారం చేయబడతారు.

ఎవ్వని ముఖం వానికి అద్దంలో
అందంగానే కనపడుతుంది
అంతటా సత్యవంతుల దర్శనం
అవినీతి తనంతట తనే జరుగుతుంది
ప్రజల్లో పేదరికం తాండవిస్తది
ప్రపంచమంతా దేశం కీర్తించబడుతది.

నెరువట్ల చైతన్య
9491470746

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**మోమిన్‌పేట, నవంబర్ 6 (జనం సాక్షి) :** ఉచిత కంటి వైద్య శిబిరం ప్రతి ఒక్కరు చదువుకుని లబ్ధి పొందాలని కంటి చూపు సరిగా లేని వారికి ప్రభుత్వం ఉచితంగా ఆపరేషన్ చేస మరికైనా వైద్యం అందిస్తున్న దృశ్య ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి పేర్కొన్నారు గురువారం మోమిన్ పేట మండల కేంద్రంలో అందత్వ నివారణ కేంద్రం ఆధ్వర్యంలో శంకరా కంటి వైద్యశాల వారి సౌజన్యంతో డిఆర్డిఏ షేర్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కంటి చూపు సరిగా లేని వారికి ప్రభుత్వం ఆస్పత్రి యజమాన్యం సహకారంతో ఉచితంగా కంటి వైద్య చికిత్సలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందు కొట్టిందని ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సంయోగం చేసుకొని లబ్ధి పొందాలని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అనేక రోగాల పాడిన పడిన ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా సహకారం అందిస్తుందని ఆయన వివరించారు నేటి కంటి వైద్య శిబిరంలో 32 మందిని గుర్తించి ఆపరేషన్ నిమిత్తం శంకరా కంటి వైద్యశాల తరలించారు ఈ కార్యక్రమంలో డిపిఎం కొమరయ్య ఐకెపి ఎపిఎం మధుకర్ మండల పరిషత్ సూపరిండెంట్ రాజమల్లయ్య శంకర కంటి ఆస్పత్రి డాక్టర్ బాలరాజు మండల వైద్యాధికారి సృజన మండల స్థాయి ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు ఐకెపి సీసీలు సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే ఆందోళన బాట తప్పదు

**శంకర్‌పల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) :** గత ప్రభుత్వం మాదిరిగానే, ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను విస్మరిస్తే రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన బాట తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) స్పష్టం చేసింది. గురువారం నాడు శంకర్ పల్లి మండలంలోని పొద్దటూరులో ప్రగతి రిసార్ట్స్ లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో, జర్నలిస్టుల ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంలో ప్రభుత్వం నుండి జరుగుతున్న జాప్యంపై కార్యవర్గం సుదీర్ఘంగా చర్చించింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి దాదాపు రెండేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించక పోవడం విచారకరమని సమావేశం అభిప్రాయపడింది. గత ప్రభుత్వం ఇలాంటి వైఖరినే అనుసరిస్తే గల్లీ నుండి ఢిల్లీ దాక తమ సంఘం లెక్కలేనన్ని ఉద్యమాలు చేపట్టిన విషయాన్ని సమావేశం గుర్తుచేసింది. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇంటి స్థలాలు, ఆరోగ్య పథకం, అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వీలైనంత తొందరలో పరిష్కరించాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ అంశంపై ఐజేయు జాతీయ అధ్యక్షులు, మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్చించినట్లు ఆయన స్పష్టం చేసారు. ఫిబ్రవరి మాసం మొదటి వారంలో విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) జాతీయ ప్లీనరీని విజయవంతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభమైనట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అయితే ఈ ప్లీనరీ సందర్భంలో జనవరి మాసంలో రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాల్లో సదస్సులు నిర్వహించేందుకు సమావేశం నిర్ణయించింది. మహాసభలు పెండింగులో ఉన్న జిల్లాల్లో జనవరి మొదటి వారంలోపు వాటిని పూర్తి చేయాలని సమావేశం నిర్ణయించింది. యూనియన్ నియమించిన ఆయా సబ్ కమిటీల సమావేశాలను త్వరలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఇటీవల జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో ఫ్రెండ్స్ ప్యానెల్ కు మద్దతు పలికి, ప్యానెల్ గెలుపు కోసం శ్రమించిన రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీతో పాటు ఇతర నాయకులను కార్యవర్గం అభినందించింది. అలాగే ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి సమావేశం శుభాకాంక్షలు తెలిపింది. గత కార్యవర్గ సమావేశం తర్వాత యూనియన్ చేపట్టిన వివిధ కార్యక్రమాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ నివేదిక సమర్పించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో అకాల మరణం చెందిన 16మంది జర్నలిస్టులకు సమావేశం నివాళి అర్పిస్తూ, సంతాప సూచికగా మౌనం పాటించింది. రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన రంగారెడ్డి జిల్లా శాఖను



సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో ఐజేయు జాతీయ మాజీ అధ్యక్షులు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. సంపత్ కుమార్, గాడిపల్లి మధు గౌడ్, కార్యదర్శులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జి. మధు గౌడ్, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ లతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 30 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థల సహకారంతో చెరువుల సుందర స్వప్నం సాకారం

- **రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) :** ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్న మాట అక్షర సత్యం అని, కొన్ని అంశాలలో స్వచ్ఛంద సంస్థల ప్రత్యక్ష, పరోక్ష సహకారం సమాజాభివృద్ధికి ఎంతో కీలకమని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి సర్కిల్ సర్కిల్ నానక్ రామ్ గూడ పరిధి రంగాలాల్ కుంటను వర్చుసా ఫౌండేషన్ నేతృత్వంలో ఎంతో సుందరంగా తీర్చిదిద్దిన దరిమిలా గురువారం సమస్త ప్రతినిధులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అరికెపూడి మాట్లాడుతూ రంగలాల్ కుంట ను సుందర శోభిత వనంగా తీర్చిదిద్దిన వర్చుసా ఫౌండేషన్ ప్రతినిధులను ముందుగా తాను ప్రత్యేకంగా అభినందించడం జరుగుతుందన్నారు. రంగలాల్ కుంట ప్రస్తుతం సుజల జలంతో కళకళ లాడుతూ ఆహుతులను ఇట్టే కట్టిపడేస్తుందని అన్నారు. ప్రస్తుతం పర్యావరణ కాలుష్యం భయంకరంగా పెరిగిపోతూ మనిషికి ప్రాణ సంకటంగా మారిందని భవిష్యత్తు తరాలకు కోట్లాది రూపాయల ఆస్తులను పంచే కంటే మంచి ఆరోగ్యం, ప్రశాంతజీవితం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధి నానక్ రామ్ గూడ లోగల రంగలాల్ కుంట చెరువు సుందరికరణకై ప్రముఖ ప్రొడక్ట్, ప్లాట్ ఫామ్ ఇంజనీరింగ్ సేవల సంస్థ వర్చుసా కార్పొరేషన్ తన దాతృత్వ విభాగం మరియు సోషల్ కార్పోరేట్ రెస్పాసిబిలిటీ పథకం కింద నిధులను వెచ్చించి జిహెచ్ఎంసి భాగస్వామ్యంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ద్వారా స్వచ్ఛందంగా చేపట్టిన సుందరికరణ మరియు పునరుద్ధరణ పనులు పూర్తి కావడం ఎంతో శుభ పరిణామం అన్నారు. సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్ధవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా సాధించగలుగుతాయో చెప్పడానికి ఇది ఒక మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చని ఆయన వివరించారు. సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే గాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధికోసం రంగలాల్ కుంట మార్గదర్శకంగా



నిలుస్తుందన్నారు. రంగాలాల్ కుంట చెరువుకట్ట చుట్టూ చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ క్యాంపస్ సమీపంలోని 3.5 ఎకరాల రంగలాల్ సరస్సును 14 కంటే ఎక్కువ స్థానిక జాతుల పక్షులు, సీతాకోకచిలుకలు, ఇతర జంతుజాలం, వృక్షజాలం తిరిగిరావడం స్థానిక పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించినట్టయ్యిందన్నారు. ఈ ప్రాజెక్ట్ నీటి మట్టాలను నియంత్రించడానికి, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి ఒక వీర్ గేట్‌తోపాటు సురక్షిత కంచెలతో కూడిన పాదచారుల నడక మార్గం, తోటలతో కూడిన ప్రకృతి దృశ్యాలతో గ్రీన్ జోన్, గెజిబో, పెర్గోలా, సీటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్చుసా సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అమిత్ బజోరియా, టీజీఐసీ జోనల్ కమిషనర్ ఎం. కవిత, జి టెక్ యాడ్స్ సొల్యూషన్ ఉపాధ్యక్షురాలు దుగ్గిరాల మాధురి, కార్పోరేటర్లు గంగాధర్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, ప్రతినిధులు మోహిత్ శర్మ, శ్రీనివాస్ సుబ్బారావు, రాహుల్ శర్మ, రేఖ శ్రీనివాసన్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీకాంత్ పాకాల, నాయకులు సంజీవ రెడ్డి, మంత్రి ప్రగడ సత్యనారాయణ, నాయి నేనీ చంద్రకాంత్ రావు, ఇబ్రహీం, విష్ణు వర్ధన్ రెడ్డి, అనిల్, ప్రభాకర్ రెడ్డి, శ్రీశైలం, సురేష్ నాయక్, ప్రవీణ్, లక్ష్మణ్, పింటు, శ్రీనివాస్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట కత్తిపోట్ల సంఘటనలో బాధితుడు మృతి

- **నిందితులను అరెస్టు చేసిన పోలీసులు**
- **మృతుడు, నిందితుడు ఇద్దరు రౌడీ షీటర్‌లే..**
- **వివరాలు వెల్లడించిన మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి**

**కుత్బుల్లాపూర్, నవంబర్ 6 (జనం సాక్షి) :** జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లో బుధవారం జరిగిన రౌడీ షీటర్ పై మరో రౌడీషీటర్ కత్తితో దాడికి పాల్పడిన ఘటన సంచలనం సృష్టించింది .ఈ ఘర్షణకు పాతకక్షలే కారణం అని పోలీసుల విచారణలో తేలింది.హత్యకు గురైన వ్యక్తి మృతిచెందగా దాడికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్ కి తరలించారు.ఈ హత్య కేసు కు సంబంధించిన వివరాలు గురువారం షాపూర్ నగర్ లోని బాలనగర్ డిసిపి కార్యాలయంలో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి,ఎస్ఓటి డిసిపి. శోభన్ కుమార్, బాలానగర్ జోన్ ఏసీపీ.పింగళి నరేష్ రెడ్డి, తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు..జగద్గిరిగుట్ట జగద్గిరి నగరి ప్రాంతానికి చెందిన టి.బాలశౌ రెడ్డి అలియాస్ బాద్ షా(21) పాత నేరస్థుడు షరీఫ్ అనే వ్యక్తితో పాత కక్షలు నడుస్తున్నాయి.ఈ గొడవతో షరీఫ్ సన్నిహితుడైన రంగారెడ్డినగర్ పంచశీల కాలనీకి చెందిన రోషన్ కుమార్ సింగ్ (26) పాత నేరస్తుడు జోక్యం చేసుకొని తన స్నేహితుడు షరీఫ్ విషయంలో తలదూర్చితే అంతుచూస్తానని బాలశౌరెడ్డిని పలుమార్లు బెదిరింపులకు గురిచేసాడని పోలీసులు తెలిపారు.ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న బాలశౌరెడ్డి తనకు ప్రమాదం ఉందని తెలిసి ముందస్తుగా రోషన్ ను చంపాలని పన్నాగం వేసాడు.అందుకు అమెజాన్ లో కత్తిని బుక్ చేసిన కొనుగోలు చేసాడు.అనంతరం జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన తన స్నేహితులైన సయ్యద్ మహమూద్ (28)ఆదిల్ (26) ల సహకారంతో రోషన్‌ను హత్య చేసేందుకు బుధవారం పక్క స్కెచ్ వేశాడు.జగద్గిరిగుట్ట బస్ స్టాప్ కు మాట్లాడుకుందామని పిలిపించాడు. అక్కడికి చేరుకున్న రోషన్‌తో బాలశౌ రెడ్డికి మాటమాట పెరగడంతో మహమూద్ రోషన్ ను వెనుక నుండి



పట్టుకోగా బాలశౌ రెడ్డి తాను తెచ్చుకున్న కత్తితో ఛాతి,పొత్తి కడుపు,వీపు పలుచోట్ల విచక్షణ రహితంగా పొడిచాడు.అందరూ చూస్తుండగానే ఈ దారుణ ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు..తీవ్ర రక్తస్రావంతో వారిద్దరి నుండి రోషన్ వారి నుండి కాలర్ వదిలించుకొని పరుగులు తీశాడు.సమీపంలోనే నిందితుడు బాలశౌరెడ్డి మరో స్నేహితుడు ఆదిల్ బుల్లెట్ వాహనం పై ముగ్గురు కలిసి అక్కడికి నుండి పరారయ్యారు.దీంతో తీవ్ర గాయాల పాలైన రోషన్ ను స్థానికులు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్కు సమాచారం అందించారు.స్థానికంగా ఉన్న మెడిటెక్ ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో గాంధీ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి రోషన్ మృతి చెందాడు.ఈ సంఘటనతో రంగంలోకి దిగిన ఎస్ఓటి విభాగం డిసిపి శోభన్ కుమార్ పర్యవేక్షణలో బాలనగర్ ఏసిపి.పి.నరేష్ రెడ్డి జగద్గిరిగుట్ట సిఐ.బి.వెంకటేశం, ఎస్ఓటి సిఐ.శివకుమార్ పలు బృందాలుగా ఏర్పడి నిందితులు ముగ్గురిని రాత్రి వరకు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు.పాతకక్షలే ఈ హత్యకు దారి తీసాయని డీసీపీ.కోటిరెడ్డి వెల్లడించారు. గంటల వ్యవధిలోనే ఈ హత్య కేసుకు సంబంధించిన నిందితులను గంటల వ్యవధి లోనే పట్టుకోవడంలో తమ పోలీసు అధికారులు,సిబ్బంది ప్రదర్శించిన తీరును డీసీపీ అభినందించారు.ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట, ఎస్ఓటి ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

## మట్టి దొంగల గుండాగిరీ....!

- **సమాచారం సేకరిస్తున్న రిపోర్టర్ పై దాడికి యత్నం**
- **లోకల్ రిపోర్టర్లు ఉండగా మీరెందుకు వచ్చారంటూ బూతు పురాణం**
- **కొందుర్గు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధిత రిపోర్టర్**
- **ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకుపోతూ దౌర్జన్యం**
- **రంగారెడ్డి జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు**
- **రెవెన్యూ అధికారుల ముందే వాహనాలు తప్పించిన వైనం**
- **అక్రమాలకు పాల్పడ్డవారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు**

**కొందుర్గు, నవంబర్ 6 (జనంసాక్షి) :** ప్రభుత్వ వనరులను దర్జాగా కొల్లగొడుతు రోజురోజుకూ మట్టి దొంగలు రెచ్చిపోతున్నారు... తమ అక్రమ వ్యాపారానికి అడ్డుగా వస్తే ఊరుకునేది లేదంటూ బెదిరింపులకు దిగడమే గాక ఒక అడుగు ముందుకేసి దాడి చేసే ప్రయత్నాలు కూడా చేస్తున్నారు.. అక్రమ మట్టి వ్యాపారంలో అందే వేసిన చేయిగా తమ కార్యకలాపాలు కొనసాగిస్తూ ప్రశ్నించిన వారిపై తమ పవర్ చూపే ప్రయత్నం చేస్తున్నారు. సరిగ్గా ఇలాంటి సంఘటనే రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండలం కస్తూర్బా గాంధీ హాస్టల్ దగ్గర గురువారం చోటుచేసుకుంది. కస్తూరిబా గాంధీ హాస్టల్ సమీపంలో ఉన్న సర్వేనెంబర్ 109 పూర్తిగా ప్రభుత్వ భూమి. అక్రమార్కులు సరిగ్గా ఇదే భూమిని టార్గెట్ గా చేసుకుని మట్టిని దోచుకుంటున్నారు. పట్ట పగలు జెసిబిలు పెట్టి టిప్పర్ల ద్వారా భారీ ఎత్తున మట్టి తరలింపు చేస్తున్నారూ . రాత్రుల్లో అయితే విచ్చలవిడిగా వాహనాలు నడుస్తున్నాయని పెద్ద ఎత్తున ఇటాచిలతో కూడా భారీ శబ్దాలతో వాహనాలు వెళ్తూ ఉంటాయని స్థానికంగా తెలుస్తుంది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న రిపోర్టర్లు అక్కడికి చేరుకుని జరుగుతున్న తతంగం విషయంలో కొందుర్గు తహసిల్దార్ కు ఫోన్ చేసి సమాచారం చేరవేసారు. సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత రెవెన్యూ అధికారినీ అక్రమంగా మట్టి తరలించే స్థలానికి పంపించారు. సంబంధిత అధికారి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్, జెసిబిని పోలీస్ స్టేషన్ కి తరలించమని చెప్పగా మట్టి మాఫియా మాత్రం ఏమాత్రం అధికారి మాట వినకుండా టిప్పర్ను తప్పించారు. ఆగ్రహించిన సదరు రెవిన్యూ సిబ్బంది లారీ యజమానిపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

### రిపోర్టర్ల పై రౌడీయిజం

ఈ అక్రమ దందా విషయాన్ని తహసిల్దార్ కు సమాచారం చేరవేసినందుకు మట్టి మాఫియాకు చెందిన మాలిక్, సంతోష్ రెడ్డి అనే వ్యక్తులు రిపోర్టర్ల పై తమ రౌడీయిజం చూయించారు. ఒక స్థాయిలో రిపోర్టర్ ని కొట్టడానికి కూడా ప్రయత్నించదంతో సదరు రిపోర్టర్ కొందుర్గు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

## స్టాక్ ట్రేడింగ్ మోసాలపై అవగాహన



**శేరిలింగంపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 'సైబర్ జాగరూకత దివస్' పేరుతో గురువారం స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ మోసాలు, ఇన్వెస్ట్మెంట్, ఐపిఓ తదితర అంశాలపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం డిసిపి సాయి శ్రీ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు దాదాపు నాలుగు లక్షల 80 వేల మందికి పోలీసు అధికారులు సైబర్ క్రైమ్ గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్.సి.ఎస్.సి సీనియర్ మేనేజర్ భాను మూర్తి, రాజేంద్రనగర్, మాధాపూర్ డిసిపి లు, సైబర్ క్రైమ్స్ ఏసిపి రవీందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత



**రాజేంద్రనగర్, నవంబర్ 6 (జనం సాక్షి) :** హైదరాబాద్‌లో నిషేధిత మాదకద్రవ్యాలను సోషల్ మీడియా ద్వారా కస్టమర్లకు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్ రాకెట్‌ను రాజేంద్రనగర్ పోలీసులు బ్లాస్ట్ చేశారు. బుధవారం రాజేంద్రనగర్ డిసిపి యోగేష్ గౌతమ్ మీడియాకు వివరిస్తూ ఈ ఆపరేషన్‌లో రాజేంద్రనగర్ పోలీసులు, ఎస్ఓటి రాజేంద్రనగర్-మాదాపూర్ జోన్ సంయుక్తంగా పాల్గొన్నారని, విశ్వసనీయ సమాచారం ఆధారంగా నవంబర్ 6న ఆరాంఘర్ ఎక్స్‌రోడ్ సమీపంలో దాడి చేసి ముగ్గురు సరఫరాదారులను పట్టుకున్నారు. వారు, కాకినాడకు చెందిన సంగడి సంతోష్ (26), బెంగళూరుకు చెందిన గాంధీ సందీప్ (23), రాజమండ్రికి చెందిన కందేపల్లి శివకుమార్ (23). వారి వద్ద నుండి ఎండిఎంఏ 18 గ్రాములు, గంజాయి 130 గ్రాములు, 5 మొబైల్ ఫోన్లు, కొంత నగదు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పిల్లర్ నం.307 వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర ముగ్గురు వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు.వారు ం ఐటీ ఉద్యోగి పాలక సాయి బాబు (25), కొత్త విశాల్ రెడ్డి (28), ఫోటోగ్రాఫర్ ప్లిషెట్టి సమీర్ (24). వీరిపై ఎన్ డిపిఎస్ చట్టం 1985 కింద కేసు నమోదు చేశారు. డీసీపీ తెలిపారు నిందితులు సోషల్ మీడియా యాప్స్ ద్వారా కస్టమర్లను సంప్రదించి, నగర పరిసరాల్లో డ్రగ్స్ సరఫరా చేసేవారని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# మీర్జాగూడ బస్సు ప్రమాద బాధితులకు మహేందర్ రెడ్డి ఆపన్న హస్తం

- **ఒక్కొక్కరికి రూ.20వేల స్వంతంగా ఆర్థిక సహాయం**
- **ప్రభుత్వ పరంగా ఇంకా ఆదుకుంటాం**
- **రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని పిలుపు**
- **తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**

**తాండూరు, నవంబర్ 6 (జనంసాక్షి) :** చేవెళ్ల మండలం మీర్జాగూడ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అప్పన్న హస్తం అందించారు. మీర్జాగూడ వద్ద మితిమీరిన వేగంతో తాండూరు ఆర్టీసి బస్సును కంకర ట్రిప్పర్ ఢీ కొన్న ఘటనలో 19 మంది మృతిచెందగా, మరో 21 మంది గాయాల పాలైన నేపథ్యంలో మహేందర్ రెడ్డి గురువారం తాండూరులో పర్యటించి 13 మంది మృతుల బాధిత కుటుంబాలను పరామర్శించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీ లోని సాహెల్,ఖాలీద్ లతో పాటు 02నెలల పాప కుటుంబానికి, వాల్మీకి కాలనీలో వెంకటమ్మ, విశ్వంభర (బృందావనం)కాలనీలో తబస్సుమ్, గౌతాపూర్ లోని ముస్కాన్ బేగం , పాత తాండూర్ లోని దస్తగిరి ఇళ్ళకు వెళ్ళి ప్రభుత్వం అందించిన రూ. 7 లక్షలకు అదనంగా తన స్వంత డబ్బులు ఒక్కొక్కరికి రూ. 20 వేల ఆర్థిక సహాయం చేశారు.అలాగే యాలాల మండలం పేర్కంపల్లి ఎల్లయ్య గౌడ్ కుటుంబం మరింత విషాదం నింపిన ముగ్గురు కుమార్తెల విషయంలో మహేందర్ రెడ్డి తీవ్ర మనస్తాపంకు గుర్రైయ్యారు. ఎల్లయ్య గౌడ్ కుటుంబంతో పాటు లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన అకిలా,హాజీపూర్ కు చెందిన మృతులు బందెప్ప, లక్ష్మి దంపతుల కుటుంబానికి ఆర్థిక సహాయం చేశారు. బందప్ప పిల్లలు అనాధలుగా కాకుండా తమ ట్రస్ట్ ద్వారా చదువులు ఇతర అంశాలకు ఆదుకుంటామని మహేందర్ రెడ్డి బాధాతప్త హృదయంతో హామీ ఇచ్చారు.అలాగే గాయపడిన తాండూర్ ప్రాంతానికి చెందిన ఏడుగురి కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పారు. ఇంకనూ ప్రభుత్వపరంగా మృతి చెందిన, గాయపడిన కుటుంబాలకు అవసరమైన ఆర్థిక సహాయం చేస్తామని మహేందర్ రెడ్డి వెల్లడించారు. బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయిస్తామని తబస్సుమ్ కుటుంబికుల వద్ద వివరించారు. తన సహాయ సహకారాలు ఎల్లవేళలా తాండూరు ప్రజలకు ఉంటాయన్నారు. గాయడడిన వారందరికీ చేవెళ్ల లోని తన ఆస్పత్రిలో మంచి వైద్యం అందిస్తున్నట్లు మహేందర్ రెడ్డి వివరించారు.

### మానవ తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలు చాలా మటుకు మానవ తప్పిదాలతోనే జరుగుతున్నాయని మహేందర్ రెడ్డి తెలిపారు. మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం గతంలో ఆలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ఇలాంటి ప్రమాదాలన్నీ డ్రైవర్ల నిర్లక్ష్యం, మితిమీరిన వేగం, విశ్రాంతి లేకుండా విధులను నిర్వహించడం, లారీల ఓవర్ లోడింగ్ తదితరులతో చోటు చేసుకుంటున్నాయని మహేందర్ రెడ్డి చెప్పారు. పోలీస్ అకాడమీ మన్నెగూడ రోడ్డు గ్రీన్ ట్రిబ్యునల్ లో ఇటి వలె సమస్య పరిష్కారమై పనులు ప్రారంభమైన నేపథ్యంలోనే ప్రమాదం చోటు చేస్తుందని ఇది అత్యంత బాధాకరమని మహేందర్ రెడ్డి వాపోయారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించమని అన్నారు. వికారాబాద్ - తాండూర్ రోడ్డుకు సైతం



తాను మంత్రిగా ఉన్నప్పుడే నిధులు ఇచ్చి, పనులు జరిగాయని తన ఓటమి తర్వాత ఆ రోడ్డు పనులను పూర్తి చేసుకోలేక, అభివృద్ధి చేసుకోలేక పోయిందని పేర్కొన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డికి వివరిస్తే చొరవతో ఈ పనులు ప్రారంభమయ్యాయి అని అన్నారు. వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న తరుణంలో రోడ్ల విస్తరణతో పాటు రోడ్డు భద్రత నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని మహేందర్ రెడ్డి సూచించారు. ఇందుకు త్వరలో రోడ్డు భద్రత పై ప్రతి వ్యక్తికి అవగాహన కలిగేటట్లుగా చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని అవగాహన కార్యక్రమాలు ప్రారంభమైతాయని మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటీ సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, సీనియర్ నేత సిద్రాల శ్రీనివాస్, గడ్డలి రవిందర్,బిర్కిట్ రఘు,పరిమళ, అబ్దుల్ కవి,భగవాన్, అగ్గనూర్ సంకేత్, సిద్దు అయ్యా, ఆదమ్ ఖాన్ తదితరులు ఆయనతో ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
07 నవంబర్ 2025

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**● ఇందిరమ్మ ఇండ్ల కార్యదర్శి వి.పి గౌతమ్**



**కౌడిపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం ధర్మసాగర్, గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరుపై ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టరేట్లోని ప్రజావాణి హాల్లో సమీక్షించారు. ఈ సందర్భంగా హౌసింగ్ కార్యదర్శి వి.పి గౌతమ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మార్కెట్ పనులు వంద శాతం పూర్తి చేయాలని, ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టివ్వాలనే లక్ష్యంతో అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ప్రతి అర్హత గల కుటుంబం త్వరితగతిన తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఇంకా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టని వారికి వారం రోజులు గడివిచ్చారు. వారం రోజుల తర్వాత కూడా ఇందిరమ్మ నిర్మాణం మొదలు పెట్టని యెడల లబ్ధిదారుల స్థానంలో వేరే లబ్ధిదారులకు కేటాయించే విధంగా చూడాలన్నారు. అనంతరం ఎంపిడిఓలు తమ తమ మండలాల్లో పర్యవేక్షిస్తూ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, గృహనిర్మాణ శాఖ,మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మార్కెట్ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అదేవిధంగా, మార్కెట్ పూర్తి చేసిన గ్రామాల వివరాలు ప్రతిరోజూ అప్డేట్ చేయాలని, వంద శాతం లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక మానిటరింగ్ బృందాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదలకు సొంత గృహం కల స్వప్నం సాకారం అవుతుందని ఈ సందర్భంగా తెలిపారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే సమయంలో ఇబ్బందులు తలెత్తితే నిర్మాణానికి అవసరమైన నిధులను మహిళా సంఘాల (స్వయం సహాయక సంఘాల) ద్వారా లోన్ రూపంలో లబ్ధిదారులకు అందించాలని, లబ్ధిదారులు ఇళ్లు సమయానికి పూర్తి చేసుకునే అవకాశం లభిస్తుందని, మహిళా సంఘాల ద్వారా ఆర్థిక సాయం అందించడం వల్ల గ్రామీణ మహిళల ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందన్నారు. జీపీ, వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులలో పురోగతిని తీసుకురావాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిలో లక్ష్యాలు అధిగమించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక ఆసరా అత్యంత వేగంగా లబ్ధిదారుల అకౌంట్లో జమ అవుతుందని చెప్పారు. సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని, దీనిలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని తెలిపారు. లబ్ధిదారులు అందరూ ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని, త్వరితగతిన తమ సొంత ఇంటి కలను పూర్తి చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉండి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, హౌసింగ్ పిడి మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎమ్మార్వో కృష్ణ, పంచాయతీ సెక్రటరీ వెంకటేశం, ఏపీఓ పుణ్యదాస్, హౌసింగ్ ఏఈ,డిఈలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## హామీల అమలు కోసం కాంగ్రెస్ పని చేయాలి




**చేర్యాల, నవంబర్ 6 (జనంసాక్షి) :** ఓట్ల కోసం కాదు హామీల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేయాలని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం తథ్యమని అక్కడ ప్రజలు అధికార కాంగ్రెస్ ను ఆదరించడం లేదని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసిన బిఆర్ఎస్ విజయం ఖాయం అన్నారు. వారికి ఓట్ల అవసరం ఉన్నపుడే ప్రజలు గుర్తుకు వస్తున్నారని, హామీల అమలు కోసం మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుర్తు రావడం లేదని తెలిపారు. కేసీఆర్ కేటీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష అభ్యంతరకరమని అన్ని వర్గాల ప్రజలు సీఎం మాట్లాడుతున్న తీరును చూసి ముక్కున వేలేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై ఆందోళన చేస్తే గానుగుపాడు నాయకులపై పోలీసులు కేసులు పెట్టడం సరికాదన్నారు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గానుగపాడు ప్రజలకు అండగా నిలబడ్డారని ప్రజా సమస్యల పరిష్కారమే ఎమ్మెల్యే పళ్ళ లక్ష్యమన్నారు రానున్న రోజుల్లో మరిన్ని ఆందోళన కార్యక్రమాలను ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేపడుతుందన్నారు. ఆయనతో పాటు గర్నపెల్లి చంద్రం, షేక్ సుభాని, నరేష్ గౌడ్, సాయిలు, గణేష్,హమీన్ పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు వెంటనే జరగాలి

**● గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్**



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 6 (జనం సాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా మిల్లుల యజమానులు తలపెట్టిన సిసిఐ కొనుగోళ్ల బంద్ ను ఉపసంహరించుకోవడం జరిగిందని, ఈ నెల 6వ తేది నుండి యధావిధిగా పత్తి కొనుగోలు ప్రక్రియ జరుగుతుందని రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిన్నింగ్ మిల్లుల యజమానులు కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. అకాల వర్షాల వలన ప్రస్తుత పత్తి కొనుగోలు సీజన్ కు సంబంధించిన ఏర్పాట్లు, రైతులకు సరైన ధర చెల్లింపు, కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాల ఏర్పాటు, తూకం చెల్లింపు ప్రక్రియల పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. మద్దతు ధరలకు కొనుగోళ్లు జరిగేలా చూడాలని, రైతులకు అన్ని సదుపాయాలు కల్పించాలని పత్తి కొనుగోళ్లు సీసీఐ ద్వారా మద్దతు ధరలకు పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఇతర అధికారుల మధ్య సమన్వయం అవసరమని ఆయన అన్నారు. పత్తి కొనుగోలు ప్రక్రియను రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పారదర్శకంగా, వేగంగా జరిగేలా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీసీఐ అధికారులు మిల్లుల యజమానులు రైతులకు తగిన మద్దతు ధర చెల్లించడం, తేమ శాతం పరిశీలనలో నిబంధనలు పాటించడం, బరువు తూకం పట్ల సక్రమంగా వ్యవహరించాలని సూచించారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు

**● జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 6 (జనం సాక్షి) :** జిల్లాలోని ఎస్. సి., ఎస్. టి. అట్రాసిటీ కేసులలో బాధితులకు తత్వరా న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం వి.సి.కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎస్.పి.డి జానకి తో కలిసి జిల్లా అధికారులు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో గత సమావేశం నుండి ఈ సమావేశం వరకు కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో 2019 నుండి 2025 వరకు ఎస్.సి.,ఎస్టీ అట్రాసిటీ నమోదైన కేసులు, బాధితులకు పరిహారం చెల్లింపు,పెండింగ్ కేసుల పై చర్చించారు. జిల్లాలో సంబంధిత శాఖల సమన్వయంతో ఎస్. సి., ఎస్. టి. హక్కులపై ప్రజలలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నెల చివరన నిర్వహించే పౌర హక్కుల దినోత్సవంను మొక్కుబడిగా కాకుండా విస్తృత ప్రచారం గావించి నిర్వహించాలని సభ్యులు కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సభ్యులు కోరిన విధంగా వారి సూచనలు, సలహాలతో ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవంను సమర్థవంతంగా రెవెన్యూ,పోలీస్ అధికారుల సమన్వయంతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నోట్స్ ను సభ్యులకు ముందుగానే అందించి నోట్స్ లో సభ్య లు కోరిన విధంగా ఎస్.సి.,ఎస్.టి.,బి. సి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, హాస్టల్ లు,వసతులు,విద్యార్థుల సంఖ్య,అదే విధంగా ఎస్.సి.,ఎస్.టి.లకు అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు మంజూరు,పరిశ్రమల శాఖ ద్వారా ఇస్తున్న సబ్సిడీ పథకాల వివరాలు కూడా చేర్చి అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశం లో సభ్యులు ప్రస్తావించిన అంశాల పరిష్కారంపై ఎస్.సి.అభివృద్ధి శాఖ అధికారిని ఎప్పటికప్పుడు ఆయా శాఖలకు రిమైండర్లు పంపించాలని చర్యా నివేదిక లో పూర్తి సమాచారం అందించాలని ఆదేశించారు. సీనియర్ సిటిజన్ ల కేసుల లో ఆర్.డి.ఓ,కలెక్టర్ ద్వారా అప్పీల్ లో వచ్చిన ఉత్తర్వులు సక్రమంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశం లో విజిలెన్స్,మానిటరింగ్ కమిటీ సభ్యులు బాలయ్య,లక్ష్మణ్,రవీంద్ర బాబు,చంద్ర శేఖర్ లు అంబేద్కర్ కళాభవన్ వద్ద ఉర్దూ ఘర్ ఏర్పాటు ను సామరస్యంగా చర్చించి వేరే స్థలం లో ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యులు మోహన్ లాల్ మాట్లాడుతూ ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు ద్వారా ప్రభుత్వ సబ్సిడీ రుణాలు మంజూరు చేసిన వాటిని బ్యాంక్‌లు కొర్రీ లు వేస్తున్నారని,సంబంధిత బ్యాంకులు రుణం మంజూరు చేసేలా చూడాలని అన్నారు. సభ్యులు లక్ష్మణ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో లక్ష్మి నగర్ సర్వే నంబర్ 247,257 ఎస్. సి కార్పొరేషన్ కు కేటాయించిన 5 ఎకరాల 3 గుంటల భూమి లో ఆక్రమణలు జరిగాయని,వాటిని తొలగించాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పరిశీలించి



హద్దులు నిర్ణయించి, ఖాళీ స్థలంలో ఫెన్సింగ్ వేయాలని, ఆక్రమణలు ఉంటే వారికి నోటీస్ లు జారీ చేసి డాక్యుమెంట్ లు పరిశీలించాలని ఆదేశించారు. ఎస్.పి.డి.జానకి మాట్లాడుతూ పోలీస్ శాఖ ద్వారా ఎస్.సి.,ఎస్.టి.అట్రాసిటీ కేసులలో సత్వరం స్పందించి చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,అదనపు ఎస్.పి.రత్నం,డి.ఎస్.పి.వెంకటేశ్వర్లు, ఆర్.డి. ఓ నవీన్,షెడ్యూల్డ్ కులాల అబివృద్ధి అధికారిణి డి.సునీత, పరిశ్రమల శాఖ జి. ఎం.యాదయ్య, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.లక్ష్మణ్, రవీంద్ర బాబు, చంద్ర శేఖర్, బాలయ్య, మోహన్ లాల్, వివిధ శాఖల తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు పని చేయాలి

**● జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్**

**గద్వాల నడిగడ్డ, నవంబర్ 6 (జనం సాక్షి) :** పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. గురువారం గద్వాల శివారులోని కొండపల్లి రహదారిలో ఉన్న బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తెచ్చిన పత్తి నాణ్యతను,తూకం ప్రక్రియను పరిశీలించి, పత్తి జిన్నింగ్ ప్రక్రియను ప్రారంభం నుండి చివరి దశ వరకు పరిశీలించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కొనుగోలు కేంద్రాలకు పత్తిని ఆరబెట్టి తీసుకొని వస్తే గిట్టుబాటు ధర లభిస్తుంది అన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మీ పత్తిని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,ఒక్క ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు సీసీఐ అధికారులు కొనుగోలు కొనసాగిస్తారని తెలిపారు. స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పత్తి పంట వేసేటప్పుడే రైతులు తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో,దాని ప్రకారమే స్లాట్ బుకింగ్ చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం త్వరలో మరో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మిల్లులో ప్రతిరోజు 1350 క్వింటాళ్ల సామర్థ్యంతో పత్తి కొనుగోలు జరుగుతోందని,దీనిని 2000 క్వింటాళ్లకు పెంచాలని మిల్లు యాజమాన్యం కోరగా, కలెక్టర్ 1800 క్వింటాళ్ల వరకు పెంచే అవకాశం పరిశీలించాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ,సిసిఐ ఇన్చార్జి రాహుల్ కలేనా,గద్వాల మార్కెట్ యార్డ్ కార్యదర్శి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 7న వందేమాతర గేయం సామూహిక గీతాలాపన

**● జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 6 (జనం సాక్షి) :** వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బంకిం చంద్ర చటర్జీ వందేమాతర గేయ రచన చేసి 150 సంవత్సరాలు పూర్తయిందని, ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ/ స్థానిక సంస్థల/ ఎయిడెడ్/ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమ సంబంధిత ఫోటోలు, వివరాలతో అదే రోజు సాయంత్రం ప్రభుత్వానికి సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు



**జడ్చర్ల, నవంబర్ 6 (జనంసాక్షి) :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు ధాన్యం అమ్ముకోవాలని బాదేపల్లి పిఎసిఎస్ ఛైర్మన్ సుదర్శన్ గౌడ్ పేర్కొన్నారు. జడ్చర్ల మార్కెట్ యార్డులో గురువారం బాదేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ ఛైర్మన్ జ్యోతి రెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ కోనేటి పుష్పలతతో కలిసి పిఎసిఎస్ ఛైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో రైతుల ధాన్యానికి తగ్గట్టు మద్దతు ధరను ప్రభుత్వం అందిస్తుందని రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఏఓ గోపీనాథ్, పిఎసిఎస్ మానిటరింగ్ అధికారి సాధత్ అలీ, మాజీ సర్పంచ్ వెంకటేశం, నాయకులు జనార్దన్ రెడ్డి, లక్ష్మయ్య, సుధాకర్ రెడ్డి, రాజేందర్ గౌడ్, మీనాజుద్దీన్, సీఈవో యాదగిరి, జీవన్ గుండప్ప, చంద్రయ్య, కృష్ణయ్య, అంజిబాబు, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, కాజా అలీముద్దీన్, లక్ష్మణ్, కృష్ణయ్య, యాదయ్య, సునీల్, గిరిప్రసాద్, అనుప కృష్ణయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

**● జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్**

**గద్వాల నడిగడ్డ, నవంబర్ 6 (జనం సాక్షి) :** ధరూర్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి రైతుకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం విస్తృతమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలోని అన్ని మండలాలకు గాను మొత్తం 81 వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గతంలో రైతులు తమ ధాన్యాన్ని గిట్టుబాటు ధర రాకపోయినా రైస్ మిల్లర్లకు అమ్మకానికి ఇవ్వాల్సి వచ్చేదని, అయితే ఇప్పుడు ప్రభుత్వం స్వయంగా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం రైతు సంక్షేమానికి దారితీసే చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ధాన్యంలో తేమశాతం 17% కి మించకూడదని తెలిపారు. రైతులు బాగా ఎండబెట్టి,తాళ్లు మట్టి లేకుండా ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ధాన్యం తూకం వేసి,వివరాలు ఆన్లైన్లో అప్లోడ్ అయిన తర్వాత రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయబడతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల వివరాలు వెల్లడిస్తూ,ఎ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,389,సాధారణ రకానికి రూ. 2,369, అలాగే సన్న రకం ధాన్యానికి అదనంగా రూ. 500 బోనస్ ఇవ్వబడుతుందని చెప్పారు. రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని,కేంద్రాలకు ధాన్యం సరఫరా సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇంతకుముందు జిల్లాలోని రైతులు తమ ఉత్పత్తిని కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు కేంద్రాలకు తరలించాల్సి వచ్చేదని, ఇప్పుడు కర్ణాటక నుండి ధాన్యం మన జిల్లాకు రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్స్,గన్నీ బ్యాగ్స్, టార్పాలిన్లు వంటి అవసరమైన సదుపాయాలన్నీ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 2 లక్షల టన్నుల ధాన్యం, దాదాపు 500 కోట్ల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనుందని,ఇది రైతుల ఆదాయ వృద్ధికి, జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. గతంలో కొనుగోలు కేంద్రంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించి,ఈ సంవత్సరం అన్ని కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే పూర్తి ఏర్పాట్లు చేసినందున రైతులు సమన్వయంతో సహకరించి సజావుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ఎ గ్రేడ్ వడ్లకు రూ. 2,389,సాధారణ రకానికి రూ. 2,369 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని, అదనంగా సన్న వడ్లకు రూ. 500 బోనస్ కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పంటలను దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే అమ్మకాలు జరపాలని సూచించారు. అదేవిధంగా మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, మహిళా సంఘాల ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు.



కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు,తూకం సదుపాయాలు, టార్పాలిన్లు వంటి అన్ని వసతులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ధాన్యం అమ్మకాలు పూర్తి చేసుకోవచ్చని అన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన తర్వాత రెండు నుండి మూడు రోజుల్లోనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని,ఈ విధంగా ప్రభుత్వం రైతుల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తోందని తెలిపారు. పర్యావరణహిత వ్యవసాయం ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, నేను కూడా రైతు బిడ్డనే. ఈసారి నా పొలంలో సగం భాగంలో యూరియా ఉపయోగించకుండా పంటలు పండిస్తున్నాని, రెండు మూడు రోజుల్లో ఆ పంట ఎంతగా పండుతుందో పరిశీలిస్తున్నాని తెలిపారు. భవిష్యత్తులో రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు,గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కుర్వ హన్మంతు, అడిషనల్ డి.ఆర్.డి.ఓ శ్రీనివాసులు, ఏఓ శ్రీలత, ఐకెపీ సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలను పరిశీలించిన కలెక్టర్

- భారీ సుడిగాలికి పంటలు ధ్వంసం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భారీ సుడిగాలికి ధ్వంసం అయిన పంటలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ శివారు అటవిప్రాంత పంట పొలాలలో మంగళవారం భారి సుడిగాలి ప్రభావానికి పంటలు, అడవిలో చెట్లు కూలిపోగా సుమారు 30 నుండి 40 ఎకరాలలో పత్తి, మిర్చి, వరి పంటలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు ప్రాథమికంగా పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు అందించాలని, రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం వాహనం వెళ్లడానికి అవకాశం లేకపోగా మోటార్ సైకిల్ పై అటవీ శాఖ అధికారులతో కలిసి వెళ్లి నేలకొరిగిన వృక్షాలను పరిశీలించారు. చెట్లు నేలకొరిగిన చోట నూతన ప్లాంటేషన్ చేపట్టి అడవుల పునరుద్ధరణ కు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

### ఐఏఎస్ అధికారుల బస కోసం ఏర్పాట్ల పరిశీలన

లెంకలగడ్డలో శిక్షణా ఐఏఎస్ అధికారుల బసకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం పరిశీలించారు. పలిమెల మండలం లెంకలగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 8నుంచి 15వరకు ముస్సోరి నుండి వస్తున్న శిక్షణా ఐఏఎస్ అధికారుల బృందం బస చేయనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠశాల భవనం, వసతి, విద్యుత్, నీరు, పారిశుధ్య కార్యక్రమాలు, భద్రత వంటి అంశాలపై అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### సిటీ స్కాన్ ఏర్పాటుతో పేదలకు మెరుగైన వైద్యం

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో సిటీ స్కాన్ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రత్యేకంగా ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్స, వైద్య నిపుణుల నిర్ధారణకు ఇది చాలా ఉపయోగకరమని తెలిపారు. గురువారం ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసిఐఎల్) సంస్థ తమ సీఎస్ఆర్ నిధుల నుండి ఆధునిక సిటీ స్కాన్ యంత్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు అందజేశారు.

### కలెక్టర్ కు బర్త్ డే విషెస్ చెప్పిన అధికారులు

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జన్మదినం సందర్భంగా గురువారం వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధి, సేవలు, పరిపాలనలో కలెక్టర్ రాహుల్ శర్మ చూపుతున్న కృషి, శ్రద్ధ, ప్రజల పట్ల చూపుతున్న సేవాభావం అభినందనీయమని అధికారులు కొనియాడారు. శుభాకాంక్షలు తెలిపిన అందరికి ఈ సందర్భంగా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి సునీల్, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, తహసీల్దార్ అనీల్, ఎంపిడిఓ సాయి పవన్, ఎంఈవో ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్ ప్రతీక్ కుమార్ చక్రవర్తి, డిప్యూటీ మేనేజర్లు డాక్టర్ పి. వేణుబాబు, సునీల్ కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేంద్ర ప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పటిష్ట కార్యాచరణతో ముంపు నివారణ చర్యలు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- బల్దియా కమిషనర్ తో కలిసి ముంపు ప్రాంతాల్లో సందర్శన



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ (జనంసాక్షి):** పటిష్ట కార్యచరణ తో వరద ముంపు నివారణ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా.సత్య శారద తెలిపారు. గురువారం వరంగల్ నగరంలోని ప్రాంతంలోని వరద ముంపు కు ప్రభావితమైన చిన్న వడ్డేపల్లి చెరువు పరిసర ప్రాంతాలు, లక్ష్మి గణపతి కాలనీ, ఎల్బీనగర్ లోని అంబేడ్కర్ నగర్, ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇలాంటి ముంపు సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఇరిగేషన్, రెవిన్యూ, మునిసిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక డ్రెయినేజీ వ్యవస్థలను సమీక్షించి, నీటి ప్రవాహ మార్గాలను సరిచేసే చర్యలు తక్షణం చేపట్టాలని సూచించారు. కలెక్టర్ ప్రజల సమస్యలను నేరుగా విని, త్వరితగతిన ఉపశమన చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి కార్పొరేటర్ సురేష్ జోషి, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ ఎం హెచ్ ఓ డా.రాజేష్ ఇరిగేషన్ ఈ ఈ కిరణ్ బల్దియా ఈ ఈ సంతోష్ బాబుడి ఈ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద
- వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో పత్తి విక్రయాలను పరిశీలించిన కలెక్టర్



**వరంగల్ బ్యూరో, నవంబర్ 06 (జనం సాక్షి) :** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో పత్తి క్రయ విక్రయాలను జిల్లా కలెక్టర్ డా. సత్య శారదా గురువారం పరిశీలించారు. మార్కెట్ యార్డులో జరుగుతున్న పత్తి లావాదేవీలను, క్రయవిక్రయాలను ప్రత్యక్షంగా చూసిన అనంతరం మార్కెట్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో నేరుగా పత్తి ధర, మార్కెట్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఏనుమాముల మార్కెట్ యార్డ్‌లో పత్తి తడిసిందని ఫిర్యాదులు వచ్చిన దృష్ట్యా, రైతుల నుండి ట్రేడర్లు కొనుగోలు చేసిన తదుపరి పత్తి తడిసిందని, రైతులకు ఎలాంటి నష్టం జరగలేదని అన్నారు. పత్తి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా కొనసాగించాలని, రైతులకు న్యాయమైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాల కారణంగా తడిసిన పత్తి నాణ్యతను దృష్టిలో ఉంచుకొని రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్యక్షులు రవీందర్ రెడ్డి, మార్కెట్ అంజిత్ రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఆర్థిక స్థితి మెరుగుపరచడమే లక్ష్యం

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, నవంబర్ 06(జనంసాక్షి) :** జిల్లాలో చేపల ఉత్పత్తి పెంపుతో పాటు మత్స్యకారుల ఆర్థిక స్థితి మెరుగుపరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం వేంకటపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామం లోని మారేడుగొండ చెరువులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, స్పెషల్ ఆఫీసర్ హనుమంతరావు, జిల్లా మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు సాదు రఘు, జిల్లా మత్స్య శాఖ అధికారి టి.సల్మాన్ రాజు, లక్ష్మీదేవిపేట సొసైటీ అధ్యక్షుడు సాదు శంకర్ లతో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025-2026 సం//నకు 478 సీజనల్ చెరువులు, 2 రిజర్వాయర్ లు మరియు (08) పెరినియల్ చెరువులలో 1,57,55,224 లక్షలచేప పిల్లల విడుదల/పంపిణీ కొరకు అన్నిఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. చేప పిల్లల పంపిణి ద్వారా చేపల ఉత్పతి మరియు దిగుబడులు పెరగడం, మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరగడం, దళారుల ప్రమేయం తగ్గడం, మత్స్య కారులు స్వేచ్ఛగా అమ్ముకోవడం వలన గ్రామీణ ప్రాంతాలలోని వినియోగదారులకు తాజా చేపలు అందుబాటు ధరలకు దొరకడం, ఇతర ప్రాంతాలకుఎగుమతులు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ టెక్నికల్ ఆఫీసర్ పి రమేష్, ఎఫ్ఎఎన్ మౌనిక, ప్రజా ప్రతినిధులు, మత్స్య కారులు, తదితరులు పాల్గొన్నారు.



### చిన్న నీటి పారుదల వివరాల గణాంక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ రూరల్, నవంబర్6 (జనంసాక్షి) :** చిన్న నీటిపారుదల గణాంక వివరాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో, 7వ చిన్న నీటి పారుదల గణాంక నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చిన్న నీటిపారుదల కింద వచ్చే సహజ, మానవ నిర్మిత బోర్లు,బావులు, చెరువులు, కుంటలు, కాలువలు,తదితర వివరాలన్నింటినీ పకడ్బందీగా సేకరించాలని తెలిపారు. ఈ సర్వే నిర్వహణ కొరకు గ్రామీణ స్థాయిలో జిపిఓలు, పంచాయతీ కార్యదర్శులను ఎన్యుమరేటర్లుగా నియమించాలని తెలిపారు. వివరాల నమోదుకు సంబంధించి నిర్దేశించిన అప్లికేషన్ గురించి సర్వే అధికారులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రత్నకళ్యాణి,జిల్లా ప్రణాళిక అధికారి జీవరత్నం,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఏసీబీకి పట్టుబడిన ఏఈఓ సందీప్

**మరిపెడ నవంబర్ 6 (జనం సాక్షి) :** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ఏసీబీ(యాంటీ కరప్షన్ బ్యూరో) దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ నీల్కుర్తి క్లస్టర్ ఏఈఓ సందీప్ 10,000 లంచం తీసుకుంటూ రెడ్ హండ్రెడ్ గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే ఆనేపురం గ్రామానికి చెందిన రైతు గత నెలలో చనిపోగా వారి దరఖాస్తును రైతు భీమా కోసం ఆన్లైన్లో అప్లోడ్ చేయడానికి 20000 రూపాయలు డిమాండ్ చేయడం జరిగింది. దానికి మొదటగా పదివేల రూపాయలు ఇచ్చేటట్లు ఒప్పందం చేసుకొని ఈరోజు బస్టాండ్ సమీపంలోని జేజే రెస్టారెంట్ ఎదురుగా ఏఈఓ సందీప్ కు బాధితుడు డబ్బులు 10000 రూపాయలు ఇస్తుండగా పట్టుకోవడం జరిగిందని ఏసీబీ డిఎస్పి సాంబయ్య తెలిపారు.

# నిర్మల్ నుండి కాశీ-అయోధ్య యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు



**నిర్మల్ బ్యూరో, నవంబర్ 6:(జనంసాక్షి)**నిర్మల్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కాశీ, అయోధ్య, ప్రయాగ్ రాజ్ యాత్రకు ప్రత్యేక బస్సు గురువారం బయలుదేరింది. అయోధ్యకు వెళ్లే భక్తుల నుండి వచ్చిన విశేష స్పందనకు అనుగుణంగా ఇది నిర్మల్ నుండి బయలుదేరిన రెండవ బస్సు అని డిపో మేనేజర్ కె. పండరి తెలిపారు. మొదటి యాత్రకు లభించిన విపరీత ఆదరణ కారణంగా మరొక బస్సు నడపడం జరిగిందని, ఇంకా అనేక మంది భక్తులు యాత్రకు సిద్ధమవుతున్నారని తెలిపారు. త్వరలోనే తదుపరి బస్సు ప్రయాణ తేదీని ప్రకటిస్తామని ఆయన వివరించారు. అలాగే శుక్రవారం నిర్మల్ నుండి అరుణాచలం, తిరుపతి యాత్ర బస్సులు బయలుదేరనున్నాయని పండరి తెలిపారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ తరపున వివిధ పవిత్ర క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను తరచూ నడుపుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో పండరిపూర్, తుల్జాపూర్, కొలహాపూర్, భద్రాచలం, సింహాచలం, అన్నవరం, రామేశ్వరం, శ్రీరంగం, కంచీపురం, అరుణాచలం, శబరిమల వంటి ప్రఖ్యాత దేవాలయాలకు యాత్ర బస్సులు నడపనున్నట్లు ఆయన వెల్లడించారు. భక్తులు, ప్రయాణికులు ఈ పవిత్ర యాత్రలను ఆర్టీసీ ద్వారా చేయాలని, ప్రభుత్వ రవాణా సంస్థకు తమ మద్దతు అందించాలని డిపో మేనేజర్ పండరి విజ్ఞప్తి చేశారు.

# క్రీడల ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, నవంబర్6 (జనంసాక్షి) :** సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడు తెలంగాణ బాలికల సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలో గురువారం 11వ రాష్ట్ర జోనల్ స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జోన్ పరిధిలోని నాలుగు జిల్లాల నుంచి 1190 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. క్రీడల్లో గెలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. బాలికలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవాలని సూచిస్తూ, ప్రభుత్వం క్రీడా సదుపాయాలను విస్తరిస్తోందని చెప్పారు. క్రీడా ధ్రువపత్రాలు భవిష్యత్ ఉద్యోగావకాశాలకు ఉపయోగపడతాయని వివరించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు అన్ని జాగ్రత్తలతో ఆటలలో పాల్గొనాలని సూచించారు. తరువాత కలెక్టర్ వాలీబాల్ ఆడి క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, డిఐఈఓ పరశురాం, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో కొత్త రోడ్లకు మంజూరు

- మంత్రి పొన్నం కృషితో రహదారి నిర్మాణాలకు ఆమోదం



**భీమదేవరపల్లి నవంబర్ 6 (జనం సాక్షి):** సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారి నిర్మాణాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. హనుమకొండ జిల్లా లోని భీమదేవరపల్లి మండలంలో పలు రోడ్డు పనులు మంజూరయ్యాయి. మండలంలోని పిడబ్ల్యుడి రోడ్ నుండి రాంనగర్ తండా వరకు 1.20 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.120 లక్షలు, అలాగే ములకనూరు నుండి నరహరి తండా వరకు 3.50 కి.మీ బీటీ రోడ్ నిర్మాణానికి రూ.350 లక్షలు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నిధులు మంజూరయ్యేలా కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ఈ రోడ్ల నిర్మాణం ద్వారా గ్రామాలకు రాకపోకలు సులభమవుతాయని, గ్రామీణాభివృద్ధికి ఊతం లభిస్తుందని తెలిపారు.

# బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బెదిరింపులు చేసి డబ్బులు వసూలు చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు సిఐ నరేష్ కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి పట్టణానికి చెందిన వ్యాపారి తాటిపల్లి రాజబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన భూమిపై ఇటీవల నిర్మించిన భవనాన్ని ఒక ఆసుపత్రికి అద్దెకు ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్న సమయంలో భూపాలపల్లికి చెందిన ఎస్పీకే సాగర్ అనే వ్యక్తి వచ్చి నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఆరోపిస్తూ డబ్బులు డిమాండ్ చేయగా, బెదిరింపులకి భయపడి రూ. 2లక్షల నగదు ఇచ్చాడు. తిరిగి మళ్లీ రూ.4లక్షలు డిమాండ్ చేయడంతో బాధితుడు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితుడు ఎస్పీకే సాగర్ ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇలాంటి బెదిరింపులు, లేదా వసూళ్లకు గురైన ఎవరైనా ఉంటే నేరుగా భూపాలపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

### రోడ్లపై జెండా గద్దెలు నిర్మించొద్దు

భూపాలపల్లి పట్టణంలో నేషనల్ హైవే పై ఉన్న డివైడర్‌లపై ఏ రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాలు లేదా ఇతర ఏ సంస్థలు అయినా జెండా గద్దెలను నిర్మించి, జెండాలు ఎగరవెయ్యడం, లేక ఏదేని కార్యక్రమాలు నిర్వహించడం గాని చేయొద్దని సీఐ డి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే పై ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేయడానికి పోలీసులు కృషి చేస్తున్నారని, దీనిలో భాగంగా హైవే పై సిగ్నల్ లైట్లు, సీసీ కెమెరాలు, స్పీడ్ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేసే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఈ సమయంలో ప్రజలు, వివిద పార్టీల నాయకులు, విద్యార్థి సంస్థలు, కార్మిక సంఘాలు అందరూ సహకరించి నేషనల్ హైవేపై డివైడర్ మీద ఎట్టి పరిస్థితుల్లోనూ జెండా గద్దెలు నిర్మించొద్దని ఆయన తెలిపారు.

# ఆ భూమి నాది కాదు డిలీట్ చేయండి

- తహసీల్దార్ కు దరఖాస్తు అందజేత
- తహసీల్దార్ కె రవి కుమార్



**మల్హర్,నవంబర్06(జనంసాక్షి) :** తన పేరు పైన ధరణి పోర్టల్ లో నమోదు చేయబడిన భూమి తనది కాదు ప్రస్తుతం ఉన్న భూభారతి పోర్టల్ నుండి డిలీట్ చేయాలని మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన తొట రాజేశ్వరరావు గురువారం మండల తహసీల్దార్ కె రవి కుమార్ కు దరఖాస్తు అందజేశారు. ఎడ్లపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 303/ఏ లో ఉన్న 0-39 గుంటల భూమి తొట రాజేశ్వరరావు కుమారుడు తొట యశ్వంత్ పేరున ధరణిలో తప్పుగ నమోదు అయింది. ఆ భూమి తమది కాదని అట్టి భూమిని డిలీట్ చేయాలని తోట రాజేశ్వరరావు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ధరఖాస్తు అందజేసినట్లు తహసీల్దార్ కె రవి కుమార్ తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ రాజేశ్వరరావు సమర్పించిన ధరఖాస్తు పై విచారణ చేసి సర్వే నెంబర్‌ను వారి ఖాతా నుండి తొలగిస్తామని తెలిపారు.

# మీడియా అకాడమీ చైర్మన్‌ను కలిసిన ములుగు జర్నలిస్టులు



**ములుగు ప్రతినిధి, నవంబర్ 06(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ని హైదరాబాదులో గురువారం ములుగు జర్నలిస్టులు, ఐజేయూ ములుగు జిల్లా అధ్యక్షులు షఫీ హమ్మద్, ఉపాధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, కార్యదర్శి చిదిరాల వాసు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ములుగు జిల్లా జర్నలిస్టుల స్థితిగతులు, పరిస్థితులను ప్రెస్ అకాడమీ చైర్మన్ కు వివరించారు. అనంతరం రంగారెడ్డి జిల్లాలోని పొద్దుటూరులో గల ప్రగతి రిసార్ట్ లో జరిగిన తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని ములుగు జిల్లాలో ఐజేయూ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను వారు ఈ సమావేశంలో వివరించారు. అదేవిధంగా ఐజేయూ ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో చేపట్టిన సభ్యత నమోదు పుస్తకాలను రాష్ట్రస్థాయి బాధ్యులకు ఈ సమావేశంలో అందించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిగా సభ్యత్వాలు పూర్తి చేసినందుకుగాను రాష్ట్ర నాయకత్వం ములుగు జిల్లా ఐజేయూ నాయకులను అభినందించారు. అంతేకాకుండా ములుగు జిల్లా ఐజేయూ నాయకులు షఫీ, సతీష్, వాసు లు ఇటీవల హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా గెలుపొందిన రాజేష్ యాదవ్ ను సైతం కలిసి శుభాకాంక్షలు తెలియడంతో పాటు శాలువాలతో సన్మానించి అభినందించారు. అదేవిధంగా ఐజేయూ జాతీయ నాయకులు, సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ ని సైతం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం సాయంత్రం వరకు కొనసాగింది.

# ఉన్నతస్థాయికి చేరేందుకు నిరంతరం సాధన చేయాలి

- మంచి ఆలోచనలకు పునాది వేయాలి
- వ్యక్తిగత క్రమశిక్షణ ఉండాలి
- విజయం సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలి
- శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ




**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 6 (జనంసాక్షి) :** విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరేందుకు నిరంతరం సాధన చేయాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. గురువారం సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామ శివారులో గల తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా సైబర్ మోసాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై ఉన్నత లక్ష్యాలు, విజయాలు సాధించడం, సైబర్ మోసాలు, మహిళల భద్రత, డ్రగ్స్ నిర్మూలన మొదలగు అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ఆలోచనలకు ఆదిలోనే పునాది వేయాలని, వ్యక్తిగత క్రమశిక్షణ, వ్యక్తిగత సాధన ఉండాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకోవడానికి నిరంతర కృషి, నిరంతర సాధన చేయాలని, విజయం సాధించిన వారి వ్యక్తిగత జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. మంచి వ్యక్తిత్వం అలవర్చుకోవాలని తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలని, మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సమస్యలకు కుంగిపోవద్దని,శారీరకంగా మానసికంగా దృఢంగా ఎదగాలని అన్నారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విజయవంతం కావాలని అన్నారు. తప్పులను అధిగమిస్తూ విజయాల వైపు వెళ్లాలని, మంచి పుస్తకాలను మంచి స్నేహితులను ఎంచుకోవాలని అన్నారు. మన చుట్టూ చేరే కలుపు మొక్కలను గుర్తించాలని అన్నారు. సమాజంలో సైబర్ మోసాలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని, సైబర్ మోసాల నివారణలో నేటి పౌరులు రేపటి సైబర్ మోసాల నివారణ వారియర్స్‌గా పని చేయాలన్నారు. మొబైల్ ఇంటర్నెట్ ద్వారా జ్ఞానాన్ని పొందాలే తప్ప సోషల్ మీడియా ప్రభావానికి గురికావద్దని అన్నారు. సైబర్ మోసగాళ్లు ఆన్ లైన్ వ్యాపారం పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని, ఆన్‌లైన్ వ్యాపారం పేరు చెప్తే ఎవరు నమ్మి పెద్దమొత్తంలో డబ్బులు, పెట్టుబడులు పెట్టవద్దని, ఆర్థికంగా నష్టపోవద్దని పేర్కొన్నారు.లింకులు పంపించి మోసాలకు పాల్పడుతున్నారని, వీటి మోసాల గురించి తల్లిదండ్రులకు, చుట్టుపక్కల ఉన్న వారికి తెలుపాలన్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది అబద్ధమని, డిజిటల్ అరెస్ట్ అంటూ ఎవరైనా అపరిచితులు ఫోన్ చేసి ఎస్బి, సిబిఐ, సిఐడి దర్యాప్తు సంస్థల పేర్లు చెబుతూ మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటే నమ్మవద్దన్నారు.డ్రగ్స్ కు దూరంగా ఉండి మంచి అలవాట్లు,మంచి స్నేహితులను కలిగి ఉండాలని సూచించారు. పోలీసు కళాబృందం వారు సామాజిక అంశాలు, సామాజిక రుగ్మతలు, సామాజిక భద్రత గురించి పాటలతో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీల, ఆత్మకూర్ (ఎస్) ఎస్ఐ శ్రీకాంత్, సూర్యాపేట రూరల్ ఎస్ఐ వెంకట్రాములు, షీ టీమ్స్ ఎస్ఐ నీలిమ, పోలీసు కళాబృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా దర్గా హజ్రత్ బుర్హానొద్దీన్ ఔలియా ఉర్సు ఉత్సవాలు



**భువనగిరి, నవంబర్ 6 (జనం సాక్షి) :** దర్గా హజ్రత్ బుర్హానుద్దీన్, కిసాన్ నగర్ ఉర్సు ఉత్సవాలు. సాయంత్రం 4:30 గంటలకు అసర్ నమాజ్ తర్వాత, గ్రంధం ఊరేగింపు పట్టణంలోని గంజ్ మస్జీద్ నుండి దర్గా ముతవల్లి ఖాజా,బషీరొద్దీన్ అధ్యక్షతన గంధం ఊరేగింపు ప్రారంభమై నాతే షరీఫ్,కల్మా షరీఫ్ ధార్మిక పాఠాలు పటిస్తూ మెయిన్ రోడ్,మీదుగా,దర్గా వరకు కొనసాగి సాయంత్రం మగ్రిబ్ నమాజ్ లో 6:30 గంటలకు దర్గాలో చేరుకొని పూల చాదర్ ఘీలాఫ్ సమర్పించి ప్రత్యేక ప్రార్థన,చేసారు.గ్రంధం సమర్పణ,తర్వాత అజ్మతే ఔలియా (ఇస్లాం మత గురువు యొక్క విశిష్టత)అనే అంశం పై బహిరంగ సభ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మొహమ్మద్ మజహర్ అలీ షా యాఖుబీ నూరి చిస్తీ ఖాద్రి.ప్రసంగించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారుఈ కార్యక్రమంలో ముఫ్తి మస్తాన్ అలీ యాఖుబీ మొహమ్మద్ మజర్ అలీ శా అంజద్ అలీ శా,దర్గా నాయబ్ ముత వల్లి ఖాజా ఖుతుబొద్దిన్ ఖాజా బబ్బు,శేక్ మీరా యూసుఫ్ సేట్ వక్ఫ్ ప్రొటెక్షన్ కమెటీ యాదాద్రి భువనగిరి అధ్యక్షులు ఎండీ ఇంతియాజ్ అహ్మద్ ఉపాధ్యక్షులు ఎండీ ఇస్తియాక్ అహ్మద్, ఎండీ. అమీన్ మైమన్,ఎండీ శేఖ్ మీరా ఎండీ జహంగీర్,ఎండీ వసీమ్తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులు ఇటుక బట్టీలపై కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలి



**వేములపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) :** మండల పరిధిలోని గూడూరు గ్రామ పంచాయతీ సమీపం లోని రైస్ మిల్లులు, ఇటుక బట్టీల పై కాలుష్య నివారణకు చర్యలుతీసుకోవాలని గూడూరు గ్రామస్తులు గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణమాలెం పాటి కు వినతి పత్రాన్ని అందజేశారు. గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రైస్ మిల్లుల నుండి పొగదారా గ్రామంలోని ఇండ్లలోకి విపరీతంగా వస్తుందన్నారు. వ రైస్ మిల్లులో బాయిల్డ్ చేసిన నీటిని రీసైక్లింగ్ చేయకుండా రహదారి వెంబడి వదిలి వేస్తున్నారని దీంతో గ్రామం మొత్తానికి విపరీతమైన దుర్వాసన వస్తుందన అద్దంకి నార్కెట్ పల్లి హైవేకు ఇటుక బట్టీల నుండి విపరీతమైన బూడిదవస్తుందనివాహనదారులకు పాదచారుల కళ్ళలో పడికంటిజబ్బులు వస్తున్నాయన్నారు.హైవేపై రైస్ మిల్లుల సమీపంలోబూడిద వల్ల యాక్సిడెంట్లు జరిగి అంగ వైకల్యం మరణా లు సంభవిస్తున్నాయని వెంటనే మిల్లులు ఇటుక బట్టీల యజమానులు కాలుష్య నివారణచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడలగ్రామ ప్రజలందరి తో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందించిన వారిలో బొంగరాల మట్టయ్య. మూగల సైదులు యాదవ్. నూకపంగా కాశయ్య తదితరులు ఉన్నారు.

## కోటి రూపాయల బీమా చెక్ అందజేసిన ఎస్పీ నరసింహ




**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 6 (జనంసాక్షి) :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సాలరీ అకౌంట్ ద్వారా ఒక కోటి రూపాయల ఇన్సూరెన్స్ చెక్ ను కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ రాంబాబు కుటుంబ సభ్యులకు ఎస్పీ కె.నరసింహ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు పోలీసులకు ప్రత్యేక సాలరీ ప్యాకేజీ ద్వారా పోలీస్ సిబ్బంది మరణిస్తే ఈ పోలీస్ సాలరీ ప్యాకేజ్ అకౌంట్ ద్వారా ఒక కోటి రూపాయల ఇన్స్యూరెన్స్ అందిస్తుందన్నారు.ఈ స్కీమ్ ద్వారా రాంబాబు కుటుంబ సభ్యులకు ఒక కోటి రూపాయల చెక్ ను అందజేయడం జరిగిందన్నారు. ఈ స్కీమ్ పోలీసు కుటుంబాలకు ఆర్థిక బాసటగా నిలుస్తుందని అన్నారు. సిబ్బంది అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని, ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఏవో మంజుభార్గవి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు అనిల్ కుమార్, మోహన్ కుమార్, విద్యాసాగర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విష అహారం తిని వందకు పైగా గొర్రెలు మృతి

- సుమారు 20 లక్షల నష్టం
- గుండెలు పగిలేల రోధిస్తున్న గొర్రెల కాపరులు



**వేములపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) :** విషఅహారం తినడంతో 100కు పైగా గొర్రెలు మృతి చెందిన సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రం సమీపంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే సూర్యాపేట జిల్లా, పెన్ పహాడ్ మండలం, అన్నారం, అనంతరం, దోసపాడుగ్రామాలకు చెందిన ఉప్పునూతల సైదులు, శ్రీరాముల కోటయ్య, శ్రీరాముల గోపాలు, ఆవుల కోటయ్య, ఆవుల వెంకన్నలు తమ గొర్రెల మందను గత కొన్ని రోజులుగా వేములపల్లి మండలకేంద్రం సమీపంలో మేపుతున్నారు. అకస్మాత్తుగా బుధవారం రాత్రిమందలోని 80 గొర్రెలు, గురువారం మరో 40 గొర్రెలకు పైగా మృతి చెందడం జరిగింది. ఆకస్మాత్తుగా 120కి పైగా గొర్రెలు మృతి చెందడంతో గొర్రెల పెంపకమే జీవనాధారంగా బ్రతుకుతున్న తమకు సుమారు 20లక్షలపైగా నష్టం వాటిల్లినట్లు గొర్రెల కాపరులువాపోయారు. అనుకోకుండా అకస్మాత్తుగా బారీ సంఖ్యలో గొర్రెలు చనిపోవడంతో గొర్రెల కాపరులు గుండెలు పగిలేలా రోధిస్తున్నారు. ప్రభుత్వం తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు. విషపు ఆహారంకానీ, విషపు నీరు కానీ తీసుకోవడం గొర్రెలు చనిపోవడానికి కారణం అయి ఉండవచ్చునని స్థానిక పశువైద్యాధికారి అశోక్, తెలిపారు. గొర్రెలకు పోస్టు మార్టం చేసిన తర్వాత మృతికి కారణాలు తెలుస్తాయని అయిన తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో చుక్కయ్య గౌడ్



**వేములపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలోభాగంగా గురువారం 115 పోలింగ్ బూత్ నెంబర్ పరిధి లో రాష్ట్రటూరిజంకార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఐఎన్ టి యుసి రాష్ట్ర కార్యదర్శి బంటు చుక్కయ్య గౌడ్ పిసిసి అధికార ప్రతినిధి వెంకన్న నాయక్‌లు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.జూబ్లీహిల్స్ అభివృద్ధి అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ని గెలిపించాలని,నవీన్ యాదవ్ స్థానికుడు ,విద్యా వంతుడు నిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తి మీ సమస్యల పై మీకు అండగా ఉండే వ్యక్తిని గెలిపిం చాలని ప్రజలను కోరారు. ఉప ఎన్నికల ప్రచారం లో ప్రజల నుండిఅనూహ్య మద్దతు లభిస్తుందని నవీన్ యాదవ్ గెలుపు నల్లేరు పై నడికేనని భీమా వ్యక్తం చేశారు.

# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**వేములపల్లి, నవంబర్ 6 (జనంసాక్షి) :** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తం గా ఉండాలని వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు గురువారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు తమ మొబైల్ ద్వారా అనవసరమైన ఆన్ లైన్ లింక్‌లను ఓపెన్ చేయవద్దని, తద్వారా సైబర్ నేరగాళ్లు అట్టి ఫోన్‌లకు లింకులు ఉన్న ఎకౌంటుల ద్వారా సైబర్ దోపిడీకి పాల్పడుతున్నా రన్నారు. ఆన్ లైన్ లింకు ద్వారా అకౌంట్ నుంచి డబ్బును దొంగిలించిన వెంటనే అప్రమత్తమై తమకు సమాచారం అందించినట్లయితే వాటిని తిరిగి రాబట్టేందుకు తమ వంతుగా కృషి చేస్తామని ఆయన అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు మద్యానికిబానిసలుకావద్దని, తద్వారా తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి రమేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల లో మధ్యాహ్న భోజన పరిశీలన



**సూర్యపేట ప్రతినిధి, నవంబర్ 6 (జనంసాక్షి) :** సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేనుశారం మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలలో గురువారం మధ్యాహ్న భోజన పథకం అమలు లో భాగంగా నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని తాసిల్దార్ అమిన్ సింగ్ పరిశీలించారు. కూరగాయలు భద్రపరిచే గదినిపరిశీలించి గదిని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దారాసింగ్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి




**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 6 (జనంసాక్షి) :** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించబోయే చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులు అభిరుచిని పెంపొందించుకోవాలని అన్నారు. విద్యార్థి దశలోనే సైన్స్ విషయాల పట్ల లోతైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడే చెకుముకి పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా మూఢనమ్మకాల నుండి బయటపడవచ్చని అన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గోళ్ళమూడి రమేష్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు నేడు నిర్వహించే ఈ పరీక్షలో పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. పాఠశాల స్థాయి, మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలలో మొత్తం నాలుగు దశల్లో నిర్వహించే ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నట్లు ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు వనమాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెకుముకి కన్వీనర్ తల్లాడ రామచంద్రయ్య, దేవరశెట్టి నాగరాజు, వల్లపట్ల దయానంద్, సురేష్ కుమార్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి అండర్ 14, 17 వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక




**పెనుబల్లి, నవంబర్ 6 (జనం సాక్షి) :** పెనుబల్లి మండల స్థాయి వాలీబాల్ క్రీడల్లో అండర్ 14, 17 బాల బాలికలకు విఎం బంజర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంపిక నిర్వహించారు, కార్యక్రమంలో మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ సత్యనారాయణ పాఠశాల ఇన్చార్జి వివి రామారావు తో పాటు క్రీడలను ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బండి రాము క్రీడలను నిర్వహించారు, ఈ క్రీడా ఎంపికలకు జడ్.పి.హెచ్.ఎస్ లంకపల్లి, కోండ్రుపాడు, తాళ్లపెంట, లింగగూడెం, టీజీ మోడల్ స్కూల్, అరుణోదయ మెరిట్ స్కూల్ నుండి 30 మంది బాలికలక్రీడాకారులు,40 మంది బాలురక్రీడాకారులు పోటిల్లో పాల్గొనడం జరిగింది, ఈ పోటీల్లోఎంపికైన విద్యార్థులుఇ నెల 12 ,13 న మధిరలో నిర్వహించు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొనడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు మండల ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ అనంతలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర బాబు, పిఈటిలు అచ్యుత్, నరసింహారావు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలి

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్



**నల్లగొండ, నవంబర్ 6 (జనం సాక్షి) :** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి రోజు దేశ వ్యాప్తంగా అనేక మంది సైబర్ నేరగాళ్లు బారిన పడి మోసాలకు గురవుతున్నారనీ,వారి బారిన పడకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్గిఉండమే ఉత్తమ మార్గం అని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ అన్నారు. సైబర్ జాగారుకత దివాస్ సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణం కేంద్రంలోని దీప్తి నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎక్కువగా సులభంగా మోసపోయేది సైబర్ నేరగాళ్ల ద్వారానే అని అన్నారు.కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. డబ్బుల పోయాక బాధపడటం కంటే అవగాహనా తో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. చదువుకున్న విద్యార్దులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉంటే తన చుట్టూ పరిసరాల్లో ఉన్న ప్రజలకు,వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తద్వారా సైబర్ మోసాలు నిరోధించవచ్చునని ,సైబర్ నేరగాళ్లు ప్రజలనూ మోసం చేస్తున్న విధానాన్ని కళాశాల విద్యార్థినులకు తెలియజేశారు. ప్రస్తుత కాలం లో జరుగుతున్న నేరాలు అయిన సైబర్ జాగరుకత దివాస్ దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సులో ఫార్వర్డ్ చేస్తున్నారు. అలాగే బ్యాంక్ అదికారులు ఎవరు కూడా ఫోన్ చేసి ఓటీపీ వివరాలు అడగరు అనే విషయాలను గుర్తించాలని ,బ్యాంక్ వారు ఏలాంటి మెసేజ్ లు గాని, లింక్స్ పంపరని ఇట్టి విషయాలు గమనించి మీ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, ఏమైన సందేహాలు ఉంటే బ్యాంక్ కు వెళ్లి నిర్ధారించుకోవాలి అని అన్నారు. గ్రూప్ లలో లేదా వ్యక్తిగత నెంబర్ లకు అపరిచిత వ్యక్తుల నుండి ఎస్ ఎమ్ ఎస్ ఈ మెయిల్స్ ద్వారా గాని, వాట్సాప్ ట్యీట్టర్ ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్ ను క్లిక్ చేసి మోసపోవద్దని, అలా వచ్చే మెసేజ్ లకు స్పందించవద్దనీ తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే స్పందించి 1930కి సమాచారం అందించి ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారు. తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ ఎస్బీ సీఐ రాము,1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఐ విష్ణు,మరియు కళాశాల విద్యార్థినులు తదితరులున్నారు.




కాస్త ఇన్వెస్ట్‌మెంట్ ఉంటే..

# నెలకు రూ.1 లక్ష

● ఈ హై డిమాండ్ బిజినెస్ ట్రై చేయండి!

**న్యూఢిల్లీ:** పట్టణ ప్రజలు తమ ఆరోగ్యం గురించి ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నారు. అందువల్ల స్పాలు, సెలూన్లు, మసాజ్ పార్లర్లకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. పెరుగుతున్న ఒత్తిడి కారణంగా, ప్రజలు విశ్రాంతి తీసుకోవడానికి 'స్పా'కు వెళతారు. ఈ వ్యాపారంలో ఫేషియల్స్, అరోమాథెరపీ, మసాజ్, మానిక్యూర్, పెడిక్యూర్, హైడ్రోథెరపీ అనేక ఇతర సేవలు ఉన్నాయి. మీ బడ్జెట్ పరిమితంగా ఉంటే, మీరు ఈ వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. 'స్పా' అనేది బాడీ మసాజ్, అరోమాథెరపీ, స్టీమ్ బాత్, ఫుట్ మసాజ్, ఫేషియల్స్ వంటి సేవలను అందించే వెల్నెస్ సెంటర్. వీటి ఉద్దేశం అందర్నీ పెంచడమే కాకుండా శారీరక అలసట నుండి ఉపశమనం పొందడం, రక్త ప్రసరణను మెరుగుపరచడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం కూడా. ఈ బిజినెస్ కోసం అనువైన ప్రదేశాన్ని నిర్ణయించుకోవడం ముఖ్యం. వాణిజ్య ప్రాంతం, జిమ్, యోగా సెంటర్ లేదా బ్యూటీ సెలూన్ దగ్గర 'స్పా' వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. పెట్టుబడి విషయానికి వస్తే.. మీరు ఈ వ్యాపారాన్ని చిన్న స్థాయిలో ప్రారంభించాలనుకుంటే, దాని ఖర్చు దాదాపు రూ.1.2 లక్షల నుండి రూ.3.5 లక్షల వరకు ఉంటుంది. మరోవైపు మిడ్-రేంజ్ స్పా ధర రూ.4 నుండి 10 లక్షల వరకు, ప్రీమియం స్పా ధర రూ.15 లక్షల నుండి 45 లక్షల వరకు ఉంటుంది. ఇందులో అద్దె, ఇంటీరియర్లు, బెడ్లు, టవల్స్, మసాజ్ ఆయిల్, సిబ్బంది జీతాలు, పెర్ఫ్యూమ్‌ల నుండి లైటింగ్ వరకు ప్రతిదీ ఉంటుంది. చిన్న పట్టణాల్లో మసాజ్ ఖర్చు సగటున రూ.500 నుండి 1000 వరకు ఉంటుంది, పెద్ద నగరాల్లో అదే సేవ ఖర్చు రూ.1200 నుండి 2800 వరకు ఉంటుంది. మీ స్పాకు రోజుకు 8 మంది కస్టమర్లు మాత్రమే వస్తే, మీరు రోజుకు ఒక్కో కస్టమర్‌కు దాదాపు రూ.2,000 సంపాదించవచ్చు. ఈ మొత్తం నెలకు దాదాపు రూ.4 లక్షలకు చేరుకుంటుంది. వ్యాపార ఖర్చులన్నీ చేసిన తర్వాత కూడా మీరు నెలకు రూ.80,000 నుండి రూ.1.2 లక్షల వరకు సంపాదించవచ్చు. పెద్ద స్పాలలో లాభాలు రూ.2 నుండి 6 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ చేరుకోవచ్చు. స్పా నడపడానికి మీరు ట్రేడ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, అవసరమైతే ఫైర్ సేఫ్టీ పొందాలి. సిబ్బంది పోలీసు ధృవీకరణ కూడా తప్పనిసరి.



# లాభాల్లో ప్రారంభమై... నష్టాల్లో ముగిసి..

● స్టాక్ మార్కెట్ సూచీలు పతనం



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత నష్టాల బాటపట్టాయి. ముఖ్యంగా మెటల్, పవర్, రియాల్టీ, మీడియా రంగాల్లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 140 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 87 పాయింట్ల మేర క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు మళ్లీ 4వేల డాలర్ల మార్కు ఎగువన ట్రేడవుతోంది. ఈ ఉదయం సూచీ 83,516.69 పాయింట్ల (క్రితం ముగింపు 83,459.15) వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,237.65 - 83,846.35 మధ్య కదలాడిన సూచీ.. చివరకు 148.14 పాయింట్లు నష్టపోయి 83,311.01 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 87.95 పాయింట్లు నష్టపోయి 25,509.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.61గా ఉంది. సెన్సెక్స్ 30లో పవర్‌గ్రిడ్, ఎటర్నల్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఏషియన్ పెయింట్స్, రిలయన్స్, మహీంద్రా&మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, మారుతీ షేర్లు లాభపడ్డాయి.

# హీరో ఎలక్ట్రిక్ కారు

● నానో కంటే చిన్నగా!



**ముంబై:** ఇప్పటి వరకు టూ వీలర్స్ లాంచ్ చేసిన హీరోమోటోకార్ప్.. ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఫోర్ వీలర్ లాంచ్ చేయడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగానే.. ఆవిష్కరించింది. ఇది చూడటానికి.. పరిమాణం పరంగా నానో కారు మాదిరిగానే అనిపిస్తుంది. కానీ ఇది ఎలక్ట్రిక్ కారు కావడంతో.. కొంత భిన్నంగా, చిన్నదిగా ఉంటుంది. హీరో మోటోకార్ప్ లాంచ్ చేయనున్న ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్ కేవ లం.. ఇద్దరు ప్రయాణించడానికి మాత్రమే అనుమతిస్తుంది. అంటే డ్రైవర్, పిలియన్ మాదిరిగా అన్నమాట. నగర ప్రయాణానికి మాత్రమే కాకుండా.. గ్రామీణ ప్రయాణానికి కూడా ఇది చాలా అనుకూలంగా ఉంటుందని చెబుతు న్నారు. ఈ కారుకు సంబంధించిన చాలా వివరాలను కంపెనీ వెల్లడించాల్సి ఉంది. హీరో మోటోకార్ప్.. వేదికపై రెండు కొత్త కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లను ఆవిష్కరించారు. అంత కాకుండా.. హీరో బ్రాండ్ యూరోపియన్ మార్కెట్లోకి అధికారిక ప్రవేశాన్ని సూచించే అర్బన్ ఎలక్ట్రిక్ స్కూటర్ ను కూడా విడుదల చేశారు. అదనంగా.. వీటిలో 4 నుంచి 10 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం అధిక పనితీరు రేసింగ్ కాన్సెప్ట్ ఉన్నాయి.



# 39 టన్నుల బంగారం

అందుకే డిమాండ్!

**న్యూఢిల్లీ:** భారీగా పెరిగిన బంగారం ధరలు ఇప్పుడిప్పుడే తగ్గుతున్నాయి. బుధవారం 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1.21 లక్షల వద్ద ఉంది. రేటు పెరగడానికి ప్రధాన కారణం పండుగ సీజన్ మాత్రమే కాదు. వివిధ దేశాల బ్యాంకులు ఎక్కువ మొత్తంలో పసిడి కొనుగోలు చేయడం కూడా.. అని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ చెబుతోంది. 2025 సెప్టెంబర్ నెలలో కేంద్ర బ్యాంకులు గరిష్టంగా 39 టన్నుల (39,000 కేజీలు) బంగారం కొనుగోలు చేశాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది. ఈ ఏడాది మొత్తంలో గోల్డ్ కొనుగోళ్లు సెప్టెంబర్‌లో జరిగినట్లు సమాచారం. కాగా.. ఈ సంవత్సరం ఇప్పటి వరకు కేంద్ర బ్యాంకులు కొనుగోలు చేసిన బంగారం 634 టన్నులు కావడం గమనార్హం. సెప్టెంబర్ 2025లో.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బ్రెజిల్ 15 టన్నుల గోల్డ్ కొనుగోలు చేయగా.. బ్యాంక్ ఆఫ్ గ్వాటెమాలా 6 టన్నులు కొనుగోలు చేసింది. రష్యా బ్యాంక్ 3 టన్నులు, నేషనల్ బ్యాంక్ ఆఫ్ కజకిస్తాన్ 8 టన్నుల బంగారం కొనేసింది. టర్కీ బ్యాంక్ మాత్రం 2 టన్నుల పసిడి కొనుగోలు చేసినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది. కేంద్ర బ్యాంకులు భారీగా బంగారం కొనుగోలు చేయడంతో.. పసిడికి డిమాండ్ అమాంతం పెరిగిందని గోల్డ్ కౌన్సిల్ వెల్లడించింది.

**తగ్గుతున్న గోల్డ్ రేటు - కారణాలు**

సెంట్రల్ బ్యాంకుల విషయాన్ని పక్కనపెడితే.. పెట్టుబడిదారులు కూడా బంగారం సురక్షితమైన పెట్టుబడి కాబట్టి ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఇది కూడా గోల్డ్ ధరలను పెంచేసింది. అయితే ప్రస్తుతం గోల్డ్ రేటు కొంత తగ్గుముఖం పట్టింది. దీనికి కారణం.. అమెరికా డాలర్ బలపడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెరగడం, ద్రవ్యోల్బణం తగ్గడం, రాజకీయ పరిస్థితులు అని తెలుస్తోంది.

## మస్క్‌లాంటి వారు మాత్రమే సంపన్నులవుతారు!

**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ వేగంగా అభివృద్ధి చెందడం మొదలైనప్పటి నుంచి ఉద్యోగాల కోత సంచలనంగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా చాలా కంపెనీలు వాటి కార్యకలాపాల్లో ఏఐని ఉపయోగిస్తూ వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏఐ గాడ్ ఫాదర్‌గా పిలువబడే జెఫ్రీ హింటన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఏఐతో వస్తున్న మార్పు భవిష్యత్తులో కోట్లాది మందిని నిరుద్యోగులుగా మారుస్తుందని, దీని ఎలాన్ మస్క్ వంటి కొద్దిమంది మాత్రమే ధనవంతులు అవుతారని జోస్యం చెప్పారు. ఇప్పటికే టెక్ దిగ్గజాలైన ఐబీఎం, టీసీఎస్, గూగుల్, అమెజాన్ వంటి కంపెనీలు ఏఐని అమలు చేస్తూ పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. అయితే ఈ ధోరణి ఇప్పట్లో ఆగిపోయే అవకాశం లేదని హింటన్ బ్లూమ్‌బెర్గ్‌కు ఇచ్చిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఉద్యోగాలు కోల్పోకుండా ఏఐతో ముందుకు వెళ్లే మార్గం ఉందా అని అడిగినప్పుడు 'అది సాధ్యం కాదని నమ్ముతున్నాను. డబ్బు సంపాదించాలంటే మానవ శ్రమను భర్తీ చేయాలి. అందుకు ఏఐను వాడుతున్నారు. కంపెనీలు లాభాలు పెంచుకునేందుకు ఈ పంథాను వినియోగిస్తున్నాయి' అన్నారు. ఏఐ అభివృద్ధి వల్ల ఏర్పడే ఆర్థిక అసమానతపై జెఫ్రీ హింటన్ మాట్లాడుతూ.. 'టెక్ బిలియనీర్లు మాత్రమే ఈ రేసులో విజేతలుగా నిలుస్తారు. గణనీయ సంఖ్యలో ఉద్యోగుల స్థానంలో ఏఐ పని చేస్తుంది. మస్క్ వంటి వ్యక్తులు మాత్రమే ధనవంతులు అవుతారు. చాలామంది ఉద్యోగాలు కోల్పోతారు. ఇది ఏఐ సమస్య కాదు, సామాజిక సమస్య. ఏఐ మన సమాజాన్ని, మన ఆర్థిక వ్యవస్థను ఎలా నిర్మిస్తుందనేది నిశితంగా గమనించాలి' అన్నారు.

## రుణదాతలకు ఉపశమనం..

**న్యూఢిల్లీ:** దివాలా ప్రక్రియలో చిక్కుకున్న కంపెనీల ఆస్తులను రుణదాతలకు తిరిగి ఇవ్వడానికి వీలు కల్పించేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌ఓపీ)ను ఖరారు చేశాయి. దీనివల్ల వివిధ కేసుల్లో స్తంభింపచేసిన సుమారు రూ.1.45 లక్షల కోట్ల విలువైన ఆస్తులను రుణదాతలకు అందించనున్నారు. ఈ నిర్ణయం మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద జతచేయబడిన ఆస్తులను దివాలా పరిష్కార ప్రక్రియ (ఐబీసీ)లో ఉపయోగించడానికి వీలు కల్పిస్తుంది. ఇప్పటివరకు ఈ ఆస్తులు దివాలా ప్రక్రియలో అందుబాటులో లేకపోవడంతో రికవరీకి అడ్డంకి ఏర్పడింది. ఇకపై పీఎంఎల్‌ఏలో అటాచ్ చేసిన ఆస్తులను సైతం ఐబీసీ ద్వారా రుణదాతలు రికవరీ చేసుకోవచ్చు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.75 | ₹ 5.77 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,11,750 (22 క్యారెట్లు) | ₹ 1,21,910 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,64,000



# అందరూ బడాబాబులే..

## బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో టాప్-10 సంపన్న అభ్యర్థులు



**పట్నా:** డబ్బుకు లోకం దాసోం.. వర్తమాన లోకరీతి. సొమ్ములున్న వారికే సకల భోగాలు నయా పోకడ. పాలిటిక్స్‌లోనూ పైసలు ఉన్నోడే రాజ్యం. రాజకీయాల్లోకి రావాలన్నా, నిలబడాలన్నా డబ్బు తప్పనిసరి. తాజాగా జరుగుతున్న బీహార్ శాసనసభ ఎన్నికల్లో పోటీకి దిగిన వారిలో సంపన్నులు దండిగా ఉన్నారు. వందల కోట్ల రూపాయల ఆస్తిపరులను అన్ని పార్టీలూ బరిలోకి దింపాయి. గెలుపోటములు మాట ఎలా ఉన్నా, ఎవరు ఎంత సంపన్నులనే అంశం బీహార్ ఓటర్లలో ఆసక్తి రేపుతోంది. నామినేషన్ల సమయంలో అభ్యర్థులు స్వయంగా తమ ఆస్తుల వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. ఈ వివరాలను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషించి ప్రజలకు అందుబాటులోకి ఉంచింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 2,616 మంది అభ్యర్థులలో 2,600 మంది దాఖలు చేసిన అఫిడవిట్లను ఏడీఆర్ పరిశీలించింది. మొత్తం అభ్యర్థులలో 431 మంది జాతీయ పార్టీలకు, 351 మంది రాష్ట్ర పార్టీలకు చెందినవారు. 908 మంది రిజిస్టర్ గుర్తింపు లేని పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 926 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగిన అభ్యర్థుల్లో వందల కోట్లకు పైబడిన సంపద కలిగిన వారు పలువురు ఉన్నట్లు ఏడీఆర్ వెల్లడించింది. పశ్చిమ చంపారన్ జిల్లాకు చెందిన రత్ కౌశల్ ప్రతాప్ సింగ్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో అత్యంత ధనవంతుడైన అభ్యర్థిగా ఆయన నిలిచారు. వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ టికెట్‌పై లౌరియా నుంచి పోటీ చేస్తున్న సింగ్.. తన మొత్తం ఆస్తులు రూ.368 కోట్లని ప్రకటించారు. వీటిలో రూ.27 కోట్ల చరాస్తులు, రూ.341 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. రూ.250 కోట్ల సంపద కలిగిన రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ నేత నిశీష్ కుమార్ రెండో సంపన్న అభ్యర్థి. గయా జిల్లాలోని గురువా నుంచి ఆయన పోటీలో నిలిచారు. ముంగేర్ జిల్లాకు చెందిన బీజేపీ అభ్యర్థి కుమార్ ప్రణయ్ రూ.171 కోట్ల ఆస్తులతో మూడవ స్థానంలో ఉన్నారు. ఆయన ఆస్తులలో రూ.1.34 కోట్ల చరాస్తులు, రూ.169 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి.

**స్వతంత్రుల్లో గుప్తా టాప్**

స్వతంత్ర అభ్యర్థుల్లో అత్యంత ధనికుడిగా రాజ్ కిశోర్ గుప్తా నిలిచారు. ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనకు రూ.1.48 కోట్ల చరాస్తులు, రూ.136 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు చూపారు. సివాన్ జిల్లాలోని మహారాజ్‌గంజ్ నుంచి పోటీ చేస్తున్న గుప్తా.. రూ.137 కోట్లతో సంపన్న అభ్యర్థుల్లో నాల్గవ స్థానంలో ఉన్నారు. పట్నా జిల్లాలోని మోకామా నుంచి పోటీ చేస్తున్న జనతాదళ్ (యునైటెడ్) అభ్యర్థి అనంత్ కుమార్ సింగ్ రూ.100 కోట్ల విలువైన ఆస్తులను ప్రకటించారు. వీటిలో రూ.39.7 కోట్ల చరాస్తులు, రూ.60.8 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సంపన్న అభ్యర్థుల్లో ఆయన ఐదవ స్థానంలో నిలిచారు. షేక్‌పురాలోని బార్బిఘా నుంచి పోటీ చేస్తున్న జేడీ(యు) అభ్యర్థి డాక్టర్ కుమార్ పుష్పంజయ్ రూ.94 కోట్లు, ముంగేర్‌లోని తారాపూర్ ఆర్జేడీ అభ్యర్థి అరుణ్ కుమార్ రూ.83 కోట్లు, పాట్నా జిల్లాలోని మానేర్ జన్ సురాజ్ పార్టీ అభ్యర్థి సందీప్ కుమార్ సింగ్ అలియాస్ గోపాల్ సందీప్ సింగ్ రూ.80 కోట్లు, గయా జిల్లాలోని బెలగంజ్ జేడీ(యు) అభ్యర్థి మనోర్మ దేవి రూ. 75 కోట్లు, పశ్చిమ చంపారన్‌లోని నర్కటియాగంజ్ ఆర్జేడీ అభ్యర్థి దీపక్ యాదవ్ రూ. 70 కోట్ల ఆస్తులు ఉన్నట్లు ప్రకటించారు.



## 'మోమోస్'తో మమ్దానీ..

లంచ్ మీట్ స్పెషల్

**న్యూయార్క్:** న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించి, సరికొత్త రికార్డులు నెలకొల్పారు. అమెరికాలోని ప్రముఖ నగరానికి సారథ్యం వహించే తొలి ముస్లిం నేతగా, ఈ పదవిని చేపట్టిన మొదటి దక్షిణాసియా వ్యక్తిగా, అత్యంత పిన్నవయస్కుడు(34)అయిన మేయర్‌గా గుర్తింపు పొందారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ తొలిరోజున డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ అలెగ్జాండ్రియా ఒకాసియో కోర్టెజ్‌తో పాటు లంచ్ మీటింగ్‌లో భారతీయ భోజనం చేశారు. భారత సంతతికి చెందిన మమ్దానీ తన మొదటి రోజు షెడ్యూల్ బిజిబిజీగా ఉన్నా, సమావేశాలతో గడిపింది. అయితే 'జాక్సన్ హైట్స్‌లోని లాలిగురాస్ బిస్ట్రోలో మా కాంగ్రెస్ మహిళా నేత అలెగ్జాండ్రియా ఒకాసియో కోర్టెజ్‌తో కలిసి భోజనం చేయడం ఎంతో ప్రత్యేకమైనది' అని తన 'ఎక్స్' పోస్టులో తెలిపారు.



# 'సరోగసీ' ద్వారా రెండో బిడ్డ

## అంశంపై సమీక్షించనున్న సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ: రెండో దఫా సరోగసీ ద్వారా బిడ్డ ను కనేందుకు చట్టం అడ్డు తగులుతున్న నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించేందుకు సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. ఇప్పటికే సాధారణంగా లేదా దత్తత లేదా సరోగసీ ద్వారా భార్యాభర్తలకు ఒక బిడ్డ ఉంటే మరో బిడ్డను సరోగసీ ద్వారా పొందేందు కు చట్టం ఒప్పుకోదు. దీంతో రెండో బిడ్డను సరోగసీ ద్వారా కనేందుకు అవకాశం ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం అంగీకారం తెలిపింది. పౌరుల సంతాన భాగ్య హక్కు లను ప్రభుత్వాలు ఏ విధంగా సరోగసీ వంటి చట్టాల ద్వారా అడ్డుకోగలవు? అనే కోణంలో కేసును పరిశీలించాలని ధర్మా సనం నిర్ణయించింది. అయితే జనాభాభారంగా దేశం మారిన నేపథ్యంలో అధిక సంతానం కట్టడి ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ఇలా రెండో సరోగసీ బిడ్డకు అడ్డు చెబుతున్నాయని, ఈ కోణంలో తాము ప్రభుత్వంతో ఏకీభవిస్తున్నామని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. అయితే పౌరుల వ్యక్తిగత జీవితాలు, తమ వారసుల పుట్టుక నిర్ణయా లపై ప్రభుత్వం జోక్యం చేసుకోజాలదని లాయర్ వాదించారు.



మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌లకు

# ఈడీ షాక్

**ఢిల్లీ:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌ల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీమిండియా మాజీ క్రికెటర్లు సురేష్ రైనా, శిఖర్ ధావన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాకిచ్చింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో ఆస్తుల్ని జప్తు చేసింది. రూ.11.14 కోట్ల విలువైన ఆస్తుల్ని ఈడీ అటాచ్ చేసింది. ఇటీవల ఈడీ విచారణకు రైనా, ధావన్ విచారణకు హాజరయ్యారు. ఈ వ్యవహారానికి సంబంధించి మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్‌ను కూడా ఈడీ గతంలోనే విచారించిన విషయం తెలిసిందే. సురేష్ రైనా రూ.6.44 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, రూ.4.70 కోట్ల విలువైన శిఖర్ ధావన్‌కు చెందిన స్థిరాస్తుల్ని అటాచ్ చేసినట్లు తెలిపింది. ఈ ఆస్తులు 1xబెట్ అనే విదేశీ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించి ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది. **కేసు నేపథ్యం:** ఓ అనే సంస్థ భారతదేశంలో అక్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్ సేవలు అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సంస్థకు సంబంధించిన సరోగేట్ యాప్స్ ద్వారా పలు ప్రముఖులు ప్రచారం చేసినట్లు ఈడీ గుర్తించింది. సురేష్ రైనా, శిఖర్ ధావన్, మ్యూజిక్ డైరెక్టర్ బాద్షా, యాక్టర్ కపిల్ శర్మ యూట్యూబర్ బీబీ కీ వైన్స్ (భువన్ బామ్)లను నిర్ధారించింది. విదేశంగా బెట్టింగ్ యాప్స్ నిబంధనలకు విరుద్ధంగా ప్రమోట్ చేసినట్లు అభిప్రాయం వ్యక్తి చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. బీఎక్స్ బెట్ వంటి బెట్టింగ్ యాప్స్ కారణంగా ప్రజలు మోసపోయే అవకాశం ఉంది. అందుకే ఈ ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. విచారణ కొనసాగుతోందని ఈడీ పేర్కొంది.

## అది 'పిచ్చి పని'..

బ్రెజిలియన్ మోడల్ ఆశ్చర్యం

న్యూఢిల్లీ: హర్యానా 'ఓట్ చోరీ' ఆరోపణల సందర్భంగా రాహుల్ గాంధీ చూపిన ఫొటోపై బ్రెజిలియన్ మోడల్ లారిస్సా స్పందించారు. అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఈ మోడల్ ఫొటోతో ఏకంగా 22 పేర్లు నమోదై ఉన్నాయని రాహుల్ గాంధీ బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రదర్శించిన సంగతి తెలిసిందే. భారతీయ ఎన్నికల జాబితాలో ఓ బ్రెజిలియన్ మోడల్ ఫొటో ఉండటం ఏమిటని ఆయన ప్రశ్నించారు కూడా. ఈ నేపథ్యంలో లారిస్సా ఎక్స్ వేదికపై స్పందించారు. రాహుల్ ఆరోపణలపై బ్రెజిలియన్ మోడల్ లారిస్సా స్పందించారు. ఇది నమ్మశక్యంగా లేదని అన్నారు. తన వాదనను ఆమె 'ఎక్స్'లో ఒక వీడియో పోస్టు చేస్తూ వివరించారు. భారతదేశంలో ఎన్నికల ప్రయోజనాల కోసం తన చిత్రాన్ని దుర్వినియోగం చేయడంపై ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ వీడియోలో ఆమె పోర్చుగీస్ భాషలో మాట్లాడుతూ 'గైస్, నేను మీకు ఒక జోక్ చెబుతాను... ఇది చాలా విచిత్రమైనది.. వారు నా పాత ఫొటోను ఉపయోగించారు. అది నా చిన్నప్పటిది. భారతదేశంలో ఓటు వేయడానికి నా ఫొటోను వాడారు. ఒకరితో ఒకరు పోరాడేందుకు నన్ను భారతీయురాలిగా చిత్రీకరించారు. ఎంత పిచ్చి పనో చూడండి' అని అన్నారు.

## ప్రపంచ విజేతలకు రాష్ట్రపతి ముర్ము ప్రశంసలు, స్పెషల్ జెర్సీ

న్యూఢిల్లీ: ఐసీసీ ప్రపంచ కప్ గెలిచి, చరిత్ర సృష్టించిన భారత మహిళా క్రికెట్ జట్టును దేశ అధ్యక్షురాలు ద్రౌపది ముర్ము అభినందించారు. ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారని, యువతరానికి ఆదర్శంగా నిలిచారంటూ జట్టు సభ్యులను ప్రశంసించారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో మహిళా క్రికెట్ ప్రపంచ కప్ విజేతలను ద్రౌపది ముర్ము కలిశారు. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ క్రీడాకారులందరూ సంతకం చేసిన జట్టు జెర్సీని ఆమెకు అందజేశారు. ప్రపంచ కప్ ట్రోఫీని కూడా రాష్ట్రపతికి అందజేశారు. ఆ బృందం బుధవారం ముందుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలిసింది. కాగా ఆదివారం నవీ ముంబైలో జరిగిన 50 ఓవర్ల ప్రపంచ కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి భారత మహిళా క్రికెట్‌లో తొలి ప్రపంచ టైటిల్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

## 'ఏడు కాదు ఎనిమిది'

## యుద్ధవిమానాలు కూలిపోయాయి

భారత్, పాక్‌తో వాణిజ్య ఒప్పందం రద్దు చేసుకుంటామని బెదిరించడంతోనే వెనక్కు తగ్గాయి

ఇరు దేశాల ఘర్షణలపై ట్రంప్ సంకీర్తన వాదన

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు భారత్-పాక్ మధ్య శాంతి ఒప్పందం కుదిర్చానంటూ పాడినపాటే పాడారు. అలాగే భారత్-పాకిస్తాన్ వివాదంలో ఏడు విమానాలు కూలిపోయాయనే నిరాధార వాదనను మళ్లీ వినిపించారు. అయితే ఈసారి విమానాల సంఖ్యను పెంచడం విశేషం. ఆ రెండు అణ్వాయుధ దేశాలతో తాము వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకుంటామని బెదిరించిన తర్వాతనే అవి శాంతి ఒప్పందం కుదుర్చుకున్నాయని ట్రంప్ అన్నారు. మయామిలో జరిగిన అమెరికా బిజినెస్ ఫోరంలో మాట్లాడిన ట్రంప్ తాను.. భారత్- పాక్ మధ్య శాంతి నెలకొనేందుకు మధ్యవర్తిత్వం వహించానని మరోమారు అన్నారు. 'నాడు నేను భారత్- పాకిస్తాన్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే పనిలో ఉన్నాను. ఇంతలో ఒక వార్తాపత్రిక మొదటి పేజీలో.. వారు యుద్ధానికి దిగుతున్నారని చదివాను. ఏడు విమానాలు తగలబడ్డాయి. ఎనిమిదవది చాలావరకూ ధ్వంసం అయ్యింది. మొత్తం ఎనిమిది విమానాలు కూలిపోయాయి..' అని రెండూ అణ్వాయుధ దేశాలు. 'మీరు శాంతికి అంగీకరిస్తే తప్ప నేను మీతో ఎటువంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకోను' అని నేను వారికి చెప్పాను' అని ట్రంప్ అన్నారు. అయితే ఢిల్లీ-ఇస్లామాబాద్‌లు యుద్ధం ముప్పును వ్యతిరేకించాయి. ఈ ఘర్షణకు వాణిజ్య ఒప్పందాలతో సంబంధం లేదని తెలిపాయని ట్రంప్ పేర్కొన్నారు. వెంటనే తాను స్పందిస్తూ 'మీరు అణ్వాయుధ శక్తులు. నేను మీతో వ్యాపారం చేయడం లేదు. మీరు ఒకరితో ఒకరు యుద్ధానికి దిగినప్పుడు మేము మీతో ఎటువంటి ఒప్పందాలు చేసుకోవడం లేదు' అని స్పష్టం చేశానని ట్రంప్ పేర్కొన్నారు. ఆ మర్నాడే ఆ రెండు దేశాలు శాంతి ఒప్పందం చేసుకున్నాయని తనకు ఫోన్ వచ్చిందని ట్రంప్ తెలిపారు. దీంతో తాను వారితో 'ధన్యవాదాలు.. వాణిజ్యం చేద్దాం' అని చెప్పానన్నారు.

# రోజుకు 2.4 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి.. రవాణా సాధించాలి

- 13.75 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి
- భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలి
- రక్షణ పెంపుదలకు మరింత కృషి అవసరం
- మైనింగ్‌తో పాటు అన్ని శాఖల అధికారులు బాగా పనిచేయాలి
- ఏ ఒక్క పని పెండింగ్‌లో ఉండకూడదు
- పనితీరులో అలసత్వాన్ని సహించేది లేదు
- జనరల్ మేనేజర్లతో ప్రత్యేక సమీక్షలో సీఎండీ ఎన్. బలరామ్



**గోదావరిఖని, నవంబర్ 6 (జనంసాక్షి) :** ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల తొలిఅర్ధ సంవత్సరంలో అన్ని విభాగాల్లో కొంచెం వెనకబడి ఉన్నామని, ఇప్పుడు వర్షాలు పూర్తిగా తగ్గిపోయినందున ఉత్పత్తిని గణనీయంగా పెంచి లోటును భర్తీ చేసుకొని లక్ష్యాలు సాధించాలని సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరామ్ అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు పిలుపు నిచ్చారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఆయన సంస్థ డైరెక్టర్లు, వివిధ కార్పోరేట్ విభాగాల జనరల్ మేనేజర్లతో పాటు అన్ని ఏరియాల్లోని జనరల్ మేనేజర్లతో విడివిడిగా సమావేశమై ఏరియాల వారీగా ఉత్పత్తి, రవాణా వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ నెలలో సాధించాల్సిన 72 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యానికి గాను రోజుకు రెండు లక్షల నలభై వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా సాధించాలని ఆయన పిలుపునిచ్చారు, అలాగే రోజుకు కనీసం 13 లక్షల 75 వేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ను తొలగించాల్సి ఉంటుందని ఆదేశించారు. రక్షణ తో కూడిన ఉత్పత్తి కోసం అందరూ సమష్టిగా పనిచేయాలని ఆదేశించారు.

సింగరేణి సంస్థ వివిధ వ్యాపార విస్తరణ చర్యలు తీసుకున్నప్పటికీ ప్రధాన వ్యాపారం బొగ్గు ఉత్పత్తి కనుక దీని మీద అందరూ శ్రద్ధ పెట్టాలన్నారు. మైనింగ్ తో పాటు పర్సనల్, రక్షణ, తదితర అధికారులు కూడా ఒక్క ఫైల్ కూడా పెండింగ్ లో లేకుండా అన్ని పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తుండాలన్నారు. నిబంధనల ప్రకారం ఏ ఏ అధికారికి లేదా ఉద్యోగికి ఏ అవకాశాలు రావాలో అవి వారు పొందే విధంగా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. సింగరేణి సంస్థను సంపూర్ణంగా ప్రమాదరహిత కంపెనీగా రూపుదిద్దాలని నిర్ణయించుకున్నామని, కానీ గత ఏడాది దురదృష్టవశాత్తు మూడు మరణాలు సంభవించాయని, ఈ ఏడాది ఒక్క మరణం కూడా జరగకుండా ప్రమాదాలను నివారించడానికి అందరు అధికారులు కృషి చేయాలి అన్నారు. ముఖ్యంగా భూగర్భ గనుల్లో తనిఖీలు పెంచాలని సూచించారు.

కొత్త ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించారు. కొత్తగూడెం వీకే ఓపెన్ కాస్ట్ గనికి సంబంధించి అన్ని అనుమతులు లభించిన నేపథ్యంలో వచ్చే మార్చి కల్లా కనీసం ఆరు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఆదేశించారు. అలాగే మిగిలిన కొత్త గనులకు ఇంకా సాధించవలసి ఉన్న అవసరంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ ఏడాది మొత్తం నాలుగు గనులు ప్రారంభించుకోవాలన్నారు.

ఇప్పటివరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాత్రమే ఏరియాల జనరల్ మేనేజర్లతో నెలవారి సమీక్ష కార్యాక్రమాలను నిర్వహించిన ఛైర్మన్ ఈసారి ప్రత్యక్షంగా అన్ని ఏరియాల జీఎంలను సమావేశానికి రప్పించి సంబంధిత డైరెక్టర్లు, వివిధ కార్పోరేట్ విభాగాల జీఎంల సమక్షంలో సుదీర్ఘంగా, కూలంకషంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియాల అవసరాలకు సంబంధించిన కొన్ని నిర్ణయాలు అప్పటికప్పుడే తీసుకున్నారు.

ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఎం. తిరుమల రావు, ఈడి కోల్ మూమెంట్ బి. వెంకన్న, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ పరిగేన్, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్, మార్కెటింగ్ టి. శ్రీనివాస్ ఇంకా వివిధ కార్పోరేట్ విభాగాల జనరల్ మేనేజర్లుప్రత్యక్షంగానూ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

**జ్యోతి వెలిగించి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 06 (జనంసాక్షి):** మానకొండూరు మండలం దేవంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో 11వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ 2025 అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జ్యోతి వెలిగించి ఈ స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థుల ప్రతిభ పాటవాలను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జూన్ 3 పరిధిలోని సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల పరిధిలోని 12 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లకు చెందిన బాలురు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. 6, 7, 8 తేదీల్లో జరిగే ఈ స్పోర్ట్స్ మీట్లో వాలీ బాల్, కబడ్డీ, రన్నింగ్, హై జంప్, లాంగ్‌జంప్ వంటి క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీవాకడే, ప్రిన్సిపాల్ జగన్నాథం పాల్గొన్నారు.

# ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పారమిత విద్యార్థుల ఎంపిక

**పారమిత విద్యాసంస్థల అధినేత డా.ఇ.ప్రసాదరావు.**



**కరీంనగర్, నవంబర్ 06 (జనంసాక్షి) :** స్థానిక నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థి సి.హెచ్. భువన రెడ్డి యస్. జి. యఫ్. రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపిక్రిష్ణ తెలిపారు. ఇటీవల సిరిసిల్ల జిల్లా కొత్తపేట గ్రామంలో జరిగిన సిరిసిల్ల జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి నాలుగు జిల్లాల 69వ యస్. జి. యఫ్. అండర్ 17 బాల బాలికల హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలలో పారమిత హెరిటేజ్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి విద్యార్థి సి. హెచ్ భువన రెడ్డి అత్యంత ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనది. రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య వారి ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఉన్నత పాఠశాల, కొస్గి గ్రామం, మహబూబ్ నగర్ జిల్లాలో నవంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న 69వ యస్. జి. యఫ్. బాల బాలికల రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థిని పారమిత విద్యాసంస్థల అధినేత డా. ఇ.ప్రసాదరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వినోద్ రావు, వి.యు.యం.ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపిక్రిష్ణ, సమన్వయకర్త రబీంద్ర పాత్రో, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, అమరేందర్‌లు పాల్గొన్నారు.

# 'జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యేగా' నవీన్ యాదవ్‌ను గెలిపించండి

- ఎర్రగడ్డ ఏరియా ఇన్‌ఛార్జ్‌గా ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి
- ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 06 (జనంసాక్షి):** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని వేములవాడ ఎమ్మెల్యే , రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ తో కలిసి ఓటర్లను కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రగడ్డ ప్రాంతానికి ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న ఆయన ఇవాళ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి చేతి గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి స్థానికులకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, బీసీ బిడ్డ నవీన్ యాదవ్‌కి అందరూ మద్దతుగా నిలిచి అఖండ విజయం అందిస్తే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ప్రగతి బాటలో నడిపిస్తారని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. యువకుడు, ఉత్సాహవంతుడైన నవీన్ యాదవ్ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటాడని హామీ ఇచ్చారు. ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ప్రతిఒక్కరికీ సూచించారు. సెంటిమెంట్ కన్నా డెవలప్‌మెంట్ మిన్న అని వివరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్ డోర్ టూ డోర్ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మార్పును ఏవిధంగా అయితే తీసుకొచ్చారో అలాగే జూబ్లీహిల్స్‌లోనూ తీర్పు ఇవ్వాలని ఓటర్లను కోరారు. నవీన్ యాదవ్‌ను గెలిపించటం ద్వారా బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# మండలంలో కొనసాగుతున్న నష్టపోయిన వరి పంటల సర్వే

**చిగురుమామిడి నవంబర్ 6 (జనంసాక్షి):** భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల వరి పంటల సర్వే మండలంలోని 17గ్రామాల్లో కొనసాగుతుంది. మండలంలోని సుందరగిరి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని అంజలి సుందరగిరితోపాటు ఉల్లంపల్లి గ్రామంలో గురువారం నష్టపోయిన రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి రైతు భరోసా యాప్ ద్వారా జిపిఎస్ తో అనుసానందించబడిన ఫోటోల ద్వారా పంట నష్టాన్ని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరి పంటలు నష్టపోయిన రైతులు తమను సంప్రదించాలని, నష్టపోయిన పంటను పరిశీలించి ఆన్లైన్‌లో నమోదు చేస్తామని చెప్పారు.

# ఎన్నో ప్రభుత్వాలు మారిన మా తలరాతలు మారలేదు

**ప్రజాపాలనలో నిరుపేదలకు న్యాయం జరిగింది**

**సొంతింటి కల నెరవేరడంతో కంటతడి పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు**



**తంగళ్ళపల్లి నవంబర్ 06(జనం సాక్షి) :** నిరుపేదల సొంత ఇంటి కల నెరవేరడంతో బాగోద్వేగంతో కంట తడి పెట్టిన సంఘటన తంగళ్ళపల్లి మండలం, రాళ్లపేట గ్రామంలోని గాంధీ నగర్ లో చోటుచేసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు గోరేమియా చాంద్ బి దంపతులు గత కొద్ది సంవత్సరాలుగా పూరి గుడిసెలో నివాసము ఉంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల లిస్టులో పేరు రావడంతో ప్రభుత్వ ప్రోత్సాహంతో సొంత ఇంటి కల నెరవేరిందని తెలిపారు. ఎన్నో ప్రభుత్వాలు మారిన మా తలరాతలు మాత్రం మారలేదంటూ ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు హాజరైన ఇన్చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ముందు కంటతడి పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాలాంటి నిరుపేదలకు ప్రజా పాలనలో న్యాయం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ వెలుముల స్వరూపా తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు గణాధి కిషన్, కటకం రాజు, అలీ, గడ్డం నరసయ్య, లింగాల భూపతి, పొన్నం లక్ష్మణ్ గౌడ్,రాజేశ్వరరావు, ఆసరి బాలరాజు, మునిగేల రాజు, భరత్ గౌడ్, బైరనేని రాము తదితరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌ల మధ్య విభేదాలు

- దురుసుగా ప్రవర్తించిన లెక్చరర్ - పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన విద్యార్థులు
- కలెక్టర్ స్పందించి శాఖ పరమైన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలి
- సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం



**జమ్మికుంట, నవంబర్ 6 (జనం సాక్షి):** జమ్మికుంట పట్టణంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల లో గత పది రోజులగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం అన్నారు. ఈ విషయంపై సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ల మధ్య విభేదాలు ఏర్పడి ఆ విభేదాలు కాస్త విద్యార్థులపై చూపించడం చాలా ఆశ్చర్యానికి గురిచేస్తుందని అన్నారు. ఎంపీసీ లెక్చరర్ అయిన కవిత విద్యార్థుల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ విద్యార్థులను నానా రకాల మాటలతో ఇబ్బందులు పెడుతుందని పరీక్ష ఫీజు డేట్ వచ్చినప్పటికీ విద్యార్థులు ఫీజు చెల్లిస్తామని వెళ్తే నేను ఫీజు తీసుకోను, మీరు ఎవరికి చెప్తారో చెప్పుకోండి నేను మీ అంతు చూస్తానని విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తుందని ఒక పక్క ప్రభుత్వ పాఠశాలల లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల లో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రభుత్వం చూస్తూ ఉంటే మరో పక్క ఈ లెక్చరర్ లు వారి మధ్య విభేదాలతో అవి పిల్లల మీద తీస్తున్నారన్నారు. ఈ విషయంపై నేరుగా ఈరోజు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి ప్రశ్నించగా ప్రశ్నించిన మాపైన కొంతమంది రాజకీయ నాయకుల పేర్లు చెప్పుతూ ఫోన్లో ఫోటోలు వీడియోలు తీస్తూ నోటికి ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరించారు. వార్త వివరాలు తీసుకుందామని వచ్చిన మీడియా సోదరుల పైన కూడా ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడితే ఆ మేడంకు ఇప్పటికి చాలా సార్లు చెప్పాము కానీ ఆమె మారడం లేదు అనే విషయం వారు తెలియజేశారు. ఈ విషయంపై ఎవరికి చెప్పాలో తెలియక జమ్మికుంట పోలీస్ స్టేషన్ కి విద్యార్థులతో కలిసి సిఐ కి తెలియజేయడంతో సానుకూలంగా స్పందించారన్నారు. ఇట్టి విషయంపై కలెక్టర్ వెంటనే స్పందించి పై విధంగా వ్యవహరించిన కవిత లెక్చరర్ పై శాఖా పరమైన విచారణ జరిపించి ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. లేనిచో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలిగిన దానికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే భరించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి టౌన్ ప్రెసిడెంట్ కొమ్ము నరేష్, ఏబీవీపీ టౌన్ ప్రెసిడెంట్ పలిక నిరూప్ ,ఆరిఫ్, శేషాంక్,అఫ్రిది , శివ, కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరుపవద్దు

- 42 శాతం రిజర్వేషన్లు సాధించి ఎన్నికలు జరపాలి
- బీసీ సాధికారిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలస నరేందర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 6 (జనంసాక్షి) :** పాత రిజర్వేషన్లతో ఎన్నికలు జరుపవద్దని, కోర్టుల ఆదేశాలతో పార్టీపర రిజర్వేషన్ల ఆలోచన వద్దని, కోర్టులతో న్యాయ పోరాటం చేసి చట్టబద్ధంగా రిజర్వేషన్లు సాధించాలని బీసీ సాధికారిక సంఘం జిల్లా అధ్యక్షులు బీసీ సాధికారిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలాస నరేందర్ అన్నారు. గురువారం ఆయన వేములవాడలో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గంలో,నామినేటెడ్ భర్తీలో, రాజకీయంగా,విద్య, ఉద్యోగాల్లో, ప్రమోషన్లలో,బడ్జెట్లో బీసీలకు రావాల్సిన వాటా – కోటా కేటాయించాలన్నారు.స్థానిక ఎన్నికలు జరపాలని,ఎన్నికలు ఎప్పుడు జరుపుతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు కోరుతూ,ఈ నెల 24 న మల్లీ కేసు విచారణ ఉన్నదనీ హైకోర్టు ప్రకటించడం జరిగిందన్నారు.బీసీ రిజర్వేషన్ల సాధనకై,రాష్ట్ర జేఏసీ భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటించడం జరిగిందని,ప్రకటించిన విధంగా,గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉద్యమాలను చేపట్టాలని బీసీ సంఘాలను కోరారు.జనాభా దామాషా ప్రకారం రాష్ట్ర క్యాబినెట్లో ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో రాజకీయంగా,విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో, బడ్జెట్లో బీసీలకు వాట – కోటా కేటాయించాలన్నారు.ఆయన వెంట జిల్లా బీసీ సాధికారిత సంఘం నేతలు పిన్నింటి హన్మాండ్లు,ఉయ్యాల భూమయ్య గౌడ్, బిల్ల కృష్ణ,బుర్ర శేషగౌడ్,కే.కృష్ణ,రవి కుమార్, వి.దేవయ్య, కైరి.మల్లేశం పాల్గొన్నారు.

# విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాలి





- ఉత్తమ ప్రతిభతో ఎంపీకి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలి
- పది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ
- బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి డా. చెన్నమనేని వికాస్

**చందుర్తి ( జనం సాక్షి ):** ప్రధాని మోదీ కానుకగా కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ అందిస్తున్న ఉచిత సైకిళ్లను గురువారం మండల కేంద్రంతో పాటు మల్యాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు వేములవాడ బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో 20వేల సైకిళ్లను పంపిణీ చేయాలని బండి సంజయ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మోదీ కిట్ పేరుతో సహాయాన్ని అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు, పది వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధన కోసమే ఎంపి బండి సంజయ్ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి జీవనాన్ని కొనసాగించేవారే ఎక్కువ ఉన్నారని, అలాంటి వారు తమ పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నట్లు వికాస్ రావు తెలిపారు. విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించుకున్నట్లు ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారన్నారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి సంజయ్‌కుమార్‌కు రిటర్న్‌గిఫ్ట్ ఇవ్వాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఈవో వినయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ప్రతిభ, చేరత్ చెంద్ర, మండల బీజేపీ అధ్యక్షులు మోకిలే విజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, నాయకులు అల్లాడి రమేష్, మార్త సత్తయ్య, పొంచెట్టి రాకేష్, పెరుక గంగరాజు, మర్రి మల్లేశం, హనుమయ్య చారీ, చింతకుంట గంగాధర్, లోకజు సతీష్, మట్కం మల్లేశం,జీవన్, నరేష్, రాజ శేఖర్, చింతకుంట సాగర్ శ్రీహరి, మహీందర్, తిరుపతి,రంజిత్, తిరుపతి, వెంకటేష్ శ్రీనివాస్ రాజు, లింగారావు జలంధర్,తిరుపతి రాజు,రంజిత్ దేవయ్య, చంద్ర శేఖర్, లింగారావు, రాజు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


# పేదలకు అండగా మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గ పరిధిలోని కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామానికి చెందిన వడ్లకొండ రాజమణి కి 2.50 లక్షలు ఎల్ఓసి మంజూరు చేసి ఇప్పించారు. రాజామణి నిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరి చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 2.50 లక్షలు మంజూరు చేయించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు గురువారం వారికి ఎల్ఓసి మంజూరు కాపీని హైదరాబాద్ లో అందజేశారు. ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు సదరు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.



# మార్కెట్ విలువల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలి

**రైల్వే లైన్ భూ నిర్వాసిత రైతుల డిమాండ్**




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, నవంబర్ 6 (జనంసాక్షి) :** కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ లో భూములు కోల్పోతున్న వారికి ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని భూనిర్వాసిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేములవాడ రాజన్న ఆలయానికి దగ్గరలో రెల్వే స్టేషన్ నిర్మాణం కొరకు వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో తరతరాల నుండి వస్తున్న వారసత్వ భూములు, రైతులు కొనుగోలు చేసిన భూములను ప్రభుత్వం భూసేకరణ చేయాలని నిర్ణయించి గత ప్రభుత్వ హయాంలో గెజిట్ పబ్లికేషన్ జారీ చేశాసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు మాట్లాడుతూ రైల్వే లైన్ కోసం గత పది సంవత్సరాల క్రితం అధికారులు సర్వే చేశారని అన్నారు. గెజిట్ పబ్లికేషన్ చేసి ఆ భూములను కొనుగోలు కాని అమ్మకాలు జరుపకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బ్లాక్ చేశారన్నారు. అప్పటి నుండి పరిహారం చెల్లించక పోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు.గత టీఆర్ఎస్ ప్రభుత్వం కొంత మంది రైతులకు మూడు సంవత్సరాల క్రితం నష్ట పరిహారం చెల్లించినారని తెలిపారు. ఇంకా మిగతా రైతులకు నేటికి పరిహారం అందడం లేదన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. రైల్వే స్టేషన్ కోసం భూమి కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, వేములవాడ శాసనసభ్యులు వద్ద తమ మొర పెట్టుకున్న తమ ఆవేదన ఎవరు పట్టించుకోవడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర నిధులు లేకపోతే తమ భూములు అమ్ముకోవడానికి అవకాశం ఇవ్వాలన్నారు.సబ్ రిజిస్టర్ కార్యాలయంలో బ్లాక్ చేసిన గెజిట్ తొలగించలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిని తీసుకోవాలనుకుంటే ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం డబ్బులు చెల్లించాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు.

# వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు





- జిల్లాలో 70 శాతం మార్క్ ఔట్ పూర్తి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్ళపల్లి మండల పరిధిలో మొత్తం 11 ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం

**తంగళ్ళపల్లి, నవంబర్ 6 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. తంగళ్ళపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ నిర్మించిన మోడల్ హౌస్, మండేపల్లి, చింతల పల్లి, రాళ్లపేటలో మొత్తం 11 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కాగా గృహ ప్రవేశా లు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కే కే మహేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని, దీనిలో భాగంగా లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని తెలిపారు. ఆయా గ్రామా ల్లో ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకు న్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా లబ్దిదారులు అందరూ ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని, త్వరితగతిన తమ సొంత ఇంటి కలను పూర్తి చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉండి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా సహకరించాలని ఆదేశించారు.

**అందుబాటులోకి తీసుకురావాలి**

తంగళ్ళపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న తహసీల్ కార్యాలయ భవనాన్ని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే రాళ్ళపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారని ,విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక సదుపాయాల తీరుపై ఆమె ఆరా తీశారు. కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూపా తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగం గౌడ్, మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు గణాధి కిషన్, కటకం రాజు, అలీ, గడ్డం నరసయ్య, లింగాల భూపతి, పొన్నం లక్ష్మణ్ గౌడ్, రాజేశ్వరరావు, భైరనేని రాము, ఆసరి బాలరాజు, హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేక అధికారి, డీపీఓ శర్ఫుద్దిన్, తహసిల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన
# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి



**కరీంనగర్, నవంబర్ 06 (జనంసాక్షి) :** హాకీ ఆటకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్నదని ఈ క్రీడ ద్వారా దేశాల మధ్య సత్సంబంధాలను పెంపొందించుకోవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల చెందినటువంటి విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన సందర్భంగా ప్రత్యేక సమావేశానికి హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మన దేశంలో ఆవిర్భవించిన ఈ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా చాలామంది అభిమానులు ఉన్నారని చెప్పారు. ఈ క్రీడకు యువత చాలా ఆకర్షితులవుతున్నారని క్రీడల ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో వార్షిక ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు వివిధ రంగాలలో అన్ని వనరులను కల్పించి పోటీలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఇటీవల కాలంలో కరీంనగర్ జిల్లాలోని హుజరాబాద్ లో జడ్ పి హెచ్ ఎస్ పాఠశాల మైదానంలో నిర్వహించినటువంటి ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి హాకీ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనరని హర్షం వ్యక్తం చేశారు. అండర్ 14 బాలుర విభాగంలో ఎ.కృతిక్ పటేల్, కె.జయంత్, అండర్ 14 బాలికలు విభాగంలో కె.యుక్త , ఎ.నైనికా రెడ్డి, ఆకుల ఆశ్రిత, అండర్ 17 బాలుర విభాగంలో ఎం. రితిక్ రెడ్డి, జి.అక్షిత్, అండర్ 17 బాలికలు విభాగంలో కె.సాన్విక, జె.వర్షిక ఎంపికైన వారందరికీ పుష్పగుచ్చాలను అందజేసి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుల సంఘాల ముసుగులో పంచాయతీలు?



- డబ్బు పంచాయతీగా మారుతున్న సంఘాలు..?
- ఎలా పైసలు దండుకోవాలని ఆలోచిస్తున్న వైనం
- ఖనిలో జరుగుతున్న బాగోతం

**గోదావరిఖని, నవంబర్ 6 (జనం సాక్షి) :** కొంతమంది కుల సంఘాల ముసుగులో తెల్లవారితే చాలు ఎక్కడ పంచాయ తీలు అవుతున్నాయి.. మా కులమా.. ఏ కులము అనే ధోరణిలో కుల సంఘాల నాయకులు పబ్బం గడుపుకోవడమే లక్ష్యంగా పంచాయతీలు చేస్తున్నారు. ఇష్టానుసారంగా వారికి అనుకూలంగా ఆ పంచాయతీని మార్చుకొని డబ్బు దండుకోవడమే ప్రవృత్తిగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి.గోదావరిఖనిలో కొంతమంది బాధితులు వారి వారి కుల సంఘాల ముసుగులో జరుగుతున్న పంచాయతీల్లో నష్టపోయిన వారు ఆరోపిస్తున్నారు. నీకేముంది.. నువ్వు ఎక్కడ ఉన్నా ఓకే నేనున్నా ఇక్కడ నువ్వు రా.. నీ కులం..నా కులం ఒక్కటే, నిన్ను నేను చూసుకుంటా నాకు డబ్బు ఇయ్యి అంటూ పంచాయతీ పెద్దలుగా వస్తున్న తీరిది.ఏదైనా పర్వాలేదు నేను పంచాయతీ నీకు అనుకూలంగా మాట్లాడతా నాకు డబ్బు వస్తే చాలు అనే రీతిలో గోదావరిఖనిలోని కుల సంఘాల నాయకులు వివరిస్తున్న తీరుని పలువురు జీర్ణించుకోలేకపోతున్నారు.ఏది ఏమైనా ఏ కుల సంఘాల పంచాయతీ ఏమిటో కానీ కొంతమంది బాధితులు ఇబ్బందులకు గురవుతున్న వైనం స్పష్టంగా తెలుస్తుంది. వాడు ఏ జిల్లా వాడైనా ఏ రాష్ట్రం వాడైనా నా కులం అయితే చాలు అనే రీతిలో నువ్వు రా నేను చూసుకుంటా నీది తప్పైనా పర్వాలేదు. నాకు డబ్బులు ఇంత ఇవ్వాలి నేను సెటిల్ చేస్తా అనే రీతిలో ఇక్కడ గోదావరిఖనిలోని కుల సంఘాల తీరు స్పష్టంగా కనిపిస్తుందని ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ పంచాయతీలే తప్పు అందులో కుల సంఘాల ముసుగులో చేస్తున్న పంచాయతీల వ్యవహారం, కొంతమంది రక్షణాధికారులు కూడా సహకరిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# సింగరేణి కార్మిక కుటుంబాలకు శుభవార్త

## ఐఎన్‌టిసి సెక్రెటరీ జనరల్ జనక ప్రసాద్



**గోదావరిఖని, జనంసాక్షి:** సింగరేణి కార్మికుల కుటుంబాలకు శుభవార్త అందనుందని ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. ఆయన కృషి ఫలితంగా సింగరేణిలో మెడికల్ పూర్తి చేసి ఇప్పటివరకు నియామక పత్రాలు పొందని దాదాపు 473 మంది కారుణ్య అభ్యర్థులు ఈ నెల 12వ తేదీన కొత్తగూడెం వేదికగా నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా జరగనుందనీ జన ప్రసాద్ తెలిపారు. సింగరేణి కంపెనీలో వివిధ పరిపాలనా కారణాలతో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ నియామక పత్రాల జారీ కోసం, ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ నిరంతరం యాజమాన్యం, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన ఫలితంగా ఈ చారిత్రాత్మక నిర్ణయం సింగరేణి యాజమాన్యం తీసుకుని ఉందని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా సింగరేణి వ్యాప్తంగా 473 మంది కార్మిక కుటుంబాలకు న్యాయం జరగనుంది అన్నారు. ఐఎన్టియుసి నేతృత్వంలోని ఈ విజయం కార్మికుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబాటును మరోసారి నిరూపిస్తోందనీ జనక్ ప్రసాద్ పేర్కొన్నారు.

# సహారా స్టేట్స్, సీనియర్ సిటిజన్స్ ఫోరం నూతన కమిటీని అభినందించిన కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**హయత్ నగర్, నవంబర్ 06 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా స్టేట్స్ క్లబ్ లో నూతనంగా ఎన్నికైన సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి హాజరై, వారిని అభినందించారు. కొత్తగా ఎన్నికైన నూతన కమిటీ కమిటీ అధ్యక్షులు ఎన్ ఆదినారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శిగా ప్రకాశం, సభ్యులుగా అమర్నాథ్, శ్యాంప్రసాద్, వీరభద్ర రావు, రామన్ గౌడ్ లను శుభాభినందనలు తెలియజేసి, శాలువాలతో సత్కరించారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సహారా స్టేట్స్ కాలనీ ప్రజల అభివృద్ధికి జిహెచ్ఎంసి తరపున అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తానని వారు హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ద్వారా సమాజానికి సేవ చేయాలనే ఆత్మీయత ఎంతో ప్రశంసనీయమైందని వారు అన్నారు. కాలనీలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బి టి రోడ్లను రూ.1.40 లక్షల వ్యయంతో పునరుద్ధరించగా, రూ.1.90 లక్షలతో బాక్స్ డ్రైన్ (నాలా) నిర్మాణం పూర్తయిందని వారు తెలియజేశారు. మిగిలిన బి టి రోడ్ల పనులు కూడా త్వరలోనే పూర్తి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సహారా స్టేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ జానీ, శ్రీకాంత్, భీమా నాయక్, సుదర్శన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఓ.పి సింగ్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాటినం లవ్ బ్యాండ్స్‌తో శాశ్వతం చేసుకోండి

**వివాహ సీజన్‌లో ప్లాటినం కొత్త కలెక్షన్ ఆవిష్కరణ**

**హైదరాబాద్, నవంబర్ 06 (జనం సాక్షి) :** 'ప్రేమ' ఇది మాటలకందని ఒక అనుభూతి. అది తల్లిదండ్రుల మీద కావచ్చు, అన్నదమ్ముల మీద కావచ్చు, అక్కచెల్లెళ్ళ మీద కావచ్చు అది ఒక తీయని భావన. జంటల మధ్య ఉన్న ప్రేమను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే, వీళ్ల మధ్య ఉన్న ప్రేమకు మాటలుండవు. వాళ్ల మనస్సులు మాత్రమే మాట్లాడతాయి. ఆ నిశ్శబ్ద భావాలను చెరగని గుర్తుగా 'ప్లాటినం'తో చేసుకోవచ్చు. ప్లాటినం లవ్ బ్యాండ్స్ కొత్త కలెక్షన్ రూపొందించింది. ఇవి కేవలం ఉంగరాలు మాత్రమే కాదు. ఇద్దరి హృదయాల భాష. బయట ప్రపంచానికి అర్థం కాకపోయి నా, ఇద్దరికే అర్థమయ్యే ప్రత్యేక కథలకు ప్రతీక. ఈ కలెక్షన్ ప్రేమలోని ఆ మౌన సంకేతాల నుంచి స్ఫూర్తి పొందింది. మాటల కంటే నిశ్శబ్దం ఎక్కువగా మాట్లాడే ఆ క్షణాలు, కళ్ళలో పలికే భావాలు, ప్రతి డిజైన్‌లో ఆ మౌనమైన అనుబంధం కనిపిస్తుంది. ఎంత మాటలు లేకపోయినా అర్థం అయ్యే ప్రేమకు ఈ ఉంగరాలు ఒక అందమైన ప్రతీక. 95 శాతం శుద్ధమైన ప్లాటినంతో తయారు చేసిన ఈ లవ్ బ్యాండ్స్ ప్రేమలోని అచంచలమైన నిబద్ధతకు నిదర్శనం. ఈ లోహం ఎంత దృఢంగా కాలానికి అందని స్వభావంతో ఉందో మీ బంధం కూడా అంతే మన్నికైనదని ఇవి చెబుతాయి. రెండు మార్గాలు ఒకటిగా మారే జీవనయాత్రను సూచించే ఎంట్వైన్డ్ మోటిఫ్స్ నుంచి ప్రతి ప్రేమలో ఉండే భిన్న భావాలు, అయినా వాటిలోని సమతుల్యయను చూపించే డ్యుయల్-టోన్ డిజైన్స్ వరకు ప్లాటినం లవ్ బ్యాండ్స్ కళాత్మకతను, భావోద్వేగాన్ని అందంగా అందిస్తుంది.





# మత్స్యకారుల జీవితాల్లో ఉపాధి నిండాలి

- ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్.. కొమ్మిశెట్టి విజయ

**గంభీరావుపేట నవంబరు 6 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మల ఎగువ మానేరులో గురువారం రోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి ఉచిత చేప పిల్లల కార్యక్రమం మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మిశెట్టి విజయ తిరుపతి, జిల్లా మత్స్యకారుల అధికారి, సౌజన్య, ఎమ్మార్వో మారుతి రెడ్డి, మత్స్యకారుల చైర్మన్ చొప్పరి రామచంద్రం, చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు, మార్కెట్ చైర్మన్, కొమ్మిశెట్టి విజయ , ఎమ్మార్వో మారుతి రెడ్డి, మత్స్యకార జిల్లా చైర్మన్ రామచంద్రం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి ఉచిత చేప పిల్లల కార్యక్రమంలో జిల్లాలో మొత్తం ఒక కోటి 40 లక్షలు చేప పిల్లలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా, మండల కేంద్రంలోని ఎగువ మానేరులో 10 లక్షల 50 వేల చేప పిల్లలను గురువారం రోజుపంపిణీ చేశారు, మత్స్యకారుల జీవనోపాధి మెరుగుప డాలని సంకల్పంతో మత్స్యకారుల జీవితాల్లో ఆనందం నిండాలని, 100% రాయితీతో చేప పిల్లలు మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని దీని ద్వారా వారికి జీవన ఉపాధి కలుగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో మత్స్యకారుల అధికారులతో పాటు, జిల్లా చైర్మన్, రామచంద్రం, ఎమ్మార్వో మారుతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ తిరుపతి, మచ్చకర్ల మండల అధ్యక్షుడు, నగరపు దేవేందర్, కోశాధికారి దేవదాసు, జిల్లా డైరెక్టర్ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ రాజనర్సు, రాజు గౌడ్ రాజమల్లు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు

# సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**చిగురుమామిడి (జనంసాక్షి):** సైబర్ నేరాలపై విద్యార్థులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని చిగురుమామిడి ఎస్సై రేణికుంట సాయికృష్ణ విద్యార్థులకు తెలిపారు.గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని డార్విన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై,100 డయల్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల వల్ల జరిగే నష్టాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడి నిండు జీవితాన్ని బలి చేసుకో వద్దని, చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని పిలుపునిచ్చారు.చదువుతోపాటు ఖాళీ సమయంలో క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు.పోలీస్ వ్యవస్థ పనితీరు,చట్టం పనితీరు, ప్రజల హక్కులపై వివరించారు.పోలీసులు ప్రజల రక్షణ కోసం తీసుకుంటున్న రక్షణ చర్యలపై చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కొంపల్లి సమ్మిరెడ్డి,ఉపాధ్యాయులు బుర్రసతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## తాళ్లపాక అన్నమాచార్య
# సంగీత మహోత్సవం

- 'తందనాన - అన్నమాచార్య అంతర్జాతీయ సంగీత పోటీలు 2025'
- దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు 12 దేశాల నుంచి 700 పైగా ఎంట్రీలు
- డిసెంబర్ 20న అన్నమయ్యపురంలో గ్రాండ్ ఫినాలే



**హైదరాబాద్, నవంబరు 6 (జనం సాక్షి):** తాళ్లపాక అన్నమాచార్య సంగీత వైభవాన్ని గుర్తు చేసే లక్ష్యంతో 'తందనాన - అన్నమాచార్య అంతర్జాతీయ సంగీత పోటీలు 2025' గ్రాండ్ ఫినాలే డిసెంబర్ 20వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ దగ్గర ఎన్ఏసీ రోడ్డులో ఉన్న అన్నమయ్యపురంలో నిర్వహించనున్నట్లు అన్నమాచార్య భావన వాహిని వ్యవస్థాపక అధ్యక్షురాలు పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు తెలిపారు. ఈ వివరాలు తెలిపేందుకు హైటెక్ సిటీలో ఉన్న సంస్థ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నమాచార్య భావన వాహిని 1983 నుంచి స్వచ్ఛందంగా సేవ చేస్తుందన్నారు. భక్తి సంగీతం ద్వారా భావ కాలుష్యాన్ని నివారించడం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. తానా తమవంతు సహకారం అందిస్తుందన్నారు. 'తందనాన' ప్రపంచవ్యాప్తంగా బహుళ ప్రాచుర్యం పొందాలన్నది తన అభిమతం అన్నారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక జీవితం గడపాలన్నారు. అందుకు అన్నమాచార్య సంకీర్తనలకు మించినవి లేవన్నారు. అన్నమయ్య సంకీర్తనల్లో కనిపించే ప్రసిద్ధ 'తందనాన' (పద విరామ గానం) సార్వత్రిక సమానత్వం, భక్తి భావం, సామరస్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ పోటీ ద్వారా అన్నమయ్య కీర్తనల సంగీత వైభవం, ఆయన సార్వజనీన సందేశం జాతి, మతం, భాష, భూభాగం అనే అన్ని హద్దులను దాటి ప్రపంచ వ్యాప్తంగా వినిపించబడుతుందని చెప్పారు. అన్నమయ్య రచించిన ఈ సంగీత సంపదను ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువత, కళాభిమానులు, సంగీత విద్వాంసులు పాడడం ఈ పోటీ ప్రత్యేకత అన్నారు. ఈ పోటీలో ప్రపంచం నలుమూలల నుంచి పాల్గొనడం ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఈ పోటీలో యువ అభిరుచి గల కళాకారులు నుంచి అనుభవజ్ఞులైన సీనియర్ గాయకుల వరకు మూడు వయసు విభాగాలలో పాల్గొనే అవకాశం కల్పించామన్నారు. అందులో ఆరేళ్లలోపు, ఏడు నుంచి పద్నాలుగేళ్లు, పదిహేనేళ్ళ పైబడిన.. ఈ విధంగా మూడు కేటగిరీలు చేశామన్నారు. ఈ పోటీ కోసం దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు దుబాయ్, సింగపూర్, అమెరికా సహా 12 దేశాల నుంచి 700 పైగా ఎంట్రీలు వచ్చాయన్నారు. వీటిని అనుభవజ్ఞులైన సంగీత నిపుణుల ప్రత్యేక జ్యూరీ బృందం అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తుందన్నారు. ఈ ప్రక్రియ అనంతరం గ్రాండ్ ఫినాలే కోసం తొమ్మిది మంది గాయకులను ఎంపిక చేయనున్నామని తెలిపారు.

# మా ప్లాట్లు మాకిచ్చిన హైడ్రాకు థాంక్స్

- హైడ్రాకు మద్ధతుగా ర్యాలీలు నిర్వహించిన కాలనీవాసులు




**హైదరాబాద్ నవంబరు 6 (జనం సాక్షి):** గుర్తుకు వస్తుంటే భయమేస్తోంది. ఆ భయాన్నిపారదోలి.. మా ప్లాట్లు మాకు వచ్చేలా చేసిన హైడ్రాకు ధన్యవాదాలు అంటూ పోచారం మున్సిపాలిటీలోని దివ్యానగర్ లేఔట్‌లోని 2218 మంది ప్లాట్ యజమానులు చెబుతున్నారు. హైడ్రాకు ఎన్నిసార్లు థాంక్స్ చెప్పినా సరిపోదు. అందుకే నేడు కూడా ర్యాలీ నిర్వహించి ధన్యవాదాలు చెబుతున్నామని.. గురువారం ర్యాలీ నిర్వహించిన సందర్భంగా తెలిపారు. వాస్తవానికి రహదారుల ఆక్రమణ, పార్కుల దురాక్రమణను హైడ్రా తొలగించింది. కాని మాకదే పెద్ద మేలు అయ్యింది. అడ్డుగోడలు తొలగడంతో మా ప్లాట్లకు మేము వెళ్లడానికి వీలు కుదిరిందంటూ నాటి పరిస్థితులను గుర్తు చేశారు. హైడ్రా గాని రంగంలోకి దిగకపోతే.. రహదారులు, పార్కులు మాయమై.. తమ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేని పరిస్థితి అంటూ హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది జనవరి నెల 25వ తేదీన దాదాపు 200 ఎకరాల్లో 2218 ప్లాట్లుగా విస్తరించిన దివ్య లేఔట్ చుట్టూ 4 కిలోమీటర్ల మేర నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించింది. అప్పుడు సంబరాలు చేసుకున్నాం. ప్రహరీ నిర్మించి తమ ప్లాట్లలోకి వెళ్లకుండా నల్లమల్లారెడ్డి ఆంక్షలు విధించడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో హైడ్రాను ఆశ్రయించామని అప్పటి రోజులు గుర్తు చేసుకున్నారు. నల్లమల్లారెడ్డి కోటగోడలు, అడ్డు గోడలు బద్ధలు కొట్టి 2218 మంది ప్లాట్లకు విముక్తి కల్పించిన హైడ్రాకు ధన్యవాదాలంటూ మరో సారి ర్యాలీ నిర్వహించి అదే లే ఔట్‌లో సమావేశమయ్యారు ప్లాట్ యజమానులు. హైడ్రాకు మరోసారి ధన్యవాదాలంటూ నినదించారు.

**గోడ కూలింది.. కాలనీలకు దారి దొరికింది..**

4 కిలోమీటర్ల మేర ఉన్న భారీ ప్రహరీని కూల్చి వేయడంతో.. ఏకశిలా లే ఔట్, వెంకటాద్రి టౌన్‌షిప్, సుప్రభాత్ వెంచర్ -1 , మహేశ్వరి కాలనీ, కచ్చవాణి సింగారం, ఏకశిలా - పీర్జాదిగూడ రోడ్డు, బాలాజీనగర్, సుప్రభాత్ వెంచర్ -4 , వీజీహెచ్ కాలనీ, ప్రతాప్ సింగారం రోడ్డు, సుప్రభాత్ వెంచర్ -2, 3, సాయిప్రియ, మేడిపల్లి, పర్వతపురం, చెన్నారెడ్డి కాలనీ, హిల్స్ వ్యూ కాలనీ, ముత్తెల్లిగూడ నివాస ప్రాంతాలకు దారి దొరికిందని ఆయా ప్రాంతాల నివాసితులు సంతోషం వ్యక్తం చేశారు. తమ ప్లాట్‌ను తామే చూడాలన్నా, వేరే వాళ్లకు చూపాలన్నా.. అనుమతి ఉండేది కాదు.. నల్లమల్లారెడ్డి నిర్దేశించిన సమయంలోనే రావాల్సి ఉంటుందని.. గేటు దగ్గర ఎంట్రీ పుస్తకంలో వివరాలన్నీ రాసిన తర్వాత వారికి ఇష్టమైతే వదిలేవారు.. లేదంటే లేదు.. ఏమాత్రం వారిని ప్రశ్నించినా అక్కడివారు తమను కొట్టి పంపించేసేవారు అని హైడ్రా రాక ముందు రోజులను గుర్త చేసుకున్నారు. అలాగే మిర్జాలగూడ మున్సిపాలిటీలోని పర్వతాపురంలో ముస్లిం, క్రిస్టియన్ మతస్తుల శ్మశానవాటికలను కూడా అక్కడి వారు కబ్జా చేయగా హైడ్రా వచ్చి విడిపించిందని పలువురు స్థానికులు దివ్యానగర్ లేఔట్‌లోని ప్లాట్ యజమానులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
7 నవంబర్ 2025

# పోలీసులను బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- డిజిపి శివధర్ రెడ్డి
- డిస్పీలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం




**హైదరాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి) :** గ్రూప్ 1లో ఎంపికైన 115 మంది డీఎస్పీలకు ట్రైనింగ్ కార్యక్రమం ప్రారంభమైంది. గురువారం ఉదయం డీజీపీ శివధర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీజీపీఏకు చేరుకున్న డీజీపీకి టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్ గౌరవ వందనంతో స్వాగతం పలికారు. రాజేంద్రనగర్‌లోని టీజీపీఏలో ప్రొబేషనరీ డిప్యూటీ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)లకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. 115 మందితో ఇదే అతిపెద్ద డీఎస్పీ బ్యాచ్ అని అన్నారు. ఈ 10 నెలలు చాలా కష్టంగా ఉంటుందని.. అన్నింటినీ ఎదుర్కొని సమర్థవంతంగా నిలుస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ప్రజల హృదయాలు గెలవగలగాలని నిర్దేశించారు. కొత్తగా రిక్రెట్ అయిన మహిళా డీఎస్పీలు వచ్చే తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ట్రైనింగ్‌లో స్నేహపూర్వకం గా ఉంటూ.. ఒకరికి ఒకరు తోడ్పాటు అందించుకోవాలని సూచించారు. ఇంటెగ్రిటీ, ఎంపథీ, ప్రొఫెషనల్ ఎక్సలెన్స్.. ఈ మూడు ముఖ్యంగా గుర్తించుకోవాలని అన్నారు. ఈ వంద మంది ట్రైనింగ్‌లోనే కాదు.. బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా కాంటాక్ట్‌లో ఉండాలని తెలిపారు. పోలీసింగ్‌కు నెట్వర్క్ చాలా ముఖ్యమని ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# సైబరాబాద్‌లో మూడ్రోజులు వైన్స్ బంద్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో నిర్ణయం

**హైదరాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో సైబరాబాద్‌లో మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు క్లోజ్ కానున్నాయి. నవంబర్ 9 సాయంత్రం 6 గంటల నుంచి నవంబర్ 11 సాయంత్రం 6 గంటల వరకు వైన్ షాపులు, బార్లు మూసివేయనున్నారు. అలాగే ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజు నవంబర్ 14న ఉదయం 6 గంటల నుంచి లెక్కింపు పూర్తయ్యే వరకు, అవసరమైతే రిపోల్ రోజు కూడా వైన్ షాప్స్ బంద్ కానున్నాయి. ఈ మేరకు సైబరాబాద్


GOVERNMENT OF TELANGANA
POLICE DEPARTMENT


Office of the
Commissioner of Police,
Cyberabad.

No.26-3/Elections/Cyb/2025 Date : 6-11-2025.

NOTIFICATION

In exercise of the powers vested in me under section 20 of Telangana Excise Act, 1968, I Avinash Mohanty, IPS., Commissioner of Police, Cyberabad, do hereby order in the interest of public peace and tranquillity that Wine/Toddy shops and Bars attached to Restaurants (Including Bars in Star Hotels and Registered Clubs) in the polling areas falls under Jubilee Hills A/c under Sanathnagar Police Station limits of Cyberabad Police Commissionerate shall remain closed from 6.00 PM on 09.11.2025 to 6.00 PM of 11.11.2025, and on the day of counting i.e., on 14.11.2025 from 0600 AM to till completion of counting and also the date of re-poll, if any, in view of Bye- Election 2025 to Jubilee Hills Assembly Constituency, Hyderabad is scheduled to be held on 11.11.2025.

The order is as per the statutory provisions laid down under Sec 135-C of



పోలీస్ కమిషనర్ అవినాష్ మోహంతీ ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968లోని సెక్షన్ 20 ప్రకారం అవినాష్ మోహంతీ ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం.. సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రాంతాల్లో ఉన్న అన్ని వైన్ షాపులు, టాడీ దుకాణాలు సహా రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు, స్టార్ హోటల్స్, రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లు మూసివేయనున్నారు. ఈ ఆదేశాలు 9 సాయంత్రం 6 గంటల నుండి నవంబర్ 11 సాయంత్రం 6 గంటల వరకు అమల్లో ఉంటాయి. ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజు, అవసరమైతే రిపోల్ రోజు కూడా ఆంక్షలు కొనసాగుతాయి. ఈ ఆదేశాలు ప్రజాప్రతినిధుల చట్టం 1951 లోని సెక్షన్ 135-ప్రకారం జారీ చేయబడ్డాయని కమిషనర్ అవినాష్ మోహంతీ తెలిపారు.

# డ్రగ్స్ ఓవర్ డోస్‌తో వ్యక్తి మృతి

**హైదరాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి) :** డ్రగ్స్ భూతం యువతను పట్టిపీడిస్తోంది. ఎంతో భవిష్యత్తు ఉన్న అనేక మంది డ్రగ్స్ భూతానికి బలైపోతున్నారు. తమ బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో తరచుగా డ్రగ్స్ పట్టుబడటం కూడా తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసులు అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఏదో ఒక విధంగా సిటీలోకి డ్రగ్స్ ఎంటరవుతూనే ఉంది. తాజాగా డ్రగ్స్ తీసుకుని ఓ వ్యక్తి మరణించడం సంచలనంగా మారింది. డ్రగ్స్ ఓవర్ డోస్‌తో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మొబైల్ రిపేర్ బిజినెస్ చేస్తున్న అలీ డ్రగ్స్‌కు బానిసగా మారాడు. డ్రగ్స్ తీసుకోకుండా ఉండలేని పరిస్థితికి వచ్చాడు. ఈ క్రమంలో నిన్న ఒక అపార్ట్‌మెంట్‌లో అలీ డ్రగ్స్ సేవించాడు. అయితే డ్రగ్స్ ఓవర్ డోస్‌గా తీసుకోవడంతో అలీ ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలిసిన వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అసలు అలీకి డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చింది?... ఎవరి దగ్గర తీసుకున్నాడు? అలీకి డ్రగ్స్‌ను ఎవరు విక్రయించారు? అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# రేవంత్ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ ఆగ్రహం

- ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు



**హైదరాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి) :** ముస్లింల పట్ల బెదరింపు ధోరణితో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని, అతనిపై చర్య తీసుకోవాలని బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసిన శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, మహ్మద్ షకీల్, బీఆర్ఎస్ నేతలు ప్లలె రవికుమార్, కిశోర్ గౌడ్, సల్మాన్‌ఖాన్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ మైనార్టీ నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలపై జరుగుతున్న దాడులు, ముస్లింలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. తక్షణమే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డిని కోరారు. ముస్లింలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఈవో సుదర్శన్ రెడ్డికి వేర్వేరుగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు, మైనార్టీ నేతలు ఫిర్యాదు చేశారు.

# భూ వివాదంలో డమ్మీ తుపాకీతో కాల్పులు



- విచారణ చేపట్టిన పోలీసులు

**మెదక్, నవంబర్6 (జనంసాక్షి) :** ఇద్దరి మధ్య నెలకొన్న భూవివాదం.. ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. పంట కోసేందుకు సిద్ధమైన రైతును అడ్డుకునేందుకు ప్రత్యర్థి డమ్మీ తుపాకీతో బెదిరింపులకు గురి చేశాడు. ఈ ఘటన మెదక్ జిల్లా పరిధిలోని హవేలిఘన్‌పూర్ గ్రామ పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఎల్లం అనే రైతు తన వరి పంటను కొసేందుకు సిద్ధమయ్యాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన హరినాథ్ అనే వ్యక్తి తన అనుచరులతో ఆ పొలం వద్దకు చేరుకున్నాడు. పంట కోసేందుకు వీల్లేదని, ఈ భూమి తనదని డమ్మీ తుపాకీతో ఎల్లంను బెదిరించాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఎల్లం పోలీసులకు సమాచారం అందించాడు. పొలం వద్దకు చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. హరినాథ్ వద్ద ఉన్న డమ్మీ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూవివాదం కోర్టులో ఉందని, వరి పంటను కోసేందుకు ఎల్లం కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# బండి బోరబండ ప్రచారానికి అనుమతి నిరాకరణ

- పోలీసుల తీరుపై మండిపడ్డ బిజెపి శ్రేణులు



**హైదరాబాద్, నవంబర్6 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా చేయనున్న ప్రచారంలో భాగంగా బోరబండలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ మీటింగ్‌కు పోలీసులు అనుమతి రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం బండి సంజయ్ మీటింగ్ గురువారం సాయంత్రం కొనసాగాల్సి ఉంది. తాజాగా ఆయన మీటింగ్ కు పర్మిషన్ ఇవ్వకపోవంతో పోలీసుల తీరుపై బీజేపీ శ్రేణుల మండిపడుతున్నాయి. కాంగ్రెస్ తమపై కుట్రలు చేస్తోందని, కనీసం ప్రచారం చేసుకోనివ్వకుండా ఇలా పర్మిషన్ కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అయితే తమ సభకు అనుమతి ఇచ్చి రద్దు చేయడమేంటని బీజేపీ ఎన్నికల ఇంఛార్జీ ధర్మారావు ప్రశ్నించారు. కచ్చితంగా సాయంత్రం బోరబండలోనే మీటింగ్ జరిపి తీరుతామని స్పష్టం చేశారు. బీజేపీ శ్రేణులంతా భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. బండి సంజయ్ సభకు ఆటంకాలు లేకుండా సహకరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని వెల్లడించారు.

# ప్రాణం తీసిన బీడీ

- మంటలు అంటుకుని వ్యక్తి దుర్మరణం

**నిర్మల్, నవంబర్6 (జనంసాక్షి) :** ఓ వృద్ధుడి ప్రాణాలను బీడీ బలి తీసుకుంది. మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. ఈ దారుణ ఘటన నిర్మల్ జిల్లాలోని దండేపల్లి మండ పరిధిలోని తళ్లపేట గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తళ్లపేట గ్రామానికి చెందిన నాగయ్య(55) తన భార్య, కుమారుడు, కోడలితో కలిసి నివాసం ఉంటున్నాడు. అయితే బుధవారం రాత్రి తన గదిలో నాగయ్య ఒంటరిగా నిద్రించాడు. బీడీ తాగే అలవాటు ఉండడంతో.. అర్ధరాత్రి వేళ వెలిగించాడు. దాన్ని ఆర్పేయకుండానే నిద్రలోకి జారుకున్నాడు. మంటలు మంచానికి అంటుకున్నాయి. దీంతో క్షణాల్లోనే బెడ్‌షీట్లకు మంటలు వ్యాపించి, నాగయ్య సజీవ దహనమయ్యాడు. కాలిన వాసన రావడంతో కుమారుడు, కోడలికి మెలకువ వచ్చింది. అప్పటికే మంటల్లో కాలిపోయిన నాగయ్యను బయటకు లాగారు. కానీ అప్పటికే ప్రాణాలొదిలాడు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# ఏపీలో గ్రామసచివాలయాలకు కొత్తరూపు

**అమరావతి, నవంబర్6 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ సచివాలయాల వ్యవస్థకు కొత్త రూపురేఖలు ఇవ్వడానికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గ్రామ సచివాలయాలకు కొత్త పేరు పెట్టే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఇకపై వాటిని విజన్ యూనిట్స్ గా పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జరిగిన మంత్రులు, అధికారుల సమీక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. గ్రామ సచివాలయాల వ్యవస్థ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించే విధంగా రూపకల్పన చేయాలి. అందుకే వాటిని విజన్ యూనిట్స్‌గా మార్చుతున్నాం. ఇవి భవిష్యత్తులో ప్రజా సేవలకు కేంద్ర బిందువుగా నిలుస్తాయని చెప్పారు. ఇకపై ఈ విజన్ యూనిట్స్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా, సమర్థంగా అందించేందుకు ప్రత్యేక సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. పౌరులకు అవసరమైన సంక్షేమ పథకాలు, రికార్డులు, సర్టిఫికేట్లు, ప్రభుత్వ సహాయ పథకాలను ఒకే వేదికపై అందించే విధంగా ఈ యూనిట్స్ పని చేయనున్నాయి. సీఎం చంద్రబాబు విజన్ యూనిట్స్ రాష్ట్ర భవిష్యత్ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తాయని, గ్రామస్థాయి పాలనను ఆధునిక సాంకేతికతతో మిళితం చేస్తామని తెలిపారు.

# సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి సస్పెన్షన్

**తిరుపతి, నవంబర్ 6 (జనంసాక్షి) :** తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ర్యాగింగ్ వ్యవహారం సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డిపై సస్పెన్షన్ వేటుకు దారితీసింది. విద్యార్థినుల ఫిర్యాదుపై యాంటీ ర్యాగింగ్ కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. ఆ నివేదిక ఆధారంగా విశ్వనాథరెడ్డిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి తుది ఆదేశాలు అందిన తర్వాత తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామని పేర్కొన్నారు. విశ్వనాథరెడ్డి తమను ఇంట్రాక్షన్ సెషన్ పేరుతో ర్యాగింగ్ చేయించారని.. సైకాలజీ మొదటి సంవత్సరం విద్యార్థినులు ఈనెల 3న లిఖిత పూర్వకంగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధిత విద్యార్థినులు వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలతో కలిసి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తమకు రక్షణ కల్పించాలని, తక్షణమే సైకాలజీ ప్రొఫెసర్ విశ్వనాథ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

**హైదరాబాద్, నవంబర్ 6 (జనంసాక్షి) :** హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. పలు ఫిర్యాదులు రావడంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఎపిలో ఇప్పటికే పెద్ద ఎత్తున సోదాలు సాగాయి. ఈ క్రమంలో నగరంలోని మూసాపేట్, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో డాక్యుమెంట్స్ రైటర్స్ లేనిదే రిజిస్ట్రేషన్ పక్రియ జరగట్లదవే వరుస ఫిర్యాదుల నేపథ్యంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు హైదరాబాద్ ఏసిబి డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి.. ప్రజల నుంచి వచ్చిన కంప్లైంట్ లకు బలం చేకూరే విధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేసే సమయంలో 15మందికి పైగా డాక్యుమెంట్ రైటర్స్ ఆఫీస్ లోనే స్లాట్ బుకింగ్ కన్నా పదుల సంఖ్యలో ఎక్కువ డాక్యుమెంట్స్ తో ఉండడంపై అధికారులు దృష్టి పెట్టారు. ఒక డాక్యుమెంట్ రైటర్ వద్ద దొరికిన 10వేల రుపాయలు ఎక్కడి నుంచి వచ్చాయో అన్నకోణంలో దర్యాప్తు చేస్తున్నామని,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్స్ ఉండడంపై జిల్లా ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తామన్నారు.

# వరంగల్‌లో ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

- జ్యోతి వెలిగించి ప్రారంభించిన సినీనటి శ్రీ లీల
- న్యూ కలెక్షన్లతో కళకళ లాడిన షోరూమ్




**వరంగల్ బ్యూరో, నవంబర్ 06 (జనం సాక్షి) :** చారిత్రక వరంగల్ నగరంలోని స్టేషన్ రోడ్ లో గురువారం ఆర్ఎస్ బ్రదర్స్ సరికొత్త షోరూం ప్రారంభమైంది. ఈ షోరూంను ప్రముఖ సినీనటి శ్రీ లీల జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వ్యాపార రంగంలో ప్రముఖ దార్శనీకులైన పి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజమౌళి టీ. ప్రసాదరావు దివంగత పి. సత్యనారాయణ, సుదూర దృష్టితో ప్రణాళిక బద్ధంగా నిలపిన ఆర్ఎస్ బ్రదర్స్ సంస్థ సాంప్రదాయాన్ని ఆధునిక ఫ్యాషన్లను మేలవించి భారత దేశవ్యాప్తంగా కొనుగోలుదారులకు చేరువ అవుతున్న విషయం తెలిసిందే. సినీనటి శ్రీ లీల షోరూం ప్రారంభించిన అనంతరం షోరూంలో ఉన్నటువంటి మూడు అంతస్తుల్లో వివిధ రకాల చీరలు, మెన్స్ ఉమెన్స్ డ్రెస్లతో పాటు చిన్నపిల్లల దుస్తులకు సంబంధించిన అన్ని రకాల ఫ్యాషన్ ఐటమ్స్ ను పరిశీలించి మాట్లాడారు. ఎన్నో రకాల నూతన కలెక్షన్స్ ఆర్ఎస్ బ్రదర్స్ షోరూమ్ లో సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివాహాది శుభకార్యాలకు ఎంతో చక్కని షో రూమ్ ఆర్ఎస్ బ్రదర్స్ అని అన్నారు. వరంగల్ అంటే తనకు ఎంతో ఇష్టమని నటి శ్రీ లీల తెలిపారు. ఈ సందర్భంగా షోరూం ప్రారంభోత్సవం వద్దకు వచ్చినటువంటి ప్రజలకు ఆమె విషెస్ తెలిపారు. ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ డైరెక్టర్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ వినియోగదారుల అభిరుచులకు తగినట్లుగా తమ వద్ద అన్ని రకాల నూతన బ్రాండ్లు ఉన్నట్టు తెలిపారు ఉమెన్స్ వేర్ మెన్స్ వేర్ కిడ్స్ వేర్ రూ. 149ల నుండి ప్రారంభ ధరతో కొనుగోలుదారుల ఆకట్టుకుంటున్నట్లు చెప్పారు. చైర్ పర్సన్ అండ్ హోల్ టైం డైరెక్టర్ పొట్టి వెంకటేశ్వర్లు తమ షోరూంలో వెడ్డింగ్ కలెక్షన్స్ పెళ్లి కుమార్తె సాంప్రదాయ వస్త్రాలంకరణకు సంబంధించిన సాధికారమైన పనితనంతోని కూడిన ప్రత్యేకత గురించి వివరించారు. ఎస్. రాజమౌళి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కొనుగోలుదారుల అభివృద్ధి తాజా ఫ్యాషన్లను ప్రతిబిమించే వస్త్ర శ్రేణి తమ వద్ద లభిస్తుందని చెప్పారు. హోల్ టైమ్ డైరెక్టర్ తిరువీధుల ప్రసాదరావు మాట్లాడుతూ వరంగల్ నగర వాసులకు హృదయపూర్వక స్వాగతం పలికారు. అందరికీ అందుబాటులో ధరలలో ఉండే విధంగా ఆకర్షణ ఏమైనా వస్త్రాలు ఆర్ఎస్ బ్రదర్స్ లో లభిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ స్టేషన్ రోడ్లో ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడంతో స్టేషన్ రోడ్డు మొత్తం కళకళలాడింది. ఈ సందర్భంగా వరంగల్ నగరానికి చెందిన ప్రముఖులు షోరూమ్ సందర్శించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మాజీ క్రికెటర్ల ఆస్తులపై ఈడీ సోదాలు

- ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కేసులో11.12 కోట్ల ఆస్తులు అటాచ్



**న్యూఢిల్లీ, నవంబర్6 (జనంసాక్షి) :** టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ ఆస్తులపై ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు చేపట్టింది. వీరిద్దరూ అక్రమంగా 1లీబెట్ అనే ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ ను ఆమోదించారనే ఆరోపణల నేపథ్యంలో.. సంబంధిత మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా జరిపిన సోదాల్లో రూ. 11.14కోట్ల విలువైన ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తుచేసింది. ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కు సంబంధించి రూ. 4.5 కోట్ల విలువైన స్థిరాస్థులు ఉండగా, మాజీ స్టార్ బ్యాట్స్‌మెన్ సురేశ్ రైనాకు చెందిన రూ. 6.64 కోట్ల విలువైన మ్యూచ్‌వల్ ఫండ్స్ పెట్టుబడులు ఉన్నట్టు సమాచారం. వీరిరువురూ 1లీబెట్, దాని అనుబంధ బ్రాండ్‌లతో ప్రత్యక్షంగా/పరోక్షంగా సంబంధమున్న విదేశీ సంస్థలతో ఉద్దేశపూర్వకంగా ఎండార్స్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకున్నట్టు సంబంధిత అధికారులు ఆరోపించారు. ఈ ప్రమోషనల్ ఒప్పందాలే భారతీయ వినియోగదారులలో అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ విస్తరణకు సాయపడి ఉండొచ్చని, ఫలితంగానే ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టినట్టు తెలుస్తోంది. అయితే.. ఈ ఘటనపై ఇప్పటివరకూ రైనా, ధావన్‌లెవరూ స్పందించలేదు.రైనా, ధావన్‌లతో పాటు మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, నటులు సోనూసూద్, ఊర్వశి రౌతేలా, తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి , బెంగాలీ నటుడు అంకుష్ హజ్రా వంటి పలువురు ప్రముఖులనూ ఈడీ ప్రశ్నించింది. బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ దాని అనుబంధ సంస్థలతో వీరికి సంబంధమున్నట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో వీరిని విచారించినట్టు తెలుస్తోంది. ఇక్కడి చట్టాల ఉల్లంఘనలకు పాల్పడుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ దర్యాప్తులు చేపట్టింది. భారతదేశంలో బెట్టింగ్ వంటి వాటిపై నిషేధం ఉన్నప్పటికీ ఈ ప్లాట్‌ఫామ్ మాత్రం ఆన్‌లైన్ ప్రమోషన్లు, ప్రముఖుల ఆమోదంతో యువతను ఆకర్షిస్తోందని సమాచారం.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370